thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 137 కరీంనగర్ శనివారం, 26 జులై 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఆరో తరం ఫైటర్ జెట్‌పై భారత్ దృష్టి

న్యూఢిల్లీ : అత్యాధునిక ఆరో తరం ఫైటర్ జెట్‌ల అభివృద్ధిపై భారత్ దృష్టి సారించింది. ఇందుకు సంబంధించి యునైటెడ్ కింగ్‌డమ్(యూకే), జపాన్, ఇటలీ సంయుక్తంగా నిర్వహిస్తున్న గ్లోబల్ కాంబాట్ ఎయిర్ ప్రోగ్రామ్ (జీసీఏపీ) ప్రాజెక్టులో చేరేందుకు భారత్ ఆసక్తి చూపిస్తోంది. కానీ, రక్షణ రంగంలో భారత్, రష్యా మధ్య ఉన్న బలమైన బంధం నేపథ్యంలో జీసీఏపీలో భారత్‌ను చేర్చుకునే అంశంలో జపాన్ ఓ నిర్ణయానికి రాలేకపోతోంది. జపాన్ మీడియాలో ఈ మేరకు కథనాలు వెలువడ్డాయి. ఆరో తరం ఫైటర్ జెట్‌లను కలిసి అభివృద్ధి చేసేందుకు యూకే, జపాన్, ఇటలీ.. 2022 డిసెంబరులో జీసీఏపీ ప్రాజెక్టును చేపట్టాయి. 2035 నాటికి అత్యాధునిక ఫైటర్ జెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలనేది లక్ష్యం.




# రచ్చ రేపుతున్న ఏపీ లిక్కర్ స్కాం..!

# కదులుతున్న తెలంగాణ డొంక!!

హైదరాబాద్/అమరావతి : మద్యం కుంభకోణం కేసులో తెలంగాణ నేతలకు ప్రమేయం ఉందా? నాటి ప్రభుత్వ పెద్దలు కూడా సహకరించారా? హైదరాబాదులోనే స్కెచ్ వేశారా? ఏపీ మద్యం కుంభకోణానికి అక్కడే బీజం పడిందా? ఇప్పుడు ఇవే అందరిలో అనుమానాలు. ఏపీ మద్యం కుంభకోణం ప్రకంపనలు రేపుతోంది. జాతీయ స్థాయిలో కూడా చర్చ నడుస్తోంది. దాదాపు రూ.3,500 కోట్ల రూపాయలను నేతలు కొల్లగొట్టారని ప్రత్యేక దర్యాప్తు బృందం తన చార్జి షీట్ లో స్పష్టం చేసింది. ఇప్పటివరకు ఈ కేసులో 12 మంది అరెస్టు అయ్యారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్టుతో మరింత సంచలనంగా మారింది మద్యం కుంభకోణం. అయితే తాజాగా శ్రవణ్ రావు అనే వ్యక్తిని ప్రత్యేక దర్యాప్తు బృందం విచారించింది. అయితే ఆయన తెలంగాణ ఫోన్ టాపింగ్ కేసులో నిందితుడు కావడం గమనార్హం.

**శ్రవణ్ రావు అరెస్టుతో..** అయితే ఇప్పుడు ఏపీ మద్యం కుంభకోణంలో తెలంగాణకు చెందిన శ్రవణ్ రావును విచారించడం మాత్రం ఈ కేసు కొత్త మలుపు తిరిగినట్టు అయ్యింది. అయితే మద్యం కుంభకోణం కేసులో నిందితులకు దుబాయిలో శ్రవణ్ రావు ఆశ్రయం కల్పించారన్నది ప్రధాన అభియోగం. ఈ అంశంపై విచారించేందుకే ఆయనకు నోటీసులు ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో శ్రవణ్ రావు విజయవాడలోని సిట్ అధికారుల విచారణకు హాజరయ్యారు. అయితే మద్యం కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న రాజ్ కసిరెడ్డికి శ్రవణ్ రావు అత్యంత సన్నిహితుడని తెలుస్తోంది. మరోవైపు జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించిన తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో శ్రవణ్ రావు కీలక నిందితుడిగా ఉన్నారు.

**ఒకేసారి రెండు అంశాలు..** తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసులో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం, ఏపీలో మద్యం కుంభకోణం కేసులో వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం కీలక పాత్ర పోషించినట్లు ఇప్పుడు ఆరోపణలు వచ్చాయి. సరిగ్గా ఇదే సమయంలో ఫోన్ ట్యాపింగు కేసులో నిందితుడిగా ఉన్న శ్రవణ్ రావు ను ఏపీ మద్యం కుంభకోణం కేసులో విచారణ జరపడం అనేది మరింత చర్చకు దారితీస్తోంది.

తప్పకుండా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు.. కొంతమంది ఏపీ మద్యం కుంభకోణానికి సహకరించి ఉంటారన్న అనుమానాలు పెరుగుతున్నాయి. ఇదే అంశంపై టిడిపి అనుకూల మీడియా పతాక స్థాయిలో కథనాలు రాస్తోంది. ఇవి ప్రజల్లోకి బలంగా వెళుతున్నాయి.

**మొత్తం హైదరాబాద్ నుంచి..** ఏపీలో మద్యం కుంభకోణానికి సంబంధించి వ్యూహం మొత్తం హైదరాబాదు నుంచి జరిగింది. హైదరాబాదులో పలుమార్లు సిటింగులు కూడా జరిగాయని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ నేత విజయసాయిరెడ్డి సైతం వెల్లడించారు. కుంభకోణంలో ప్రధాన సూత్రధారి రాజ్ కసిరెడ్డి అని తేల్చేశారు. ఇప్పుడు అదే రాజ్ కసిరెడ్డి సన్నిహితులపై దృష్టి పెట్టింది ప్రత్యేక దర్యాప్తు బృందం. అయితే సిట్ తన రెండో చార్జ్ షీట్లో తెలంగాణకు సంబంధించిన వ్యక్తుల ప్రమేయం గురించి ప్రస్తావించే అవకాశం ఉంది. మొత్తానికైతే ఏపీ మద్యం కుంభకోణం తీగలాగితే తెలంగాణలో డొంక కదులుతుండడం విశేషం.




## తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ నియోజవర్గాల పెంపుపై సుప్రీంకోర్టు సంచలనం

న్యూ ఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య పెంచాలంటూ దాఖలైన పలు పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టేవేసింది. ఈ కేసుపై జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం గురువారం కీలక తీర్పు వెలువరించింది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్యను పెంచే ప్రతిపాదనకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ప్రొఫెసర్ కే. పురుషోత్తం రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను ధర్మాసనం తోసిపుచ్చింది. ఏపీ, తెలంగాణ లను మినహాయించి కొత్తగా రూపొందించిన జమ్ము కాశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం అసెంబ్లీ పార్లమెంటు నియోజకవర్గం మాత్రమే పునర్విభజన చేయడం అసమంజసమని పేర్కొన్న పిటీషనర్ల వాదనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఆర్టికల్ 170(3) ప్రకారం రాష్ట్రాల అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనపై పరిమితులు ఉండే అవకాశముందని పేర్కొంది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం ఇచ్చిన ప్రతిపాదనలో మార్పులు చేయడం కేంద్రం నిబంధనల ప్రకారమేనని వివరించింది. జమ్మూ కశ్మీర్‌లో నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ రాజ్యాంగ పరిధిలోనే జరిగిందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆ ప్రాంతంలో జరిగిన పునర్విభజనను తెలుగు రాష్ట్రాలతో పోల్చడం తగదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఏపీ, తెలంగాణలను పునర్విభజన నోటిఫికేషన్ నుండి మినహాయించడంలో కేంద్రానికి ప్రత్యేక ఉద్దేశ్యం లేదని, ఇందులో రాజ్యాంగ విరుద్ధత లేదని సుప్రీంకోర్టు తేల్చింది. కాగా, ఈ తీర్పుతో తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల పెంపు ఆశపై నీళ్లు చల్లినట్లైంది.



### కమల్ హాసన్ అను నేను..

## రాజ్యసభ సభ్యుడిగా కమల్ హాసన్ ప్రమాణస్వీకారం

తమిళనాడు, జులై 25: నటుడు, మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) అధినేత కమల్ హాసన్ రాజ్యసభ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు తమిళనాడు నుంచి మరో ఐదు మంది.. డీఎంకే నుండి పి. విల్సన్, సల్మా, ఎస్.ఆర్. శివలింగంతో పాటు మరికొంత మంది ప్రమాణస్వీకారం చేశారు. గత జూన్‌లో డీఎంకే కూటమి మద్దతుతో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో వీరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా 2018లో ఎంఎన్ఎం పార్టీని స్థాపించిన కమల్ హాసన్..2021 తమిళనాడులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమికి మద్దతు ప్రకటిస్తూ.. డీఎంకేకు తమ పార్టీ మద్దతును ప్రకటించారు. ఈ ఎన్నికల్లో కూటమి విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. డీఎంకే పార్టీ తమిళనాడులో తమ పార్టీ జెండా ఎగురవేసింది. ప్రస్తుతం తమిళనాడు అసెంబ్లీలో డీఎంకేకు 134 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. దీంతో నాలుగు రాజ్యసభ స్థానాలనూ ఆ పార్టీనే దక్కించుకుంది. పొత్తులో భాగంగా 2025 రాజ్యసభ ఎన్నికల్లో ఎంఎన్ఎం పార్టీకి రాజ్యసభ స్థానం ఇచ్చేందుకు డీఎంకే నేతృత్వంలోని కూటమి అంగీకరించింది. ఈ నేపథ్యంలో కమల్ హాసన్ రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



## మాల్దీవుల రక్షణ కార్యాలయంపై మోదీ ఫొటో

రెండు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ మాల్దీవులకు చేరుకున్నారు. ఆయనతో పాటు కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, విదేశీ వ్యవహారాల కార్యదర్శి విక్రమ్ మిస్రీ ఉన్నారు.

ఈ నేపథ్యంలో మాల్దీవుల రక్షణ కార్యాయంపై మోదీ ఫొటో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆ దేశ రాజధాని మాలెలోని రిపబ్లిక్ స్క్వేర్ వద్ద మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు.. భారత ప్రధానికి అధికారికంగా స్వాగతం పలికారు. ఆ దేశ సైనికుల గౌరవ వందనాన్ని మోదీ స్వీకరించారు. శనివారం జరగనున్న మాల్దీవుల 60వ జాతీయ దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు.

**మాల్దీవుల్లో మోదీ.. స్వయంగా ప్రధానిని ఆహ్వానించిన ముయిజ్జు...** మాల్దీవుల పర్యటనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను ప్రధాని సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ పర్యటనతో ఇరుదేశాలు, ప్రజల మధ్య సంబంధాలు మరింత బలపడతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ, ముయిజ్జు సమావేశమై దౌత్య, వాణిజ్య చర్చలు జరపనున్నారు. గతేడాది మోదీపై, లక్షద్వీప్‌పై మాల్దీవుల మంత్రులు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతో రెండు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. విభేదాల అనంతరం ప్రధాని ఆ దేశానికి వెళ్లడం ఇదే మొదటిసారి కావడంతో ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.




## ఆపరేషన్ సిందూర్‌పై పార్లమెంటులో 32 గంటలు చర్చ: కేంద్ర మంత్రి

న్యూఢిల్లీ: 'ఆపరేషన్ సిందూర్'పై పార్లమెంటులో సోమ, మంగళవారాల్లో 32 గంటలపాటు ప్రత్యేక చర్చ జరుపనున్నట్టు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు శుక్రవారం తెలిపారు. సోమవారం లోక్‌సభలో చర్చ అనంతరం మంగళవారం రాజ్యసభలో చర్చ ఉంటుందని చెప్పారు. లోక్‌సభలో 16 గంటలు, రాజ్యసభలో 16 గంటల చొప్పున చర్చకు సమయం కేటాయించినట్టు వివరించారు. 'పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో సోమవారం ప్రత్యేక చర్చకు బిజినెస్ అడ్వయిజరీ కమిటీ నిర్ణయించింది. విపక్షాలు పలు అంశాలు లేవనెత్తాలని కోరుతున్నాయి. ఆపరేషన్ సిందూర్‌పై చర్చను చేపట్టేందుకు మేము అంగీకరించాం' అని రిజిజు తెలిపారు. చర్చకు తాము సిద్ధంగా ఉన్నట్టు విపక్షాలకు చెప్పామని, అయితే మొదటి రోజు నుంచీ విపక్షాలు పార్లమెంటు లోపల, వెలుపల ఆందోళన చేపట్టాయని రిజిజు అన్నారు. మొదటి వారంలో కేవలం ఒకే బిల్లు ఆమోదించామని, సభను సజావుగా సాగేలా చూడాలని విపక్షాలను కోరినట్టు చెప్పారు. నిబంధనల ప్రకారం వారు ఏ అంశాన్నైనా లేవనెత్తొచ్చని, పార్లమెంటు పనిచేయకపోతే దేశానికి నష్టం జరుగుతుందని అన్నారు.

# అప్పుడు తప్పు చేశా

# ఇప్పుడు సరిదిద్దుకుంటున్నా!

న్యూఢిల్లీ: కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కులగణన చేయలేకపోయామని, అది ముమ్మాటికీ తన తప్పుదమేనని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. ఢిల్లీలో శుక్రవారం జరిగిన భాగిదారి న్యాయ సమ్మేళన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2004 నుంచి తాను రాజకీయాల్లో ఉన్నానని, ఒకసారి వెనక్కి తిరిగి చూసినప్పుడు తాను ఓ తప్పు చేశానని అర్థమవుతోందని అన్నారు. ఓబీసీల హక్కులను రక్షించాల్సిన విధంగా రక్షించలేదని, అప్పట్లో ఓబీసీల సమస్యలను లోతుగా అర్థం చేసుకోలేకపోయానని పేర్కన్నారు. 'మీ (ఓబీసీ) చరిత్ర, సమస్యలను కొంచెం ముందుగానే తెలుసుకుని ఉన్నట్లయితే అప్పట్లోనే కులగణన చేపట్టి ఉండేవాడిని. అది కాంగ్రెస్ పార్టీ తప్పుకాదు, ముమ్మాటికీ నా తప్పే. ఇప్పుడు ఆ తప్పును సరిచేసుకునే ప్రయత్నం చేస్తున్నాం' అని రాహుల్ అన్నారు.

**తెలంగాణ రోల్‌మోడల్...** తెలంగాణ కులగణన దేశానికే రోల్‌మోడల్ అని రాహుల్ గాంధీ అన్నారు. దేశవ్యాప్తంగా కులగణన చేసే వరకూ విశ్రమించేది లేదని స్పష్టం చేశారు.




ఇది తన శపథమని అన్నారు. అవకాశాలు అందిపుచ్చుకునే సామర్థ్యం అందరికీ రావాలని, తమ శక్తిని తాము తెలుసుకోకపోవడమే కొందరి సమస్యని చెప్పుకొచ్చారు. దేశంలో దళితుల చరిత్రను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అర్థం చేసుకున్నారని చెప్పారు. ఓబీసీల చరిత్ర ఎక్కడుంది? ఎవరు రాశారు? అని ప్రశ్నించారు రాహుల్. ఓబీసీల చరిత్ర రాయకపోవడం వెనుక ఆర్ఎస్ఎస్ కుట్ర ఉందని ఆరోపించారు. ఓబీసీలు అన్ని రంగాల్లో వివక్ష ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ ఇండియాలో ఓబీసీలు ఎక్కడున్నారని రాహుల్ నిలదీశారు. అదానీ ఓసీసీనా, మీడియా రంగంలో ఓబీసీలకు స్థానం ఎక్కడుంది? అని ప్రశ్నించారు. అభివృద్ధిలో విద్యదే కీలకపాత్ర అని, ఇంగ్లీషు నేర్చుకుంటే అవకాశాలు రెట్టింపు అవుతాయని అన్నారు. బీజేపీ నేతలు ఇంగ్లీషును వ్యతిరేకిస్తున్నారని మండిపడ్డారు. ప్రాంతీయ భాషలు ముఖ్యమేనని, ఇంగ్లీషూ ముఖ్యమేనని చెప్పారు. ఇంగ్లీషును వ్యతిరేకిస్తున్న వారు తమ పిల్లలను ఎక్కడ చదివిస్తున్నారని ప్రశ్నించారు. ప్రైవేటు సంస్థల్లోనూ రిజర్వేషన్లు తీసుకురావాలని రాహుల్ డిమాండ్ చేశారు.




హైదరాబాద్: సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించాల్సిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం వాయిదా పడింది. ఏఐసీసీ సమావేశంలో పాల్గొనేందుకు మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి ఢిల్లీలోనే ఉన్నారు. వీరితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. ఐదుగురు మంత్రులు ఢిల్లీలోనే ఉండటంతో క్యాబినెట్ సమావేశం వాయిదా వేయాలని సీఎం నిర్ణయించారు. ఈనెల 28న మధ్యాహ్నం 2 గంటలకు క్యాబినెట్ భేటీ నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.




వరంగల్: వరంగల్‌లోని మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణం పనుల్లో మరో కీలక ముందడుగు పడింది. ఎయిర్‌పోర్టు భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. రూ.205 కోట్లు విడుదల చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయి. మామునూరు వద్ద కొత్త బ్రౌన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు మార్చి నెలలో పచ్చజెండా ఊపారు. ఈ విమానాశ్రయానికి అన్ని అనుమతులు ఇస్తూ.. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ (ఏఏఐ) నిర్మాణం ప్రారంభించడానికి వీలుగా సంబంధిత దస్త్రంపై సంతకం చేశారు. మరో 253 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరించి ఇస్తే కొత్త విమానాశ్రయ నిర్మాణం మొదలుపెడతామని కేంద్రమంత్రి ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే భూసేకరణ కోసం ప్రభుత్వం తాజాగా నిధులు విడుదల చేసింది.

## 42 శాతం రిజర్వేషన్లతో నిజమైన బీసీలు నష్టపోతారు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్: బీసీలకు రిజర్వేషన్ పేరుతో ముస్లింలకు రిజర్వేషన్ కల్పిస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. నాంపల్లిలో పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 42 శాతం రిజర్వేషన్లతో నిజమైన బీసీలు నష్టపోతారని చెప్పారు. 10 శాతం ఈబీసీ రిజర్వేషన్లను ముస్లింలు కూడా పొందుతున్నారన్నారు. 42 శాతం రిజర్వేషన్లతో బీసీలకు న్యాయం జరగదని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల వల్ల ఎంఐఎం పార్టీకే లబ్ధి అన్నారు. "బీసీని ముఖ్యమంత్రి చేసిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉందా?. బీసీని ప్రధానిని చేసిన ఘనత భాజపాది. రాజకీయ లబ్ధి కోసమే రిజర్వేషన్ అంశాన్ని ఎత్తుకున్నారు. ప్రజలు తిరస్కరిస్తున్నా కాంగ్రెస్‌కు బుద్ధి రాలేదు. అధికారంలో ఉన్న 3 రాష్ట్రాల్లో ఆ పార్టీ ఓడిపోతుంది. మోదీ కులాన్ని కాంగ్రెస్ ప్రభుత్వమే బీసీ జాబితాలో చేర్చింది. పెంచిన బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలు జరగాలని కోరుకుంటున్నాం" అని కిషన్‌రెడ్డి అన్నారు.

## హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్‌కు ఎస్తోనియా సహకారం తీసుకుంటాం: శ్రీధర్‌బాబు



హైదరాబాద్: డ్రోన్ టెక్నాలజీలో తెలంగాణ గణనీయ అభివృద్ధి సాధించిందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్‌లో తయారైన డ్రోన్లు 'ఆపరేషన్ సిందూర్'లో పాకిస్థాన్‌కు భారీ నష్టం కలిగించాయని చెప్పారు. ఎస్తోనియా దేశ రాయబారి మ్యారియే లూప్ ఆధ్వర్యంలో ఆ దేశ వాణిజ్య ప్రతినిధుల బృందంతో సచివాలయంలో మంత్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ-గవర్నెన్స్, హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్‌లో ప్రపంచంలోనే అద్భుత ప్రగతి సాధించిన ఎస్తోనియా సహకారం తీసుకుంటామన్నారు. వాణిజ్యం, ఏఐ సాంకేతికత, సైబర్ సెక్యూరిటీలో కూడా కలిసి పనిచేయాలని ఆ దేశ ప్రతినిధుల బృందాన్ని మంత్రి కోరారు. ఫుడ్ ప్రాసెసింగ్, బ్రాండెడ్ మద్యం ఉత్పత్తి రంగాల్లో తెలంగాణ ముందంజలో ఉందని.. తమతో కలిసి పనిచేసే విషయాన్ని పరిశీలించాలని మంత్రి సూచించారు. సెప్టెంబరులో తమ దేశం సందర్శించాలని శ్రీధర్‌బాబును ఎస్తోనియా రాయబారి మ్యారియే లూప్ కోరారు.

తమ అధికారుల బృందం వచ్చి.. విద్య, ఈ-గవర్నెన్స్, ఏఐ, రోబోటిక్స్‌లో పరస్పరం సహకారంపై చర్చిస్తుందని మంత్రి తెలిపారు. సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక సీఎస్ సంజయ్ కుమార్, మీ సేవ కమిషనర్ రవికిరణ్, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.




హైదరాబాద్: భాజపా అగ్రకుల పార్టీ అని, బీసీ బిల్లుకు ఆమోదం తెలపకుండా ఆ పార్టీ నేతలు అనవసరమైన మాటలు మాట్లాడుతున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆక్షేపించారు. బిల్లును ఆమోదించాలని కేంద్రం, భాజపా అధిష్ఠానాన్ని ఎంపీ రఘునందన్‌రావు ఎందుకు ఒత్తిడి చేయడం లేదని ప్రశ్నించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు కావొద్దని ఆయన కోరుకుంటున్నారని మండిపడ్డారు. "మా పీసీసీ అధ్యక్షుడు బీసీ బిడ్డ. మరి మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎవరు?బీసీలకు పార్టీ అధ్యక్ష పదవి ఇవ్వాలని మీ అధిష్ఠానాన్ని ఎందుకు డిమాండ్ చేయట్లేదు? మేం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం. భవిష్యత్తులో అన్ని అవకాశాలు కల్పించి తీరుతాం. బీసీ బిడ్డ కాకపోయినా మా సీఎం రేవంత్‌రెడ్డి బీసీ బిల్లు తీసుకొచ్చారు. కాంగ్రెస్‌కు రఘునందన్‌రావు పాఠాలు అవసరం లేదు. సామాజిక న్యాయం అంటేనే కాంగ్రెస్. మీ వల్ల కాకపోతే రాహుల్ గాంధీ ప్రధాని అయ్యాక బిల్లును ఆమోదించుకుంటాం"అని ఆది శ్రీనివాస్ అన్నారు.




హైదరాబాద్, జులై 25: బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడడంతో.. హైదరాబాద్‌తోపాటు నగర శివారు ప్రాంతాల్లో గత రెండ్రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. ఈ వర్షాల కారణంగా ప్రజలు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. మరోవైపు మరో రెండ్రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇక వర్షం.. కొంత సేపు ముసురులా.. మరికొంత సేపు భారీగా కురవడంతో పలు కాలనీలు నీట మునిగాయి. అలాగే రహదారులపైకి సైతం భారీగా నీరు వచ్చి చేరింది. దీంతో నగరపాలక సంస్థ, హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తమయ్యాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గ్రేటర్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. ఆ నీరు సక్రమంగా వెళ్లే డ్రైనేజ్ మార్గం లేక పోవడంతో.. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక హైటెక్ సిటీ, ఎంజే మార్కెట్, మాదాపూర్, ఉప్పల్, కుషాయిగూడ, ముషీరాబాద్, అమీర్‌పేట్, చాదర్‌ఘాట్, మలక్‌పేట, దిల్‌షుఖ్‌నగర్, కొత్తపేట్, ఎల్బీ నగర్, హయత్ నగర్, సరూర్ నగర్, కోఠి, అబిడ్స్, బేగంబజార్, పాతబస్తీ, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయింది.

**విద్యుత్ సరఫరాలో అంతరాయం..** ఇక భారీ వర్షాలతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. వివిధ ప్రాంతాల్లో కొన్ని గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో.. ఫ్యూజ్ ఆఫ్ కాల్‌కు ఫోన్ చేసినా.. స్పందన కరువైందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా.. జంట నగరాల శివారు ప్రాంతంలోని జలాశయాల నీటి మట్టం భారీగా పెరిగింది. మరోవైపు హుస్సేన్ సాగర్ నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతోంది. దీంతో దిగువనున్న ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఇంకోవైపు.. భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ, ఎస్డీఆర్ఎఫ్, హైడ్రా, పోలీసులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.




మైక్రోసాఫ్ట్‌లో భారీగా ఉద్యోగాల కోత విధించడం సీఈవో సత్యనాదెళ్లను కూడా భావోద్వేగపరంగా కదిలించింది. అదే సమయంలో కృత్రిమ మేధతో చోటుచేసుకొంటున్న మార్పులు గందరగోళంగా ఉన్నాయన్నారు. గురువారం ఆయన ఉద్యోగులకు వీడ్కోలు పలుకుతూ ఎమోషనల్ మెసేజ్ ను పంపారు. దీనిలో ఆయన చాలా సూటిగా రాసుకొచ్చారు. "అన్ని విషయాల కంటే ముందు భావోద్వేగపరంగా నాపై ప్రభావం చూపుతున్న అంశాలపై మాట్లాడాలనుకుంటున్నాను. అదే సమయంలో మీరు దేనిగురించి ఆలోచిస్తున్నారో కూడా నేను అర్థం చేసుకోగలను. ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం చాలా కష్టం. అవి మా తోటి ఉద్యోగులపైనా ప్రభావం చూపుతాయి. మన టీమ్‌మేట్స్, కొలీగ్స్, ఫ్రెండ్స్‌తో మనకు ఎన్నో అనుభవాలు, అనుబంధాలు, జ్ఞాపకాలు ఉంటాయి. ఇది ఓ పరిశ్రమ విజయరహస్యమే అయినా దానికి ఎలాంటి విలువ లేదు. అభివృద్ధి గీత గీసినట్లు సూటిగా ఉండదు.. ఎగుడుదిగుడులు ఉంటాయి. కొన్నిసార్లు వైవిధ్యంగా కూడా ఉంటుంది. కానీ, ఎప్పుడూ పురోగతిని కోరుకుంటుంది. కానీ, మార్పునకు ఇది మనకిచ్చే సరికొత్త అవకాశం. భవిష్యత్తులో మరింత ముందుకుసాగండి" అని సత్య నాదెళ్ల పేర్కొన్నారు. అంతేకాదు.. మైక్రోసాఫ్ట్ భవిష్యత్తు దార్శనికతలో ఏఐ కీలకభాగమనే సందేశాన్ని ఆయన ఈ మెమోలో పేర్కొన్నారు. భూమిపై ప్రతి వ్యక్తి, సంస్థ మరింత అభివృద్ధి సాధించాలంటే కచ్చితంగా కృత్రిమేధ సంస్కృతికి అలవాటుపడాల్సిందేనన్నారు. కొత్తతరం ఏఐ అంటే కేవలం కొన్నింటికి అవసరమైన టూల్స్‌ను అభివృద్ధి చేయడం కాదన్నారు. ప్రతిఒక్కరూ సొంతంగా తమకు అవసరమైన టూల్స్‌ను తయారుచేసుకునేందుకు కావాల్సిన టూల్స్‌ను అభివృద్ధి చేయాలన్నారు. ఈ క్రమంలో భవిష్యత్తులో మరిన్ని లేఆఫ్‌లు ఉండవన్న హామీ మాత్రం ఆయన నుంచి రాలేదు. మైక్రోసాఫ్ట్ ఉద్యోగుల సంఖ్యలో మాత్రం పెద్దగా మార్పులు లేవని ఆ నోట్‌లో పేర్కొన్నారు. మైక్రోసాఫ్ట్ ఉత్పత్తులు, వ్యాపారాల్లో కృత్రిమేధతో మార్పులు చోటుచేసుకొంటున్న వేళ.. ఉద్యోగులు గ్రోత్ మైండ్‌సెట్‌తో ఉండాలని కోరారు. "ప్రస్తుతం తాను గందరగోళానికి గురవుతున్నాను .. కానీ, మార్పులు చోటుచేసుకొనే సమయంలో ఎప్పుడైనా ఇలాంటి పరిస్థితి తప్పదు. మా టీమ్‌లను పునర్ వ్యవస్థీకరిస్తున్నాం.. దీంతో పరిధులు పెరుగుతున్నాయి. సరికొత్త అవకాశాలు అన్నిచోట్లా ఉన్నాయి" అని పేర్కొన్నారు.




భద్రాచలం: కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో ప్రముఖ కంటి వైద్యుడు, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిష్ నగేష్ భీమపాక బావ.. నారాయణరావుకు సైబర్ నేరగాళ్ల నుంచి బెదిరింపులు ఎదురయ్యాయి. నారాయణరావు క్లినిక్‌లో ఉన్న సమయంలో సైబర్ నేరగాళ్లు బెంగళూరు నుంచి పోలీసుల పేరుతో వీడియోకాల్ చేశారు. "బెంగళూరులో మీపై 17 కేసులు నమోదయ్యాయి. మీ ఆధార్ కార్డు దుర్వినియోగమైంది. మీ పేరుతో ఉన్న మరో ఫోన్ నెంబరుతో చట్ట వ్యతిరేక పనులు జరిగాయి. డిజిటల్ అరెస్టు చేస్తున్నాం.. తలుపులు, కిటికీలు అన్నీ మూసేసి విచారణలో పాల్గొనాలి. బెంగళూరు వచ్చి పోలీసుల ఎదుట హాజరుకావాలి" అని నిన్న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బ్లాక్ మెయిల్ చేశారు.

## కేసీఆర్ మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రాభివృద్ధి: కేటీఆర్



కామారెడ్డి: కేసీఆర్ మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కామారెడ్డి జిల్లా లింగంపేటలో నిర్వహించిన 'ఆత్మగౌరవ గర్జన' సభకు ఆయన హాజరై మాట్లాడారు. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ఆధారంగానే రాష్ట్రాన్ని తెచ్చుకున్నామన్నారు. కరోనా సమయంలోనూ తమ ప్రభుత్వం ఏ పథకాలు ఆపలేదని చెప్పారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో ఓటుతో కాంగ్రెస్ నేతలకు బుద్ధి చెప్పాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.




## నిద్రమత్తులో డ్రైవింగ్.. ఇంటి గోడెక్కిన కారు

హైదరాబాద్: దుండిగల్ పరిధి శంభీపూర్‌లో కారు బీభత్సం సృష్టించింది. డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి ఎగిరి సమీపంలోని ఇంటిగోడపై పడింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఘటనా స్థలికి చేరుకున్న ట్రాఫిక్ పోలీసులు క్రేన్ సాయంతో కారును కిందకు దించారు. ప్రమాద సమయంలో కారులో ఉన్న ఇద్దరికి గాయాలైనట్టు సమాచారం. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఘటన జరిగిందని, డ్రైవర్ మద్యం సేవించి ఉన్నాడని స్థానికులు చెబుతున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

చురకలు



# చేనేతకు ప్రగడ కోటయ్య చేయూత - జూలై 26... ప్రగడ కోటయ్య జయంతి




భారత స్వాతంత్ర్యోద్యమములో ప్రధాన భూమిక పోషించి, స్వాతంత్ర్య సమపార్జనకు ఒక సాధనంగా నిలిచింది చేనేత. ఆలాంటి చేనేత రంగానికి, కార్మికులపై జరిగిన నిర్లక్ష్యం, నిరాదరణ గురించి అనునిత్యం తపించిన చేనేత నాయకుడు ప్రగడ కోటయ్య. చేనేత కార్మికులను సంఘటితం చేసి, అహరహం ఎన్నో పోరాట రూపాలలో ప్రత్యక్షంగా పాల్గొని, వారి ఆత్మ బంధువు గా వారి హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయిన నేత ఆయన. ప్రగడ కోటయ్య గుంటూరు జిల్లా, నిడుబ్రోలులో చేనేత వృత్తిగా గల ప్రగడ వీరభద్రుడు, కోటమ్మ దంపతులకు 1915, జూలై 26న జన్మించాడు. 1931లో ఎస్ఎస్ఎల్సి స్కూలు ఫైనల్ ప్యాసయ్యాడు. కొంతకాలం బాపట్ల తాలూకా బోర్డులో ఉపాధ్యా యుడుగా చేసాడు. ఆక్స్ ఫర్డు విశ్వ విద్యాలయంలో భారతీయ చేనేత పరిశ్రమ పై పరిశోధన జరిపిన ఆచార్య ఎన్ జి రంగా సలహా మేరకు మద్రాసు లోని టెక్స్టైల్స్ ఇన్స్టిట్యూట్ చదివి అక్కడ సూపర్వైజర్ పని చేసాడు. 1935లో ఏర్పడిన మద్రాసు రాష్ట్ర చేనేత పారిశ్రామికుల సహకార సంఘంలో ప్రొడక్షన్ ఇన్చార్జిగా ఉద్యోగంలో చేరి సర్కారు జిల్లాల్లో ప్రాథమిక చేనేత సహకార సంఘాలు ఏర్పాటు చేసేందుకు విశేషంగా కృషి చేశాడు. 1952 నుంచి 1962 వరకు రెండు పర్యాయాలు, తర్వాత 1957 నుంచి 1972 వరకు ఎమ్మెల్యేగా, 1974 నుంచి 1980 వరకు ఎమ్మెల్సీగా ఉన్నాడు. అనంతరం 1990 నుంచి 1995లో మరణించేంత వరకు రాజ్యసభ సభ్యునిగా ఉన్నాడు. 1974 నుంచి 1978 వరకు పీసీసీ ప్రధాన కార్యదర్శిగా పని చేసాడు. 1945లో ఏర్పడిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ వీవర్స్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా బాధ్య తలు నిర్వహించాడు. 70వ జన్మదినం సందర్భంగా చీరాలలో జరిగిన సభలో ఆనాటి ఉత్తరప్రదేశ్ గవర్నర్ బెజవాడ గోపాలరెడ్డి, ఇతడికి 'ప్రజాబంధు' బిరుదునిచ్చి సత్కరించారు. కోటయ్య మరణాంతరం రాష్ట్ర ప్రభుత్వం వెంకటగిరిలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ సంస్థకు ప్రగడ కోటయ్య పేరు పెట్టింది. మెడికల్ సెలక్షన్ కమిటీ సభ్యుని గా, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీగా ఆంధ్ర విశ్వ విద్యాలయం సెనేట్ సభ్యునిగా పదవీ బాధ్యతలు సమర్ధ వంతంగా ప్రగడ కోటయ్య నిర్వహించారు. 1937 జూన్లో నిడుబ్రోలులో గుంటూరు జిల్లాలో ఎన్.జి.రంగా, తాడిపర్తి శ్రీకంఠం, దామెర్ల రమాకాంతరావు, రామనాథం రామదాసు, పెండెం వెంకట్రాములు మొదలైన ప్రముఖ నాయకులు పాల్గొన్న చేనేత మహా సభను వెనుక వుండి నడిపించింది ప్రగడ కోటయ్యే. అప్పటి మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రి సి. రాజగోపాలా చారి ముఖ్య అతిథిగా గుంటూరులో చెన్న రాష్ట్ర చేనేత మహాసభ వెనక కృషి ఆయనదే. 1941లో బ్రిటిష్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా చేనేత రంగం స్థితిగతులను అధ్యయనం చేసేందుకు నియమిత థామస్ కమిటీని కోటయ్య గుంటూరు జిల్లాకు ఆహ్వానించి వంద పేజీల మెమొరాండాన్ని అందజేశాడు. చేనేత పారిశ్రామికులకు చాలినంత నూలు సరఫరా చేయాలని, నూలు ధరలు అదుపులో పెట్టాలని, నూలు ఎగుమతులు ఆపాలని నినదిస్తూ ఆందోళనలు చేపట్టాడు. 1950 వరకు పరిస్థితులలో మార్పు రాలేదు. దాంతో చేనేత కాంగ్రెస్ సమర శంఖం పూరించింది. అన్ని జిల్లాల్లో ఆకలి యాత్రలు, సత్యాగ్రహాలు పెద్దఎత్తున చేపట్టాడు. అయినా ఫలితం రాలేదు. దాంతో మద్రాసు నగరంలో 1950 ఏప్రిల్ 16 నుంచి జూన్ 30 వరకు 75 రోజుల పాటు కోటయ్య సత్యాగ్రహం నడిపాడు. దాదాపు పదివేల మంది చేనేత కార్మికులు ఈ సత్యాగ్రహంలో పాల్గొన్నాడు. 75 రోజుల అనంతరం కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి హరేకృష్ణ మెహతాబ్ మద్రాసు వచ్చి చేనేత కాంగ్రెస్ నాయకులతో చర్చలు జరిపాడు. మంత్రి ఇచ్చిన హామీలతో సత్యాగ్రహాన్ని విరమించాడు. 1952 మద్రాసు శాసనసభ ఎన్నికల్లో ప్రకాశం పంతులు, కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ అభ్యర్థిగా చీరాల నియోజకవర్గం నుంచి పోటీచేసి ఎన్నికయ్యాడు. శాసన సభలో కోటయ్య వాక్పటిమను చూసిన ఆనాటి ముఖ్యమంత్రి రాజాజీ, కాంగ్రెసు పార్టీలో చేరితే మంత్రి పదవి అప్పగిస్తానని చెప్పినా, కోటయ్య నైతిక విలువలకే ప్రాముఖ్యతనిచ్చి ఆ అవకాశాన్ని సున్నితంగా తిరస్కరించిన నిస్వార్థ నేత. 1953 తర్వాత చేనేత వర్గాల ప్రయోజనాల కోసం రేపల్లెలో సత్యాగ్రహం చేపట్టాడు. ఫలితంగా జైలు శిక్ష అనుభవించాడు. కనుంగో కమిటీ సిఫార్సులకు వ్యతిరేకంగా ఆయన ఉద్యమించాడు. చేనేత కార్మికులకు ప్రయోజనం కలిగిం చేందుకు సహకార సంఘాలు ఒక మార్గంగా నమ్మాడు. చేనేత రంగంతో పాటు రైతులు, జిన్నింగ్, స్పిన్నింగ్, కాంపోజిట్ మిల్లులపై ఆమూలాగ్రం అధ్యయనం చేశాడు. ఆయన హయాం లోనే ఆంధ్ర ప్రాంతంలో ఆనాడు 200 పైగా నూతన చేనేత సహకార సంఘాలు ఏర్పాటు చేసారు. అసంఘటితంగా ఉన్న చేనేత రంగం అభివృద్ధికి వారు నేసి బట్టలకు సరైన గిట్టుబాటు ధర లభించడానికి కోటయ్య కృషి చేసాడు. చీరాల వద్ద 17 వేల ఎకరాలకు పైగా బంజరు భూములను పేదలకు పంపిణీ చేసే విషయంలో చీరార సముద్ర తీర ప్రాంతంలో సేద్యపు నీటి సౌకర్యం కల్పించడంలో చీరాల, నెల్లూరు, రాజమండ్రి పట్టణాలలో సహకార నూలు మిల్లులు ఏర్పాటు చేయడంలో కోటయ్య కృషి మరవ లేనిది. భారత ప్రభుత్వ చేనేత రంగ ప్రతినిధిగా శ్రీలంక, బ్రిటన్, చైనా, హాంకాంగ్ తదితర దేశాలు సందర్శించాడు. కోటయ్య 1995 నవంబర్ 26న మరణించాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9540595494**

# కమనీయ చిత్రాల సృష్టికర్త కొండపల్లి

## చిత్రలేఖనంలో సాటిలేని మేటి కొండపల్లి - కొండపల్లి శేషగిరి రావు వర్ధంతి



చిత్రకళా ప్రపంచంలో ఆయన ఓ మహా వృక్షం. చిత్రకళకు ఎనలేని కీర్తిని ఆర్జించిన పెట్టిన అద్భుత కళాకారులు ఆయన. ఆయనే భారతీయ సాంప్రదాయ చిత్ర లేఖనంలో అద్భుతాలు సాధించిన చిత్ర లేఖకులు కొండపల్లి శేషగిరి రావు. తెలుగు చిత్రకళను అంతర్జాతీయ వేదికపై ఆవిష్కరించి, విశ్వ వ్యాపితం చేసిన గొప్ప కళాకారులు శేషగిరిరావు. కొండపల్లి శేషగిరి రావు (జనవరి 22, 1924 – జూలై 26, 2012) తెలంగాణ రాష్ట్రానికి చెందిన సుప్రసిద్ధ చిత్రకారులైన కొడపల్లి శేషగిరి రావు 1924 జనవరి 22 న వరంగల్ జిల్లా, పెనుగొండ గ్రామంలో ఒక బ్రాహ్మణ భూస్వామ్య కుటుంబంలో జన్మించారు. వేయి స్తంభాల గుడి, రామప్ప గుడి, పరిసరాల శిల్ప కళా సౌందర్యాన్ని, ఆయా దృశ్యాల నుండి స్ఫూర్తిపొంది తన మనో ఫలకంపై ముద్రించుకుని, సుదీర్ఘ, సునిశిత అధ్యయనంతో కొన్ని వందల చిత్రాలకు ఆయన జీవం పోశారు. చిన్నతనం లోనే ఆయనలోని సృజనాత్మకతను పరిశీలించిన ఆ పాఠశాల డ్రాయింగ్ మాస్టర్ దీనదయాళ్ ఆనాడే కొండపల్లి గొప్ప కళాకారుడవుతాడని గ్రహించారు. ప్రోత్సహించారు. బెంగాల్, శాంతినికేతన్ లో చిత్రలేఖనం అభ్యసించి, జె ఎన్ టి యు ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో అధ్యాపక వృత్తి చేపట్టారు. అయితే ఆయన చిత్రలేఖనా ప్రస్థానం అప్రతి హతంగా సాగింది. భారతీయ ఇతిహాస అంశాలను చిత్రించడంలో శేషగిరిరావు పట్టు సాధించారు. ఆయనది అందె వేసిన చేయిగా మలుచు కున్నారు. అజంతా, ఎల్లోరా గుహల చిత్రాలను (తిరిగి) గీసిన చిత్రకారుడు జలాలుద్దీన్ ద్వారా కొన్ని మెళకువలు నేర్చుకున్నారు. జైపూర్ లోని బనస్థలి విద్యాపీట్ లో "ఫ్రెస్కో" పెయింటింగ్ పద్ధతిని అభ్యసించారు. ప్రకృతి, చారిత్రక గాథలను.. కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలాన్ని ఆయన సజీవ చిత్రాలుగా మలిచారు. ఆయన చిత్రాలలో శకుంతల, దమయంతి, రామాయణం వంటి పురాణాల వివిధ సన్నివేశాలు పలువురి ప్రశంసలు అందు కున్నాయి. లేపాక్షి తదితర చారిత్రక చిత్రకళా కేంద్రాలను దర్శించి, తన భావానుగుణంగా రూపు నిచ్చారు. వరూధినీ– ప్రవరా ఖ్యుడు, రాణి రుద్రమ, గణపతి దేవుడు, శకుంతల చిత్రాలను చిత్రించారు. పోతన భాగవతాన్ని 16 సార్లకు పైగా చదివి, కొండపల్లి అద్భుత సృష్టి చేశారు. చిత్రించారు. అజంతా, ఎల్లోరా, రామప్ప, రాచకొండ దేనినీ ఆయన వదల లేదు. దశాబ్దాల నాటి రంగుల్లో ఆంధ్రపత్రికలో ముఖచిత్రంగా వచ్చిన పోతన చిత్రాన్ని వందలాది తెలుగువారు ఫ్రేములు కట్టించు కున్నారంటే ఆయన ప్రతిభ స్పష్టం అవుతున్నది. ఆక్వా టెక్స్చర్ పెయింటింగ్లకు ఆయన మార్గదర్శకుడిగా చెబుతారు. ఆయన చిత్రాలను దేశ పార్లమెంట్, రాష్ట్ర అసెంబ్లీ , సాలార్ జంగ్ మ్యూజియం లలో ప్రదర్శించారు. కైరో, ఇటలీ, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, కోలాలంపూర్, లండన్, అమెరికా, మాస్కో తదితర దేశాల్లో జరిగిన ఎగ్జిబిషన్లలో శేషగిరిరావు చిత్రాలు ప్రదర్శిత మయ్యాయి. వాషింగ్టన్ డీసీలోని భారత రాయబార కార్యాలయం, పిట్స్బర్గ్ వేంకటేశ్వర స్వామి ఆలయాలకు ఆయన చిత్రాలు మరింత శోభను తీసుకు వచ్చాయి. 1975లో ప్రపంచ తెలుగు మహాసభలకు ఆయన రూపొందించిన తెలుగుతల్లి పెయింటింగ్ ప్రశంసలు పొందింది. తెలుగు మహాసభల సందర్భంగా కొండపల్లి శేషగిరిరావు తెలుగు తల్లిని సాక్షాత్కరింప జేశారు. ఆ చిత్రం ఆధారంగానే తెలుగు తల్లి విగ్రహాలనూ రూపొందించారు. విశ్వామిత్రుడు వంటి ఐతిహాసిక వ్యక్తుల నుంచి, శాతవాహనులు, విష్ణుకుండినులు, పల్నాటి బ్రహ్మనాయుడు వంటి చారిత్రక వ్యక్తుల నుంచి, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వరకూ తన చిత్రంలో నీరాజనం పలికారు కొండపల్లి. అన్నమయ్య, త్యాగయ్య వంటి వాగ్గేయకారులు, జానపద కళాకారులు ఆయన కళా రూపాల్లో ఒదిగి పోయారు. మహాత్మా.గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలతో పాటు ఎంతో మంది ప్రముఖులు ఆయన చిత్రాలను మెచ్చు కున్నారు. 1994 లో శేషగిరిరావును అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు ప్రత్యేకంగా సత్కరించారు. మ్యాక్స్ ముల్లర్ భవన్ డైరెక్టర్ పీటర్ స్విడ్జల అభినందనలు అందుకున్నారు. 1950 నుంచి 90 వరకు ఆయన 37 వ్యాసాలు రాశారు. అవి 'చిత్ర, శిల్పకళా రామణీయకము' పేరుతో 2009లో పుస్తకంగా వెలువడ్డాయి. హైదరాబాదు, మైసూరు, మద్రాసు, ఆలిండియా ఆర్ట్ ఎగ్జిబిషన్స్, కోల్కతా అకాడమీ ఆఫ్ ఫైనార్ట్, ఏపీ లలిత కళా అకాడమీ అవార్డులను అందుకున్నారు. భారత దేశ స్వాతంత్ర సమరంలో పాల్గొన్న అరవై వసంతాల తరువాత ప్రభుత్వం, జులై 2005 లో శేషగిరి రావును "స్వాతంత్ర సమర యోధుడిగా" గుర్తించి 3,000 రూపాయల వేతనం అందించింది. కేంద్ర మానవ వనరుల శాఖ పక్షాన 1988లో ఎమిరి టస్ ఫెలోషిప్ను, తెలుగు యూనివర్సిటీ ద్వారా డాక్టరేట్ను ఆయనకు అందజేశారు. 1993 లో రాజీవ్ రత్న ఎవార్డు పొందేరు. 1996 లో శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ఇచ్చి గౌరవించింది. ప్రతిష్ఠాత్మక హంస అవార్డును కూడా ఆయన అందుకున్నారు. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9540595494**

# తర తరాలకు స్ఫూర్తి దాయకం... కార్గిల్ విజయం

## - జూలై 26... కార్గిల్ విజయ దినోత్సవం




జూలై 26 ప్రతి భారతీయుడు తరతరాలు గర్వంగా గుర్తు చేసుకునే రోజు. 1999 మే – జూలై మధ్య జరిగిన కార్గిల్ యుద్ధ నేపథ్యంలో భారత దేశ భూభాగాన్ని ఆక్రమించు కోవాలనుకున్న దాయాది దేశం పాకిస్తాన్ పై ధైర్య సాహసాలకు, వీరత్వానికి, దేశభక్తికి, పోరాట స్ఫూర్తికి చిరునామా అయిన మన దేశ సైన్యం సాధించిన అసామాన్య, అఖండ విజయాన్ని సువర్ణాక్ష రాలతో లిఖించిన రోజు. కార్గిల్ విజయ దినోత్సవం ప్రతి ఏటా జూలై 26న దేశ వ్యాప్తంగా జరుప బడుతుంది. 1999, జూలై 26న భారత సైన్యం పాకిస్తాన్ సైన్యంపై విజయం సాధించిన దానికి గుర్తుగా ఈ దినోత్సవాన్ని నిర్వహించు కుంటున్నారు. కార్గిల్ మీదే దాడికి దిగడానికి ముఖ్య కారణం, చుట్టూ ఉన్న ముఖ్యమైన సైనిక స్థావరాలను స్వాధీన పర్చుకోవడం ద్వారా ఆ ప్రాంతం పై పట్టు సాధించడం. అంతేకాక ఎత్తైన ప్రదేశాన్ని ఆక్రమించు కోవడం. భారత్–పాకిస్తాన్ విభజన జరగక ముందు కార్గిల్ ప్రాంతం లద్దాక్ ప్రాంతం లోని బల్టిస్తాన్ జిల్లాలో భాగంగా ఉండేది. మొదటి కాశ్మీర్ యుద్ధం (1947ు 48) తర్వాత నియంత్రణ రేఖ బల్టిస్తాన్ జిల్లా గుండా ఏర్పడింది. దీంతో కార్గిల్ ప్రాంతం భారత దేశం లోని జమ్మూ–కాశ్మీర్ లో భాగమైంది. 1971లో యుద్ధంలో పాకిస్తాన్ ఓడిపోయిన తర్వాత ఇరు దేశాలు సిమ్లా ఒప్పందాన్ని కుదుర్చు కున్నాయి. ఆ ఒప్పందం ప్రకారం ఈ సరిహద్దుని అంగీకరించడంతో పాటు ఇక్కడ ఎటువంటి కాల్పులకు దిగకూడదు. 1999 ఫిబ్రవరిలో భారత్ పాకిస్థాన్ మధ్య శాంతియుత లాహెర్ ఒప్పందం జరిగింది. తద్వారా జమ్మూకాశ్మీర్ విషయంలో రెండు దేశాలూ దౌత్యపరంగా, శాంతి యుతంగా పరిష్కారం చూపుకోవాలని అనుకున్నాయి. కానీ పాకిస్థాన్ సైన్యం కుట్రలు పన్ని... ఉగ్రవాద మూకల్ని భారత భూభాగంలోకి పంపాయికానీ, కాశ్మీర్ ను ఆక్రమించు కోవాలన్ని కుట్రతో పాకిస్తాన్ సైన్యం ఆపరేషన్ బదర్ అనే పేరిట ఉగ్రవాదులను భారత సరిహద్దుల్లోకి పంపించింది. అప్పటి భారత ప్రభుత్వం యుద్ధం చేయకుండ ఉండేందుకు ప్రయత్నించింది. అయినా, పాకిస్తాన్ తన నిర్ణయం మార్చుకోక పోవడంతో యుద్ధానికి వెళ్ళక తప్పలేదు. 1999, మే 3న కార్గిల్ జిల్లాలో నియంత్రణ రేఖ వెంబడి భారత్, పాకిస్థాన్ మధ్య కార్గిల్ యుద్ధం ప్రారంభ మయింది. దీనిని భారత సైన్యం ఆపరేషన్ విజయ్ అనే కోడ్ నేమ్ ను పెట్టుకుంది. గడ్డకట్టే చలిలో... పర్వతాల్లో... ఏమాత్రం సహకరించని వాతావరణంలో... దాదాపు 60 రోజులపాటూ రెండు దేశాల మధ్యా యుద్ధం జరిగింది. అంతటి చలిలో, మంచు పర్వతాల్లో దాదాపు 60 రోజుల పాటూ జరిగిన యుద్ధంలో ఇరు దేశాల సైనికులు చాలామంది చనిపోయారు. కాశ్మీర్, లధక్ మధ్య లింక్ తెగ్గొట్టి... సియాచిన్ హిమ పర్వతాల నుంచీ భారత్ సైన్యాన్ని పంపేయాలన్నది పాక్ కుట్ర. 527 మంది భారత సైనికులు అమరు లయ్యారు. చివరికి జూలై 26న భారత భూభాగం లోకి ప్రవేశించిన పాకిస్తాన్ సైన్యాన్ని తిప్పికొట్టి, భారతదేశ భూభాగాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడం ద్వారా భారత్ విజయం సాధించింది. అందువల్ల ప్రతిఏటా జూలై 26 కార్గిల్ విజయ దినోత్సవం జరుపబడుతుంది. కార్గిల్ యుద్ధం, భారత్ పాకిస్తాన్ మధ్య మే జూలై 1999 లో కాశ్మీర్ లోని కార్గిల్ జిల్లాలో, మరికొన్ని – సరిహద్దుల వద్ద జరిగింది. ఈ యుద్ధానికి కారణం పాకిస్తాన్ సైనికులు, కాశ్మీరీ తీవ్రవాదులు నియంత్రణ రేఖ దాటి భారత దేశం లోకి చొరబడడం. యుద్ధ ప్రారంభ దశలో పాకిస్తాన్ ఇది కాశ్మీరీ తిరుగుబాటు దారులు చేస్తున్న యుద్ధంగా పేర్కొన్నప్పటికీ యుద్ధంలో మరణించిన వారి దగ్గర లభించిన ఆధారాలను బట్టి, తర్వాత పాకిస్తాన్ ప్రధానమంత్రి, సైన్యాధిపతులు చేసిన వ్యాఖ్యలను బట్టీ ఇందులో పాకిస్తాన్ సైనిక దళాల హస్తం ఉందని రుజువయ్యింది.

నియంత్రణ రేఖ దాటి పాకిస్తాన్ ఆక్రమించుకున్న ప్రదేశాల ను భారత సైన్యం, భారతీయ వాయుసేన సహకారంతో తిరిగి స్వాధీన పరుచుకుంది. అంతర్జాతీయంగా వస్తున్న ఒత్తిడిని తట్టుకోలేక పాకిస్తాన్ సైన్యం వెను తిరిగింది. ఎత్తైన పర్వత ప్రాంతాల మీద జరిగిన యుద్ధాలకి ఇది తాజా ఉదాహరణ. ఇంత ఎత్తులో యుద్ధం జరగడం వల్ల ఇరు పక్షాలకి ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యాయి. అణుబాంబులు కలిగియున్న దేశాల మధ్య జరిగిన యుద్ధాలలో ఇది రెండోది (మొదటిది చైనా – సోవియట్ ల మధ్య 1969 లో జరిగింది. దేశ రాజధాని న్యూ ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద జరిగే వేడుకల్లో దేశ ప్రధాని పాల్గొని అమర జవానులకు నివాళులు అర్పిస్తారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9540595494**

# ఉప రాష్ట్రపతి అభ్యర్థిత్వంపై ఊహాగానాలు!?

భారత రాజ్యాంగ వ్యవస్థలో రెండవ అగ్ర పదవి అయిన ఉపరాష్ట్రపతి స్థానం, రాజ్యాంగబద్ధమైన గౌరవం, పార్లమెంటరీ బాధ్యతల సమ్మేళనానికి ప్రతీకగా నిలుస్తుంది. రాజ్యసభ ఛైర్మన్ హోదాలో పార్లమెంటరీ వ్యవస్థను సమర్థంగా నడిపించే బాధ్యత ఈ పదవికి ఉంటుంది. జూలై 21, 2025న జగదీప్ ధన్ఖర్ తన పదవికి రాజీనామా చేయడంతో, ఆయన ఉత్తరాధికారిగా ఎవరు బాధ్యత చేపడతారన్న అంశం ఇప్పుడు దేశ రాజధానిలో రాజకీయంగా హాట్‌టాపిక్‌గా మారింది. రానున్న లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా, బీజేపీ ఈ ఎంపికను వ్యూహాత్మకంగా ఉపయోగించుకునే అవకాశం ఎక్కువ. విపక్షాలైతే దీనిని రాజకీయ నైతికత, సామాజిక సమతుల్యత, ప్రాతినిధ్య విలువలతో కూడిన అంశంగా చూడాలని ప్రయత్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పలు ప్రముఖుల పేర్లు వినిపిస్తూ రాజకీయ చర్చలకు తావిస్తున్నాయి. ఈ జాబితాలో ముందుగా వినిపిస్తున్న పేరు హరివంశ్ నారాయణ్ సింగ్‌ది. బీహార్‌కు చెందిన హరివంశ్ పాత్రికేయ రంగంలో రాణించి, 2014లో జేడీయూ తరఫున రాజ్యసభకు ఎన్నికై, 2018లో డిప్యూటీ ఛైర్మన్‌గా ఎంపికయ్యారు. ఆయన విధి నిర్వహణలో తటస్థత, నిబద్ధత స్పష్టంగా కనిపించాయి. అధికార పక్షానికి అనుకూలంగానూ, విపక్షాలకు ఆమోదయోగ్యంగానూ ఉండేలా వ్యవహరించిన ఆయనను మళ్ళీ ఎంపిక చేయాలన్న సూచనలు బీజేపీలో ఉన్నట్లు సమాచారం. దీంతో పాటు బీహార్ సీఎం నితీశ్ కుమార్ పేరు కూడా బలంగా వినిపిస్తోంది. ఎన్డీఏ పునఃసంఘటనలో ఆయన పాత్ర కీలకం కావడంతో, ఆయనను ఉపరాష్ట్రపతిగా ప్రతిష్ఠించడం ద్వారా బీజేపీ, బహుళదళ వ్యూహానికి సంకేతాన్ని ఇచ్చే ప్రయత్నం చేయవచ్చునని భావిస్తున్నారు. ఆయన పరిపాలనా అనుభవం, లౌకిక రాజకీయ చాతుర్యం ఈ స్థానానికి అర్హతను ఇచ్చే అంశాలు. జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా పేరు కూడా సమీక్షనలో ఉంది. విద్యార్థి ఉద్యమాల నుండి కేంద్ర మంత్రిగా ఎదిగి, ఆర్టికల్ 370 రద్దు తరువాత కాశ్మీర్‌లో పరిపాలనను స్థిరపరిచిన ఆయనకు రాజ్యాంగ నిబద్ధతపై ఉన్న పట్టుదల గుర్తించదగ్గది. ఆయన ఎంపిక అంటే రాజ్యాంగ పునరుద్ధరణ పట్ల కేంద్ర ప్రభుత్వం చూపే స్పష్టతకు సంకేతంగా తీసుకోవచ్చు. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేరు కూడా ప్రచారంలోకి వచ్చింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఈ బీజేపీ వేదాంతి రాజకీయ నాయకుడు ముఖ్యమంత్రి, కేంద్ర హోంమంత్రి, రక్షణ శాఖ మంత్రి హోదాల్లో అనేక బాధ్యతలు నిర్వహించారు. అయితే ప్రస్తుతం ఆయన దేశ భద్రతకు కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్నందున, ఉపరాష్ట్రపతి స్థానానికి వెళ్ళే అవకాశం తక్కువగా ఉందన్న అభిప్రాయాలు ఉన్నాయి. తెలంగాణ నుంచి బీజేపీ సీనియర్ నాయకుడు బండారు దత్తాత్రేయ పేరు కూడా చర్చనీయాంశంగా మారింది. సామాజిక న్యాయం, దక్షిణాది ప్రాతినిధ్యం, బలమైన పార్టీ నిబద్ధతకు ప్రతీకగా ఆయన పేరు నిలుస్తుంది. క్షేత్రస్థాయి కార్యకర్తగా మొదలై కేంద్ర మంత్రిగా ఎదిగిన ఆయన, హర్యానా గవర్నర్‌గా పరిపాలన నిర్వహించిన అనుభవం కలిగిన నాయకుడు. ఆయన ఎంపిక బీజేపీకి దక్షిణాదిలో మరింత స్థిరతను, సామాజిక సంకేతాలను ఇచ్చే అవకాశముంది. ఈ నేపథ్యానికి మరొక విలక్షణతను జోడించే పేరు రాం మాధవ్‌ది. ఆర్ఎస్ఎస్ పూర్వ ప్రచారక్‌గా, బీజేపీలో ముఖ్యమైన వ్యూహకర్తగా, విదేశాంగ, జాతీయ భద్రత రంగాలపై అవగాహన కలిగిన రాజకీయ విశ్లేషకుడిగా రాం మాధవ్ ప్రసిద్ధి. ఆయనలో ఉన్న సిద్ధాంతపరమైన నిబద్ధత, అంతర్జాతీయ అనుభవం, అభ్యుదయ ఆలోచనల కలయిక బీజేపీకి ఒక కొత్త తరహా ఉపరాష్ట్రపతి రూపాన్ని ఇవ్వగలదు. పార్టీలో మేధావి వర్గానికి ప్రాతినిధ్యం కల్పించాలన్న అవసరాన్ని ఈ ఎంపిక తీర్చగలదన్న అభిప్రాయం కూడా వినిపిస్తోంది. ఈ సమీక్షలో ఏ అభ్యర్థిని బీజేపీ ఎంపిక చేస్తుందన్నదే ప్రధాన ప్రశ్న. పార్టీ తన సాంస్కృతిక, రాజకీయ లక్ష్యాలకు అనుగుణంగా ు సామాజిక సమతుల్యత, ప్రాదేశిక సమన్వయం, రాజ్యాంగ నిబద్ధత, పార్టీకి విశ్వసనీయత ు ఈ నాలుగు మూల్యాల మధ్య సమతుల్యాన్ని సాధించే విధంగా నిర్ణయం తీసుకుంటుందా? లేక గుణాత్మక చరిత్రను, ప్రస్తుత రాజకీయ వ్యూహాలను దృష్టిలో ఉంచుకుంటుందా? ఈ ఎన్నికలోనూ రాష్ట్రపతి ఎన్నికల మాదిరిగానే నామినేటెడ్ సభ్యులు మినహాయించి, లోక్‌సభ–రాజ్యసభ ఎంపీలు ఓటు వేస్తారు. ఎన్డీఏకు ఉన్న మెజారిటీ దృష్ట్యా, వారి అభ్యర్థికే విజయం ఖాయమని భావించవచ్చు. గతంలో భైరోసింగ్ శేఖావత్ వంటి వృద్ధ నాయకుడికి గౌరవం తెలిపిన బీజేపీ, హమీద్ అన్సారీ ద్వారా మైనారిటీ ప్రాతినిధ్యాన్ని ప్రోత్సహించిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు హరివంశ్ అయితే తటస్థతకు సంకేతం, నితీశ్ అయితే బహుళదళ మైత్రికి, మనోజ్ సిన్హా అయితే రాజ్యాంగ పునర్నిర్మాణానికి, దత్తాత్రేయ అయితే సామాజిక న్యాయానికి, రాం మాధవ్ అయితే మేధావి రాజకీయ వ్యూహానికి ప్రతీకగా నిలవగలరు. ఈ పదవికి ఎవరైతే వస్తారో, వారు భారత రాజ్యాంగ గౌరవాన్ని, పార్లమెంటరీ వ్యవస్థ విలువలను నిలబెట్టే విధంగా బాధ్యత నిర్వహించాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారు. "ఎవరు ఉపరాష్ట్రపతి?" అన్న ప్రశ్న ఇప్పుడు ఒక రాజ్యాంగ పదవి ఎంపికకు మించిన అర్థాన్ని సంతరించుకుంటోంది. అది దేశ రాజకీయ దిశకు, ప్రాధాన్యాలకు, ప్రాతినిధ్య సంకేతాలకు అద్దం పట్టే ప్రశ్న. సమాధానం కోసం దేశం ఆత్రుతగా ఎదురుచూస్తోంది. **రామ కిష్టయ్య సంగనభట్ల ు సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్ ు 9440595494**

చురకలు

సంపాదకీయం

## ఆస్ట్రేలియాలో భారతీయులపై ఏంటీ దారుణం?

ఆస్ట్రేలియాలో భారతీయులపై జాత్యహంకారపు వేధింపులు ఆగడం లేదు. సిడ్నీ, మెల్‌బోర్న్, అడిలైడ్ వంటి ప్రధాన నగరాల్లో ఇటీవల చోటు చేసుకున్న సంఘటనలు ఆ దేశంలోని వలస ప్రజల భద్రతపై ప్రశ్నార్థకాన్ని మిగులుస్తున్నాయి.

ముఖ్యంగా హిందూ ఆలయాలపై విద్వేష పూరిత రాతలు, భారతీయ విద్యార్థులపై దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.

**-ఆలయంపై హిట్లర్ చిత్రంతో విద్వేష రాతలు..** జూలై 21న మెల్‌బోర్న్‌కు సమీపంలోని బోరోనియా ప్రాంతంలో ఉన్న స్వామినారాయణ్ ఆలయంపై గుర్తుతెలియని వ్యక్తులు విద్వేషపూరిత గ్రాఫిటీ రాశారు. ఆలయ గోడపై హిట్లర్ చిత్రాన్ని ఉంచి, దాని కింద "Go Home Brown" అంటూ జాత్యహంకార వ్యాఖ్యలు రాయడం తీవ్ర కక్షత్వానికి నిదర్శనంగా నిలిచింది. ఇదే ప్రాంతంలోని ఆసియన్ కమ్యూనిటీలకు చెందిన కొన్ని రెస్టారెంట్లపై కూడా ఇలాంటి జాత్యద్వేషపూరిత వాక్యాలు కనిపించడం కలకలం రేపింది.

**-హిందూ కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రేలియా ఆవేదన...** ఈ ఘటనపై హిందూ కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రేలియా అధ్యక్షుడు మకరంద్ భగవత్ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. దేవాలయాలు భక్తి, ఐక్యత, శాంతికి ప్రతీకలని, అలాంటి పవిత్ర స్థలాలపై ఇలా దాడులు చేయడం బాధాకరమని ఆయన వ్యాఖ్యానించారు.


ఇది వలసదారుల మనోభావాలను గాయపరచే చర్యగా ఆయన అభివర్ణించారు.

**-విక్టోరియా ప్రభుత్వం స్పందన...** విక్టోరియా రాష్ట్ర ప్రీమియర్ జసింత్ అల్లన్ ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. ఇది కేవలం చిత్తశుద్ధి లేని విధ్వంసం మాత్రమే కాదని, ఒక ప్రణాళికాబద్ధమైన ద్వేషచర్యగా ఆమె అభివర్ణించారు. పోలీసులు ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. బాధిత ఆలయ నిర్వాహకులకు ఆమె ప్రగాఢ సంఘీభావం తెలిపినట్లు సమాచారం.

**-భారతీయ విద్యార్థిపై దాడి...** ఇక జూలై 19న అడిలైడ్‌లో భారత్‌కు చెందిన చరణ్‌ప్రీత్ సింగ్ అనే విద్యార్థిపై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. కారు పార్కింగ్‌కు సంబంధించిన వివాదం తీవ్రమవడంతో దుండగులు అతనిపై పదునైన ఆయుధాలతో దాడి చేసి, జాత్యహంకార వ్యాఖ్యలు చేశారు. ఈ దాడిలో గాయపడిన విద్యార్థి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ కేసులో ఒక నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేయగా, మిగిలిన వారి కోసం గాలింపు కొనసాగుతోంది.

**-జాత్యహంకారానికి తావు లేదు...** ఈ సంఘటనలు ఆస్ట్రేలియాలో వలసవాదుల భద్రతపై పలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. మల్టీకల్చరల్ సమాజంగా పేరు తెచ్చుకున్న ఆస్ట్రేలియాలో ఇలా భారతీయులపై దాడులు జరగడం ఆందోళన కలిగించే విషయం. భారత ప్రభుత్వంతో పాటు, అక్కడి పాలకవర్గాలు, స్థానిక హిందూ సంఘాలు కలిసి ఇలాంటి దాడులపై తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. జాత్యహంకారానికి ఎటువంటి స్థలమూ ఉండకూడదు. హింస, ద్వేషం పుట్టించే చర్యలను ఏ దేశమైనా కఠినంగా శాసించాలి. ఆస్ట్రేలియాలోని ఇటీవలి ఘటనలు అక్కడి భారతీయ సమాజాన్ని కలచివేస్తున్నాయి. సమాజంలో ఐక్యత, గౌరవం, భద్రతకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాల్సిన సమయం ఇది.

# గోరా జీవిత సర్వస్వం హేతు వాదానికే అంకితం - జూలై 26... నాస్తిక వాది గోపరాజు వర్ధంతి



హేతువాదం అనే తాత్విక విధానాన్ని విశ్వసించి అనుసరించే వారిని హేతువాదులు అంటారు. హేతువు అంటే కారణం అని అర్థం. ఏదైనా ఒక విషయాన్ని గుడ్డిగా విశ్వసించకుండా దానికి కారణాలను అన్వేషించడం లేదా ఆరా తీయడాన్ని హేతువాదం అంటారు. జ్ఞానానికి లేదా ఋజువుకు "హేతువు" లేదా "కారణం" అనేది మాత్రమే నమ్మదగిన ఆధారం అని భావించే తాత్విక ధోరణిని హేతువాదం అంటారు. హేతువాదానికి శాస్త్రీయ దృక్పథం పునాది. మానవుడే కొలమానం, మనిషి అన్నిటికీ మూలం అనే మూలసూత్రాలతో హేతువాదం ఆవిర్భవించింది. గోరా'గా ప్రసిద్ధులైన గోపరాజు రామచంద్రరావు నాస్తికుడిగా, హేతువాదిగా, గాంధేయవాదిగా తెలుగు వారందరికీ సుపరిచితులు. ఆయన దృష్టిలో ఆస్తికత, హేతువాదం రెండు భిన్న ధ్రువాలు. నేటి సమాజంలో అగ్ర, నిమ్న జాతులనే వర్ణ బేధాలు, అంధ విశ్వాసాలు పెరగటానికి ఆస్తికతే కారణం అని ఆయన గట్టి నమ్మకం. మానవులందరూ ఒకటే అన్న భావం పెరగాలంటే , అది ఒక్క నాస్తికవాదం వల్లనే సాధ్యమని విశ్వసించి, నాస్తికభావాల ప్రచారం కోసం తన జీవితమంతా వెచ్చించారు గోరా. పెళ్ళికి ముందే సెక్స్ పై అవగాహనలు, కుటుంబ నియంత్రణ, వీటితో పాటు అప్పటి తెలుగు సమాజంలో ఎన్నో విప్లవాత్మక మార్పులను తెచ్చిపెట్టిన ఘనత గోరాదే. గోరా ప్రస్తుత ఒరిస్సా రాష్ట్రంలో ఉన్న ఛత్రపూర్ అనే కుగ్రామంలో, 1902, నవంబరు 15 న ఉన్నతకుల హిందూ కుటుంబంలో వెంకట సుబ్బారావు, రాజ్యలక్ష్మి దంపతులకు జన్మించారు. పర్లాకిమిడిలో ప్రాథమిక విద్యాభాసం పూర్తిచేసిన తర్వాత 1913లో పిఠాపురం రాజా కళాశాల ఉన్నత పాఠశాలలో చదివారు. 1920లో పిఠాపురం రాజా అనుబంధ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తిచేసిన గోరా, అప్పుడే ప్రారంభమౌతున్న సహాయ నిరాకరణోద్యమంలో కాలూనారు. 1922లో మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో వృక్షశాస్త్రంలో బి.ఏ చేశారు. రామచంద్రరావు వృక్ష శాస్త్రంలో డిగ్రీ చదివి, మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో అదే శాస్త్రంలో మాస్టర్ డిగ్రీలో ఉత్తీర్ణుడయ్యారు. 1922 లో సరస్వతిని ఆమె 10 ఏళ్ళ ప్రాయంలోనే వివాహం చేసుకున్నారు. మధురలోని మిషన్ కళాశాలలో అధ్యాపకుడిగా చేరాడు. కోయంబత్తూరు వ్యవసాయ కళాశాలలో ప్రత్తి పరిశోధనా సహాయకుడిగా, తర్వాత కొలంబోలోని ఒక కళాశాలలో జీవశాస్త్ర అధ్యాపకునిగా, 1928లో కాకినాడ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేశారు. తాను నడిచే మార్గం తండ్రికి ఇష్టం లేకపోవడంతో 1928 లో భార్య, పిల్లలతో ఇంటిని వదిలేసి వచ్చారు. స్వతంత్ర భావాలుగల గోరా ఎక్కడా ఉద్యోగంలో నిలువలేక పోయారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా లాంటి ఉద్యమాలలో పాల్గొని బ్రిటిష్ ప్రభుత్వపు జైళ్లలో కఠిన శిక్షలు అనుభవించారు. గోరా అనేక రచనలను చేశారు. సంఘం, ఆర్థిక సమత అనే పత్రికలను నడిపారు. వర్ణవ్యవస్థ, అంటరానితనం మీద తన యుద్ధాన్ని ప్రకటించిన గోరా 1940 లోఆయన భార్యతో కలసి నాస్తిక కేంద్రాన్ని, కృష్ణా జిల్లాలోని ఒక గ్రామంలో ప్రారంభించారు. దేశస్వాతంత్ర్యం సందర్భంగా, 1947 లో, కేంద్రాన్ని విజయవాడకు తరలించారు. 1944లో మహాత్మా గాంధీ కోరిక మేరకు అఖిల భారత కాంగ్రెస్ ఆర్గనైజర్‌గా అలహాబాద్, ఢిల్లీలలో పనిచేశారు. స్వాతంత్ర్య సమరయోధుని గానేకాక, సాంఘిక, ఆర్థిక సమానత్వ సాధనకు, మూఢ నమ్మకాల నిర్మూలనకు, ప్రజల్లో శాస్త్రీయ దృష్టిని పెంపొందించ డానికి, వయోజన విద్యా వ్యాప్తికి, కుల, మత తత్వాల నిర్మూలనకు అనితర కృషి గోరా సల్పారు. గాంధీతో నాస్తికత్వంపై చర్చలు జరిపి, అస్పృశ్యతా నిర్మూలన కోసం కృషి చేసారు. దళితుల దేవాలయ ప్రవేశాన్ని, సమష్టి భోజనాలను, వివాహాలను విస్తృతంగా ఆయన నిర్వహించారు. ఆయనకు తొమ్మిది మంది సంతానం. సంతానానికి ఆయన సందిర్భోచితంగా పేర్లు పెట్టారు. ఉప్పు సత్యాగ్రహం కాలంలో పుట్టినందున లవణం, భారతీయులు చట్టసభలలో నిలిచి గెలిచిన కాలంలో పుట్టినందున విజయం, రెండవ ప్రపంచ యుద్ధకాలంలో పుట్టినందున ఒక కుమారునికి సమరం, మరొక కుమారునికి నియంత. తొమ్మిదవ సంతానానికి నౌవ్ గా పేర్లు పెట్టారు. హిందీ భాషలో నౌవ్ అంటే తొమ్మిది అని అర్థం. కుమార్తెలు మనోరమ, మైత్రి, విద్య. గోరా 25 ఏళ్ళ వయసు వరకు అస్తికుడే. తరువాత నాస్తిక సిద్ధాంతాలతో జీవితాంతం కృషి సల్పిన గోరా జీవితమే ఒక ఆదర్శం. ఆయన తన భార్యకి గర్భం వచ్చిన ప్రతిసారీ గ్రహణ సమయంలో గర్భవతిగా ఉన్న ఆమెను బయటకి తీసుకొని వెళ్లి తిప్పేవారు. గ్రహణం సమయంలో గర్భిణులు బయట తిరిగినంత మాత్రాన పుట్టబోయే పిల్లలకు గ్రహణం మొర్రి రాదు, అని నిరూపించటానికి. గోరా తన సంతానం అందరికీ, వారివారి అభీష్టం మేరకు, వర్ణాంతర వివాహాలు 'నాస్తిక పద్ధతిలో' జరిపించారు. ప్రముఖ కవి, దళిత కులానికి చెందిన గుర్రం జాషువా కూతురైన హేమలతను, తన కుమారుడైన లవణంకు వివాహం జరిపించిన ఆదర్శవాది గోరా. చెప్పింది చేసి చూపించిన మహనీయుడు ఆయన. 1970 లో బోస్టన్ లోనూ,1974లో హాలండ్ లోని అంస్టర్డాంలో జరిగిన అంతర్జాతీయ హ్యూమనిష్టు మహాసభలలో గోరా పాల్గొన్నారు. తెలుగులో ఒక వార పత్రిక 'సంఘం' ను స్థాపించి, దాని ద్వారా తన ఆశయాలను, లక్ష్యాలను ప్రజలలో విశేషంగా ప్రచారం చేశారు. గొప్ప సంఘసంస్కర్త, మానవతావాది, నాస్తిక ఉద్యమ నాయకుడు, హేతువాది అయిన గోరా, 26 -07 -1975 న విజయవాడ లోని నాస్తిక కేంద్రంలో ప్రసంగిస్తూ మరణించారు. గోరా శతజయంతి సందర్భంగా 2002 లో భారత ప్రభుత్వం, తపాలా బిళ్ళను విడుదల చేసింది. నాస్తికత్వం (దేవుడు లేడు), దేవుని పుట్టు పూర్వోత్తరాలు, జీవితం నేర్పిన పాఠాలు, నేను నాస్తికుడిని, సృష్టి రహస్యం, సంఘ దృష్టి, ఆర్థిక సమానత్వం, నాస్తికత్వం - ప్రశ్నోత్తరాలు, నాస్తికత్వం - ఆవశ్యకత తదితర రచనలు చేశారు. ఆయన కోడలైన శ్రీమతి హేమలతా లవణం తన తండ్రి జాషువా రచనలను వెలుగులోకి తెస్తూ, మామగారైన గోరా స్థాపించిన 'నాస్తిక కేంద్రాన్ని' కూడా సమర్థవంతంగా నడిపారు. ఆమె కూడా 19 -03 -2008 న నాస్తికకేంద్రం, విజయవాడలోనే మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# ప్రజాసేవకు అంకితమైన జీవితం... విలువలతో సాగిన రాజకీయ జీవన యానం - జూలై 26...కోనేరు రంగారావు జయంతి

ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో సామాజిక న్యాయం కోసం పాటుపడిన నాయకుల్లో కోనేరు రంగారావు ప్రముఖులలో ఒకరు. రాజకీయ విలువలకు కట్టుబడి, నిస్వార్థంగా ప్రజల కోసం పని చేసిన ఆయన జీవితం, రాజకీయ నైతికతకు ప్రతీకగా నిలుస్తుంది. కృష్ణా జిల్లా గూడవల్లిలో 1935 జూలై 26న జన్మించిన రంగారావు, సామాన్య కుటుంబంలో ఎదిగినా, అసాధారణ ప్రజాసేవా సంస్కారంతో రాజకీయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించారు. తొలుత తన స్వగ్రామంలో సర్పంచ్‌గా పదేళ్లు పని చేసిన ఆయన, ప్రజల మౌలిక అవసరాలపై సమగ్ర దృష్టితో అభివృద్ధిని కార్యరూపం లోకి తీసుకు వచ్చారు. గ్రామీణ రాజకీయాల నుండి రాష్ట్ర స్థాయికి ఆయన ప్రయాణం సామాన్యుల ఆకాంక్షలకు ప్రతినిధిగా మారింది. కంకిపాడు నియోజకవర్గం నుండి శాసనసభకు ఎన్నికై సామాజికాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేసిన రంగారావు, అనంతరం తిరువూరు నియోజకవర్గం నుండి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి, వరుసగా కీలక శాఖల మంత్రిత్వ బాధ్యతలు నిర్వహించారు. పురపాలక, దేవాదాయ, రెవెన్యూ, హౌసింగ్ వంటి శాఖల్లో పనిచేసిన ఆయన విధానాలు సామాన్యులకు దగ్గరయ్యేలా, వ్యవస్థను ప్రగతిశీలంగా మలిచేలా ఉండడం విశేషం. కోట్ల విజయ భాస్కరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయన ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ఆయనకు అధికారంలో ఉన్నా, లేకున్నా - ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఉండేది. దళితులు, గిరిజనుల సంక్షేమం ఆయన రాజకీయ దృష్టిలో ప్రధానాంశంగా నిలిచింది. సామాజికంగా వెనుకబడిన వర్గాల ఆర్థిక, భౌతిక స్థితిని మెరుగు పరచడమే ఆయన ప్రభుత్వ విధానాల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇళ్ల పంపిణీ, భూ పరిరక్షణ, పట్టాదారు హక్కులు కల్పన వంటి కార్యక్రమాలు ఆయన వహించిన మంత్రిత్వ కాలంలో వేగవంత మయ్యాయి. దళితుల హక్కులపై ఆయన చూపిన ఆరాటం ఆయనను 'దళిత హృదయ నాయకుడు'గా ప్రజల్లో నిలిపింది.

కానీ, కోనేరు రంగారావు పేరు నిలిచి పోయిన మరొక ముఖ్య కారణం "కోనేరు రంగారావు కమిటీ". భూ పంపిణీకి సంబంధించి అసంఘటిత వ్యవస్థను శాస్త్రీయంగా అధ్యయనం చేసి, పేదలకు భూముల హక్కులు కల్పించేందుకు మార్గదర్శకమైన సిఫార్సులను చేసిన ఈ కమిటీ నివేదిక రాష్ట్రంలో భూ సంస్కరణ చర్చలకు దిక్సూచి అయింది. గిరిజన భూ హక్కులపై, గ్రామీణ పేదలకు భూముల లబ్ధిపై ఈ కమిటీ చేసిన పరిశీలనలు, సూచనలు ఇప్పటికీ పాలకులకూ, న్యాయ వ్యవస్థకూ పాఠ్యంగా మారాయి. రంగారావు అధికారంలో ఉన్నప్పుడూ, నిర్దిష్ట పదవుల్లో లేనప్పుడూ ప్రజల మధ్యే ఉండేవారు. ఆయనను కలిసిన వారు చెప్పే ఒక్క మాట - ఆయనలో అసలు అహంకారం కనిపించదు. అందుకే ఆయనకు విపక్షం లోనూ గౌరవమే కలిగేది. న్యాయ బద్ధంగా, శాంతి యుతంగా సమస్యలను పరిష్కరించాలనే ఆయన ధోరణి, నేడు లోపించి పోయిన రాజకీయ విలువలకు అద్దం పడుతుంది. 2010 మార్చి 15న కోనేరు రంగారావు గారు కన్నుమూశారు. ఆయన మరణం రాజకీయాలకే కాదు, ప్రజాస్వామ్య విలువలకు కూడా లోటుగా భావించబడింది. ఆయనకు నివాళులర్పిస్తూ రాష్ట్రవ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు, హౌసింగ్ స్కీములు, ప్రాజెక్టులు ఆయన పేరుతో ప్రారంభమయ్యాయి. పత్రికలు, ప్రభుత్వ నివేదికలు ఆయన సేవలను ప్రశంసించాయి. కోనేరు రంగారావు జీవితం రాజకీయ నాయకులకే కాదు, ప్రజలందరికీ మార్గదర్శకం. అధికారం అనేది బాధ్యత అని, ప్రజల కోసం పదవులు వాడుకోవాలి కానీ, స్వలాభానికి కాదు అన్న సందేశం ఆయన జీవిత విధానం మనకు ఇచ్చిన గొప్ప పాఠం. నేటి రాజకీయ తరానికి, సమాజ సేవలో నిబద్ధతతో నడవాలనుకునే యువతకు, కోనేరు రంగారావు జీవితం ఒక ప్రేరణగా నిలుస్తుంది.



**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# అంతర్జాతీయ మడ అడవుల పరిరక్షణ దినోత్సవం - సముద్రతీరానికి సజీవ రక్షణ కవచం

## జూలై 26...అంతర్జాతీయ మడ అడవుల పర్యావరణ వ్యవస్థ పరిరక్షణ దినోత్సవం




ప్రకృతి ప్రపంచానికి మనుషుల జీవితానికి ఊపిరిగా నిలిచే అద్భుత సంపదలలో మడ అడవులు ఒక విశిష్టమైన స్థానాన్ని ఆక్రమించు కున్నాయి. సముద్ర తీర ప్రాంతాల్లో ఉప్పు నీటిలో పెరిగే ఈ చెట్ల సమాహారాలు పర్యావరణ సమతుల్యతకు మూల స్తంభాలుగా నిలుస్తూ, ప్రకృతి ప్రకోపాలను తట్టుకునే సహజ శక్తిని సమకూర్చు తున్నాయి. మడ అడవుల ప్రాముఖ్యతను చాటి చెప్పేందుకు, వాటిని రక్షించాల్సిన బాధ్యతను గుర్తు చేయడానికి ప్రతి సంవత్సరం జూలై 26న అంతర్జాతీయ మడ అడవుల పర్యావరణ వ్యవస్థ పరిరక్షణ దినోత్సవం ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారు. ఐక్యరాజ్య సమితి విద్యా, శాస్త్ర, సాంస్కృతిక సంస్థ అయిన యునెస్కో ఈ దినోత్సవాన్ని 2015లో అధికారికంగా ప్రకటించింది. మడ అడవులు భూమి, సముద్రం మధ్య సహజంగా ఏర్పడే సరిహద్దుల్లా వ్యవహరిస్తూ, తీరప్రాంతాల్లో నివసించే ప్రజల జీవితాలను రక్షిస్తాయి. తుఫానులు, సునామీలు వంటి ప్రకృతి విపత్తుల వేళ సముద్ర అలల తీవ్రతను తట్టుకుని భూభాగాన్ని కాపాడే తొలి రక్షణ రేఖగా నిలుస్తాయి. వీటి వేర్లు గాలిలోకి పైకి కనిపించే విధంగా పెరగడం, అధిక ఉప్పు నీటిని తట్టుకునే సామర్థ్యం కలిగి ఉండటం వంటి విశిష్ట లక్షణాలతో మడ చెట్లు ప్రకృతిలో విలక్షణంగా నిలుస్తాయి. ఈ అడవులు జీవ వైవిధ్యానికి నిలయాలుగా పనిచేస్తాయి. అనేక రకాల చేపలు, రొయ్యలు, తాబేళు ,, పక్షులు, పీతలు, సముద్ర కీటకాలు ఇవి నివాసముంటే శ్రేష్ఠమైన ప్రాంతాలుగా ఉపయోగించు కుంటాయి. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 4,000 రకాల వృక్ష జాతులు, 2,000 రకాల జంతు జాతులు మడ అడవుల్లో నివసిస్తున్నట్లు పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. ఇవి సముద్ర జీవుల ఉత్పత్తికి వేదికగా, మత్స్యకారులకు జీవనాధారంగా, తీర ప్రాంతాల ప్రజలకు జీవనోపాధిగా నిలుస్తున్నాయి. మడ అడవులు గాలిలోని కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి భద్రపరిచే శక్తిలో ఎంతో ముందంజలో ఉన్నాయి. సాధారణ భూమిపై ఉండే అడవుల కంటే నాలుగు నుండి పది రెట్లు ఎక్కువగా కార్బన్‌ను ఇవి నిల్వ చేయగలవు. దీన్ని "బ్లూ కార్బన్" అంటారు. గ్లోబల్ వార్మింగ్‌ను నియంత్రించడంలో ఇవి అసాధారణ పాత్ర పోషిస్తున్నాయి. అంతేగాక, నదుల ద్వారా వచ్చే కాలుష్య నీటిని వడపోసి, సముద్రానికి శుద్ధమైన నీటిని అందించడం ద్వారా నీటి నాణ్యతను మెరుగు పరుస్తాయి. అయితే మడ అడవులు ఇప్పుడు ఎన్నో ముప్పులకు గురవుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా గత కొన్ని దశాబ్దాల్లో 35 శాతం మడ అడవులు నశించి పోయినట్లు అంచనా. ముఖ్యంగా సముద్రతీర ప్రాంతాల పట్టణీకరణ, పోర్టుల నిర్మాణం, రొయ్యల చెరువుల విస్తరణ, పర్యాటకాభివృద్ధి పేరిట వీటిని విచక్షణ లేకుండా నరకడం జరుగుతోంది. పారిశ్రామిక కాలుష్యం, ప్లాస్టిక్ వ్యర్థాలే కాక వాతావరణ మార్పుల కారణంగా సముద్ర మట్టం పెరగడం కూడా మడ అడవుల మనుగడకు ముప్పుగా మారింది. భారత దేశంలో సుందర్బన్ మడ అడవి (పశ్చిమ బెంగాల్) ప్రపంచంలోనే అతిపెద్ద మడ అడవిగా ప్రసిద్ధి చెందగా, ఆంధ్ర ప్రదేశ్‌లోని గోదావరి డెల్టా, పులికాట్ సరస్సు, ఒడిశాలోని భితర్కనికా, గుజరాత్‌లోని గల్ఫ్ ఆఫ్ కచ్ వంటి ప్రాంతాల్లో మడ అడవులు విస్తరించి ఉన్నాయి. అయితే ఇటీవలి సంవత్సరాల్లో వీటి విస్తీర్ణం క్షీణిస్తున్నదీ పరిశోధనలు తెలుపు తున్నాయి. ఈ పరిస్థితుల మధ్య మడ అడవుల పరిరక్షణ కోసం ప్రభుత్వాలు పలు కార్యక్రమాలను ప్రారంభించాయి. ముఖ్యంగా ఇంటిగ్రేటెడ్ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్, మిషన్ ఫర్ సస్టెయినబుల్ మడ డెవలప్‌మెంట్, మిషన్ లైఫ్ వంటి కేంద్ర ప్రణాళికలు అమలులో ఉన్నప్పటికీ, ప్రజల భాగస్వామ్యం, విద్యా సంస్థల చొరవ, శాస్త్రీయ పద్ధతుల అనుసరణ అవసరం. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 48%ూ% ప్రకారం పర్యావరణ పరిరక్షణ ప్రభుత్వ ప్రధాన బాధ్యత. కానీ దీనిని పౌరుల ధర్మంగా కూడా భావించాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో ప్రతి జూలై 26న జరుపుకునే అంతర్జాతీయ మడ అడవుల పరిరక్షణ దినోత్సవం, మడ అడవుల ప్రాముఖ్యతను గుర్తు చేసుకునే ఒక చైతన్య దినంగా మారాలి. ప్రకృతికి రక్షణ కవచంగా నిలిచే ఈ అడవులను కాపాడటం ద్వారా, మన భవిష్యత్తును కూడా కాపాడగలమనే సందేశం ప్రజలందరికీ చేరాలి. మడ అడవులు ప్రకృతికి ఒక జీవనరేఖ. సముద్రాన్ని సంరక్షించే కవచం. మానవాళికి రక్షణ వలయాలు. ఈ దినోత్సవాన్ని ఒక ప్రజా ఉద్యమంగా మార్చి, ప్రకృతిని కాపాడే బాధ్యతను మనందరం కలసి భుజాన వేసుకుందాం.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**




## ఎట్టకేలకు NSDL ఐపీఓ

డిపాజిటరీ సంస్థ నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ ఎట్టకేలకు తొలి పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ఆర్థిక, సెక్యూరిటీల మార్కెట్లలో అనేక ఉత్పత్తులు, సేవలను అందిస్తున్న ఈ సంస్థ ఐపీఓ జులై 30న ప్రారంభం కానుంది. మొత్తం రూ.4 వేల కోట్లు మార్కెట్ నుంచి సమీకరించనుంది. ఆగస్టు 1తో పబ్లిక్ ఇష్యూ ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు జులై 29నే బిడ్డింగ్ విండో తెరుచుకోనుంది. ధరల శ్రేణి ఇంకా వెల్లడి కావాల్సిఉంది. ఈ పబ్లిక్ ఇష్యూ పూర్తి ఆఫర్ ఫర్ సేల్ రూపంలో జరుగుతుంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ ఆఫ్ ఇండియా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా తమ తమ వాటాలను తగ్గించుకోనున్నాయి. మొత్తం 5.01 కోట్ల షేర్లను ఓఎఫ్ఎస్ రూపంలో విక్రయించనున్నారు. దీనివల్ల ఎన్ఎస్‌డీఎల్‌కు ఒక్క రూపాయి కూడా రాదు. దేశంలో అతిపెద్ద డిపాజిటరీగా ఉన్న ఎన్ఎస్‌డీఎల్ గతేడాది అక్టోబర్‌లోనే మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నుంచి అనుమతులు పొందింది. సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ 2017లోనే ఎన్ఎస్ఈలో లిస్టయ్యింది. ఇప్పుడు లిస్టింగ్‌కు వస్తున్న రెండో సంస్థ ఇది. డిపాజిటరీ కంపెనీలో ఏ ఒక్క సంస్థా 15 శాతానికి మించి వాటాలు ఉండకూడదన్న సెబీ నిబంధనల నేపథ్యంలో ఆయా కంపె నీలు వాటాలు తగ్గించుకుంటున్నాయి. ఐడీబీఐకి 26.10 శాతం, ఎన్ఎస్ఈకి 24 శాతం చొప్పున ప్రస్తుతం వాటా ఉంది. ఐసీఐసీఐ సెక్యూ రిటీస్ లిమిటెడ్, యాక్సిస్ క్యాపిటల్, హెచ్ఎస్‌బీసీ హోల్డింగ్స్, ఐడీబీఐ క్యాపిటల్, మోతీలాల్ ఓస్వాల్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్, ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ సంస్థలు ఈ ఐపీఓకు బుక్ రన్నింగ్ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఎన్ఎస్‌డీఎల్ నికర లాభం రూ.343 కోట్లుగా ఉంది. మొత్తం ఆదాయం రూ.1,535 కోట్లుగా నమోదైంది. ఎన్నాళ్లగానో ఎదురుచూస్తున్న ఐపీఓ కావడంతో దీనిపై మదుపర్లలోనూ ఆసక్తి నెలకొంది. దీంతో గూగుల్ ట్రెండ్స్‌లోనూ ఎన్ఎస్‌డీఎల్ ఐపీఓ గురించి నెటిజన్లు ఆరా తీస్తున్నారు.

# అలక వీడు చినుకమ్మ.. కంటతడితో రైతన్న

పెద్దపల్లి : జిల్లాలో సాగునీటి వనరులు వెలవెలబోతున్నాయి. నీటి పరవళ్లతో తొణికిసలాడాల్సిన చెరువులు, కుంటలు వర్షాలు లేక బోసిపోతున్నాయి. కొన్నేళ్లుగా జులైలో మత్తడి దూకిన చెరువులు నేడు సాగుకు నీరందని స్థితికి చేరాయి. దీంతో నీటి వనరుల కింద పోసిన నారు మడులు ఎండిపోతుండటంతో అన్నదాత దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఆగస్టుపైనే ఆశలు పెంచుకొని ముందుకెళుతున్నారు. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ నిపుణుల ప్రకటన ఊరించినప్పటికి ముఖం చాటేయడంతో ఆయోమయం నెలకొంది.

**కళ తప్పిన నీటి వనరులు**

జిల్లాలో 1,017 చెరువులు, కుంటలున్నాయి. వీటిలో కనీసం పావలా వంతు కూడా నీరు రాలేదు. యాసంగిలో ఎస్సారెస్పీ నీటి విడుదలతో వేసవిలో నీరు సమృద్ధిగా ఉన్న చెరువులు తప్ప మిగిలిన చోట్ల కళ తప్పాయి. జిల్లా వ్యాప్తంగా వేసవిలో ఉన్న 6 చెరువులు మాత్రమే మత్తడి దూకినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు పెద్దగా భారీ వర్షాలు లేకపోవడంతో చెరువులు నెర్రలు బారుతున్నాయి.



మానేరు, హుస్సేన్‌మియా వాగుల అనుసంధానంతో ఉన్న చెరువుల్లోనూ నీరు లేదు.

**సగంలోపే సాగు**

జిల్లాలో వానాకాలంలో 2.76 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు కానున్నాయని ప్రణాళిక రూపొందించారు.

ఇప్పటివరకు 93,380 ఎకరాల్లో వరి, 47,455 ఎకరాల్లో పత్తి, 18 ఎకరాల్లో కందులు, 241 ఎకరాల్లో మొక్కజొన్న, 9 ఎకరాల్లో ఇతర పంటలు కలుపుకొని మొత్తం 1,41,103 ఎకరాల్లో సాగయ్యాయి. బోర్ల కింద తప్ప చెరువులు, కుంటల పరిధిలో వరి నాట్లు వేయడంలేదు. వారం రోజులుగా అక్కడక్కడ ముసురు తప్ప పెద్ద వర్షాలు కురవలేదు. మరోవైపు ఎస్సారెస్పీ నీరు విడుదల కాకపోవడంతో సాగు ప్రశ్నార్థకంగా మారింది.

చెరువుల్లో నీటి నిల్వలు ఇలా

| | |
|---|---|
| మొత్తం: | 1,017 |
| 25 శాతంలోపు: | 451 |
| 50 శాతంలోపు: | 388 |
| 75 శాతంలోపు: | 130 |
| 100 శాతంలోపు: | 42 |
| మత్తడి పడినవి: | 6 |

# చోటు.. కాటు.. చేటు

ఖమ్మం నగరంలో మూడేళ్ల నుంచి ఏటా రూ.10లక్షలు ఖర్చుచేసి రోజూ 10-12 కుక్కలకు కు.ని.శస్త్రచికిత్స చేస్తున్నారు. మిగతా చోట్ల నామమాత్రంగా చర్యలు తీసుకుంటున్నారు. పిల్లి కాటుకు 396, పాము కాటుకు 170, ఇతర జీవాల కాటుకు 479 మంది గురయ్యారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని పల్లెలు, పట్టణాల్లో కోతులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. పిల్లలు, వృద్ధులు, మహిళలపై దాడిచేసి గాయపరుస్తున్నాయి. శునకాల దాడిలో గాయపడి టీకా తీసుకున్నా.. రేబిస్ వ్యాధి ముదిరి చనిపోయినవారూ ఉన్నారు. శివారు ప్రాంతాలు, పండ్ల చెట్లు, తోటల పెంపకం చేపట్టే పరిసరాల్లో వానరాలు తిష్ఠవేస్తున్నాయి. వీటితో పాటు పిల్లులు, పాములు, ఎలుకలు, ఇతర జంతువులు దాడి చేయటంతో ఈఏడాది జనవరి నుంచి జూన్ వరకు ఉభయ జిల్లాల్లో 19,463 మంది గాయపడి సర్కారు దవాఖానాల్లో టీకాలు వేసుకున్నారు. వీరిలో 17,765 మంది వానరాలు, శునకాల దాడికి గురయ్యారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఇవీ ప్రభుత్వ ఆసుపత్రుల లెక్కలు మాత్రమే. 'ప్రైవేటు'కు వెళ్లినవారు మరో పదిశాతం మంది ఉంటారని అంచనా.

**ఖమ్మం జిల్లాలో..**

ఖమ్మం జిల్లాలో కోతులు 2,952 మందిపై దాడిచేశాయి. ఖమ్మం నగరంలోని కొత్తగూడెం, దానవాయిగూడెం, అల్లీపురం, రాపర్తినగర్, బీసీకాలనీలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. ఒక ప్రాంతంలో వానరాలు పట్టుకుంటే.. మరో కాలనీ నుంచి ఇక్కడికి చేరుతుండటంతో సమస్య మొదటికొస్తుంది. జిల్లాలో 10,895 మంది కుక్కకాటు బారినపడ్డారు.

**కూరగాయల సాగుపై ప్రభావం**

వివిధ పంటల సాగుకు వానరాలు ప్రతిబంధకంగా మారాయి. కోతుల



భయానికి పండ్లు, కూరగాయలు సాగుచేయటానికి రైతులు జంకుతున్నారు. వానాకాలం సీజన్ మొదలై రెండు నెలలవుతున్నా.. ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు 60 ఎకరాలకే కూరగాయలు, 33 ఎకరాలకే వేరుసెనగ సాగు విస్తీర్ణం పరిమితమైందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

**భద్రాద్రి జిల్లాలో..**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈఏడాది తొలి ఆరు మాసాల్లో వివిధ జంతువుల దాడిలో 4,571 మంది గాయపడ్డారు. వీరిలో కుక్కకాటుకు 1,968 మంది, కోతుల దాడికి 1,950, పాము కాటుకు 32, పిల్లి, ఎలుక, ఇతర జీవాల కాటుకు 621 మంది గురయ్యారు. కొత్తగూడెం నగరపాలక సంస్థ పరిధిలో గంగాహుస్సేన్‌బస్తీ, ఫ్యూన్‌బస్తీ, బూడిదగడ్డ, హనుమాన్‌బస్తీ, రామవరంలోని నేతాజీబస్తీ, బర్మాక్యాంపు పరిసరాల్లో కోతులు బీభత్సం సృష్టిస్తున్నాయి. నాలుగేళ్లలో పదకొండు సార్లు కోతులను పట్టేందుకు ప్రత్యేక బృందాలను రప్పించారు. ఇందుకోసం కొత్తగూడెం పురపాలిక రూ.29లక్షలకు పైగా వెచ్చించింది. కుక్కల నియంత్రణకు పెద్దగా చర్యలు తీసుకోవటం లేదు. కొత్తగూడెంలో ఎనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఇక్కడ కు.ని.శస్త్రచికిత్సలు చేసి వదిలేస్తున్నారు. గత రెండేళ్లలో 2,876 శునకాలకు కు.ని.శస్త్రచికిత్స చేశారు.

# సమన్వయ లోపం.. ఆగిన నిర్మాణం



కోరుట్ల: ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం అభివృద్ధి పనులకు శాపంగా మారింది.. అధికారుల్లో ముందుచూపు లేక ప్రజాప్రతినిధుల ఒత్తిడితో ఆగమేఘాల మీద పనులు చేపట్టగా, స్థలానికి సంబంధించిన శాఖ నుంచి అనుమతి లేకపోవడంతో రెండేళ్లుగా అర్థంతరంగా నిలిచిపోయాయి. కోరుట్ల ఆదర్శనగర్‌లో ఉన్న తహసీల్దార్ కార్యాలయం పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉండటంతో వివిధ పనులపై వెళ్లేవారికి వ్యయ ప్రయాసలు ఎదురవుతున్నాయి. సుమారు 23 ఏళ్లుగా ప్రజలు ఇబ్బంది పడుతుండగా పట్టణం మధ్యలోకి మారుస్తామన్న నేతల హామీ ఎన్నికలకే పరిమితమవుతోంది. ఎట్టకేలకు గత శాసనసభ ఎన్నికలకు ముందు అప్పటి ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు కల్లూర్‌రోడ్‌లోని ఎస్సారెస్పీ స్థలంలో తహసీల్దార్ కార్యాలయ నూతన భవనానికి నిర్ణయించారు. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ అధికారులతో అంచనాలు తయారు చేయించారు. ఇందుకోసం 6.5 గుంటల స్థలాన్ని చదును చేయించి హద్దులు నిర్ణయించారు. అధునాతన వసతులతో ఒక అంతస్తుతో కూడిన భవన నిర్మాణానికి రూ.1.30 కోట్లతో ప్రణాళికలు రూపొందించారు.

**15 రోజుల కిందట అనుమతులు**

తహసీల్దారు కార్యాలయ భవనానికి మొదటి విడతలో డీఎంఎఫ్‌టీ నిధులు రూ.20 లక్షలు, ఎస్‌డీఎఫ్ నిధులు రూ.30 లక్షలు మంజూరు చేయించారు. 2023 జూన్ 14న భూమిపూజ చేయగా ఆరు నెలల తర్వాత గుత్తేదారు పనులు ప్రారంభించారు. ఇంతలో తమ శాఖ నుంచి అనుమతులు లేవంటూ నీటిపారుదల అధికారులు అభ్యంతరం చెప్పడంతో మధ్యలోనే నిలిపివేశారు.

అనంతరం జిల్లా స్థాయి అధికారుల సూచనతో గుత్తేదారు పనులు తిరిగి ప్రారంభించారు. పిల్లర్ల దశ వరకు రూ.20 లక్షల విలువైన పనులు జరిగాయి.

అయితే బిల్లుల చెల్లింపునకు స్థలం అనుమతి పత్రాలు కావాలని అధికారులు చెప్పడంతో మరోసారి పనులను నిలిపివేశారు. రాజకీయ ఒత్తిళ్లతోనే పనులు నిలిచిపోయాయని అప్పట్లో విస్తృత ప్రచారం జరిగింది.

ఈ సమస్యను స్థానిక ప్రజాప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎట్టకేలకు 15 రోజుల కిందట ఎస్సారెస్పీ స్థలాన్ని తహసీల్దారు భవనానికి కేటాయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి అన్ని అనుమతులు వచ్చిన నేపథ్యంలో ఇప్పటికైనా పనుల్లో వేగం పుంజుకుంటుందని ప్రజలు ఆశిస్తున్నారు.

**త్వరలోనే ప్రారంభిస్తాం**

రూ.20 లక్షల విలువైన పనులు పూర్తి కాగా బిల్లుల చెల్లింపులో జాప్యం జరిగింది. ఇన్నాళ్లూ నీటిపారుదల శాఖ అనుమతుల కోసం ఎదురుచూడగా 15 రోజుల క్రితం లభించాయి. మిగిలిన రూ.30 లక్షల విలువైన పనులను త్వరలోనే ప్రారంభిస్తాం. నిర్మాణ పనులు పూర్తి కావడానికి ఈ నిధులు సరిపోవు. మరిన్ని మంజూరు కావాల్సి ఉంది.సుచరితరావు, పంచాయతీరాజ్ ఏఈ

# సగటు నమోదు..!



సూర్యాపేట: ఉమ్మడి నల్గొండ జిల్లాపై మేఘాలు మురిపిస్తూ..వరుణుడు దోబూచులాడుతున్నాడు. వానాకాలం సీజన్ మొదలైన 52 రోజుల్లో ఈ మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. పత్తి మొక్కల మధ్యన కలుపు మొక్కలను తొలగిస్తూ..అడుగు మందుగా యూరియా వేస్తున్నారు. వరి నాట్లు వేసే వారు వేస్తుండగా..కొందరు పొలాలను దమ్ము చేసే పనిలో నిమగ్నమయ్యారు. ముమ్మర సాగుపనులతో పొలాల వద్ద రైతులు, కూలీలతో సందడి నెలకొంది. తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ(టీజీడీపీఎస్) వివరాల ప్రకారం జూన్ 1 నుంచి జులై 22 నాటికి పడిన వానలతో యాద్రాది, నల్గొండలో సాధారణ, సూర్యాపేటలో లోటు వర్షపాతం నమోదైంది.

**గుట్టలో సాధారణం.. పేటకు లోటు...** సూర్యాపేట జిల్లాలో ఈ 52 రోజుల్లో 13 రోజులే వర్షం కురిసింది. సగటు సాధారణం కంటే 27 శాతం లోటు వర్షపాతం నమోదైంది. 23 మండలాల్లో జాజిరెడ్డిగూడెం, మోతె, పెనుపహాడ్, మునగాల, కోదాడ, చిలుకూరు, మఠంపల్లి, మేళ్లచెరువు మండలాల్లో సాధారణం కాగా మిగిలిన 15 మండలాల్లో లోటు వర్షమే కురిసింది. కాగా సోమవారం ఉదయం 8:30 నుంచి మంగళవారం ఉదయం 8:30 వరకు 14.9 మి.మీటర్ల వర్షం కరిసింది.నల్గొండ జిల్లాలో 13 రోజులు వర్షం పడి సగటు సాధారణ వర్షపాతం నమోదైంది. 33 మండలాల్లో మర్రిగూడ, గుండ్లపల్లిలో అత్యధిక వర్షపాతం నమోదైంది. ఏడు మండలాల్లో అధిక, 12 చోట్ల సాధారణ వాన కురిసింది. మిగిలిన 12 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. మంగళవారం జిల్లాలో 29.7 మి.మీ. కురియగా అత్యధికంగా అడవిదేవులపల్లిలో 10.15 సెం.మీ., గుర్రంపోడులో 6.9 సెం.మీ, పెద్దవూరులో 6.7 సెం.మీ. వాన పడింది.

ఉమ్మడి జిల్లాలో 4 వేల చెరువులు, కుంటలున్నాయి. ఇవన్నీ గ్రామీణ ప్రాంతాల్లో సాగు స్థిరీకరణకు దోహదపడుతున్నాయి.ఎన్ఎస్పీ కాలువ పరిధిలోని దాదాపు 20 మండలాల్లోని చిన్ననీటి వనరుల్లో ఆశించిన మేర నీటి నిల్వలున్నట్లు తెలిసింది. మిగిలిన ప్రాంతాల్లో ఆయకట్టు సాగుకు, బావులు, బోర్లలో భూగర్భజలాల వృద్ధికి సరిపడా నీరు లేదని సమాచారం. ప్రస్తు తం కురుస్తున్న వర్షాలకు ఆ వనరుల్లోకి చేరిన వరద తక్కువేనని ఆయకట్టు రై తులు వాపోయారు.

# జోరుగా మార్కెట్ ఆధునికీకరణ

ఖమ్మం : ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఆధునికీకరణ పనులు జోరందుకున్నాయి. నాలుగు నెలల్లో పూర్తిచేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. మార్కెట్ ఆధునికీకరణ పనుల కోసం సర్కారు రూ.155.30కోట్లు మంజూరు చేసింది. తొలి విడతలో రూ.114.36 కోట్లతో 21 పనులు, రెండో విడతలో రూ.40.94కోట్లతో రెండు పనులు చేపట్టాలని నిర్ణయించింది. నిర్మాణ పనులను 'ఎజిలిటీ అండ్ భూమి ఇన్‌ఫ్రాటెక్ సర్వీసెస్ సంస్థ'కు అప్పగించింది. పనులను వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తరచూ పర్యవేక్షిస్తున్నారు.

**ఆరు షెడ్ల నిర్మాణం**


మార్కెట్లో ఆరు పెద్ద షెడ్ల నిర్మాణం మొదలైంది. పునాదుల వరకు పనులు పూర్తయ్యాయి. నాలుగు నెలల్లో షెడ్లను నిర్మించాల్సి ఉంది. ఐదు షెడ్లలో పంటల క్రయవిక్రయాలు జరగనున్నాయి. ఆరో షెడ్డును రెండంతస్తుల్లో నిర్మిస్తారు. కింది భాగంలో లావాదేవీలు, మొదటి అంతస్తులో రైతు విశ్రాంతి భవనం, హమాలీలు, దడవాయిల కార్యాలయాలుగా వినియోగించనున్నారు.

**రెండో దశలో కమీషన్ కార్యాలయాలు**

పరిపాలన భవనాన్ని నూతనంగా నిర్మిస్తున్నారు. దీని పనులు చురుగ్గా సాగుతున్నాయి. మార్కెట్‌లో అగ్నిమాపక యంత్రాలు, నీటిసరఫరా వ్యవస్థ, హైమాస్క్ లైట్లు, అండర్‌గ్రౌండ్ సంపులు, ప్రహరీ, సెక్యూరిటీ గార్డుల గదులు, ఎంట్రీ గేట్లు నిర్మిస్తారు. రెండో దశలో రెండు కమీషన్ ఏజెంట్ల కార్యాలయాలు ఏర్పాటు చేస్తారు.

**ఆధునిక హంగులతో..**

ఏడో షెడ్డులో ప్రత్యేకంగా శీతల గిడ్డంగిని నిర్మిస్తారు. ఇందులో రైతులు సుమారు లక్ష మిరప బస్తాలు నిల్వ చేసుకునే అవకాశముంటుంది.



ఏదైనా మార్కెట్ ప్రాంగణంలో ఏసీ గిడ్డంగి నిర్మించటం ఇదే ప్రథమం. వీటితో పాటు అధునాతన సౌకర్యాలతో మూడు శౌచాలయాలు నిర్మిస్తున్నారు. రైతులు, వ్యాపారులు, కార్మికుల దాహార్తి తీర్చేందుకు ఒక్కొక్కటి సుమారు 2వేల లీటర్ల సామర్థ్యంతో నాలుగు ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. 5వేల లీటర్ల నీటి సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ ట్యాంకు, రెండు వే బ్రిడ్జిలు నిర్మిస్తున్నారు.

మార్కెట్ ఆధునికీకరణ పనులు పూర్తయితే రైతుల భవిష్యత్తు అవసరాలకు ఇబ్బంది ఉండదు. గతంలో మాదిరిగా తమ పంట ఉత్పత్తులను రోడ్లపై విక్రయించుకునే దుస్థితి తలెత్తదు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో ఖమ్మం మార్కెట్ దేశానికి ఆదర్శంగా నిలవబోతోంది. శీతల గిడ్డంగిలో రైతులు నామమాత్రపు రుసుముతో పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునే వెసులుబాటు దొరుకుతుంది.
- యరగర్ల హనుమంతరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్, ఖమ్మం

# సంఘాల ప్రగతికి సహకారం

నల్గొండ : ఐకమత్యమే మహాబలం అన్నది.. మనందరికీ తెలిసిందే. దీనిని పాటిస్తూ కేంద్ర ప్రభుత్వం రైతులను ఒకటి చేసేందుకు నిర్ణయించింది. అందులో భాగంగా ఎంపిక చేసిన పీఏసీఎస్ (ప్రాథమిక సహకార సంఘాలు)లను ఎఫ్‌పీవోలు (రైతు ఉత్పత్తిదారుల సంఘం)గా మార్చనున్నారు. తాజాగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎంపిక చేసినఎఫ్‌పీవోల నిర్వహణకు అవసరమయ్యే నిధులను ఆయా సంఘాలకు అందజేశారు. మొదటి విడతలో ఒక్కో సంఘానికి రూ.3.16 లక్షల చొప్పున కేటాయించారు. నల్గొండ జిల్లాలో 45 పీఏసీఎస్‌లు ఉండగా పనితీరు, సామర్థ్యాన్ని బట్టి 13 సంఘాలను ఎఫ్‌పీవోలగా అనుమతించారు.

**ఇలా ఉంటుంది..**

పీఏసీఎస్‌లో సభ్యులు ఎఫ్‌పీవోల్లోనూ చేరవచ్చు. సహకార సంఘాల మాదిరి ఎన్నికల నిర్వహణ ఉండదు. కాకపోతే అక్కడ సభ్యత్వ రుసుం బదులు ఇక్కడ పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. పెట్టుబడులన్నీ కలిపి ఒక ఎఫ్‌పీవో షేర్ క్యాపిటల్ రూ.15 లక్షలుగా ఉండాలి. దీనిక్ జాతీయ సహకార అభివృద్ధి సంస్థ(ఎన్‌సీడీసీ) రూ.15 లక్షల నుంచి రూ.2కోట్ల వరకు రుణం అందిస్తుంది.

సీఈవో వేతనం రూ.25 వేలు, అకౌంటెంట్ జీతం రూ.10 వేలకు మించకుండా ఖర్చు చేయాలి.కంప్యూటర్, ప్రింటర్, ఇతర సామగ్రి



కొనుగోలుకు గరిష్ఠంగా రూ.లక్ష వరకు వెచ్చించవచ్చు.

కార్యాలయం అద్దె కింద ఏడాదికి రూ.48 వేలు, విద్యుత్తు, టెలిఫోన్ ఛార్జీలు రూ.12 వేలు, ప్రయాణ, సమావేశ ఖర్చులు కింద రూ.18 వేలు, స్టేషనరీ ఇతర ఖర్చులు కింద రూ.12 వేలు మించకుండా ఖర్చు చేయాలి.

**ముఖ్య ఉద్దేశం..**

భూసార పరీక్షలు, విత్తన స్వావలంబన, సరైన ఎరువుల ఎంపిక-వాడకం, జలవనరుల సద్వినియోగం, సాంకేతిక వినియోగం, అధిక దిగుబడి(లాభసాటి వ్యవసాయం), మార్కెట్ సౌలభ్యం, సహజ, సేంద్రియ పంటలు-వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులు అందించటం, వ్యవసాయ ఆధారిత-వ్యవసాయేతర వ్యాపారాల నిర్వాహణ, రైతు సమగ్రాభివృద్ధికి దోహదపడటం, గ్రామీణ యువత, మహిళలు-వ్యవసాయేతర ఉత్పత్తుల వారికి సహాయపడటం, సంపద సృష్టి ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించడం.

**మ్యాచింగ్ గ్రాంట్**

సభ్యులు ఒక్కొక్కరు రూ.25 వేలకు మించకుండా గరిష్ఠంగా రూ.15 లక్షల వరకు మ్యాచింగ్ గ్రాంట్ పొందవచ్చు.

స్థిరమైన నమూనా ఆధారంగా ఏడాదిన్నర వ్యాపార ప్రణాళిక, బడ్జెట్ కలిగి ఉండాలి.సభ్యులు తమ వాటాలను పెంచుకోవడమే కాకుండా యాజమాన్య విషయంతో ప్రభుత్వం సహకరిస్తుంది.

యాజమాన్య బోర్డులో మహిళా రైతులు తగినంత ప్రాతినిధ్యం వహించాలి. తద్వారా ఎఫ్‌పీవో క్రెడిట్ విలువ పెరుగుతుంది.

**ఎంపికైన సంఘాలు**

గొల్లగూడ(నల్గొండ), కొత్తపల్లి, చండూరు, గుర్రంపోడు, కనగల్, కట్టంగూరు, వెలిమినేడు, దేవరకొండ, పెద్దవూర, తిప్పర్తి, శాలిగౌరారం, వేములపల్లి, దామరచర్ల.

**బలోపేతం చేయవచ్చు: పత్యానాయక్, డీసీవో, నల్గొండ**

రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఆయా ప్రాంతాలకు అనుగుణంగా వ్యాపార ప్రణాళికలు రూపొందించుకోవాలి. సంఘాలను బలోపేతం చేసి రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడాలి.

# ఊరికి ఉపకారి.. ఆక్రమణలతో ఉరి!

సంగారెడ్డి : రాజధానికి సమీపంలో సంగారెడ్డి జిల్లా ఉండడం వల్ల ఇక్కడి వ్యవసాయ భూములపై స్థిరాస్తి వ్యాపారుల కన్ను పడింది. భూములను కొంటూ, ప్లాట్లు చేస్తూ ఆ పక్కన నీటి వనరులను వదలడం లేదు. ఎఫ్‌టీఎల్, శిఖం, బఫర్ జోన్, అలుగు, కట్టలను కబ్జా చేస్తున్నారు. నాలాగా మార్చి ప్లాట్లు చేసి బేరం పెడుతున్నారు.

**క్షేత్రస్థాయిలో ఇలా**

సంగారెడ్డి పట్టణంలో చంద్రయ్య, దేవుని చెరువులు, బొబ్బిలికుంట, మహబూబ్ సాగర్, దూద్‌బాయి చెరువు, మాసాని కుంట ప్రభుత్వ ఐటీఐ పక్కన ఎర్రకుంట, రాజంపేటలోని ఎర్రకుంట, పోతిరెడ్డిపల్లిలోని కుక్కలకుంటలు ఆక్రమణకు గురయ్యాయి. రెవెన్యూ, నీటిపారుదల అధికారులు సర్వే చేసి గుర్తించిన వారిపై చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలకు తావిస్తోంది.సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని మల్లం చెరువు మరమ్మతుకు రూ.కోటి ఖర్చు చేశారు. ఇపుడు చెరువు అన్యాక్రాంతానికి గురయిందని స్థానికులు వాపోతున్నారు. కంది మండలంలోని పలు గ్రామాల్లో నీటి వనరులు కబ్జాకు గురయ్యాయి.జిన్నారం మండలం ఐడీఏ బొల్లారం తామర చెరువులో కూడా ఎఫ్‌టీఎల్‌లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టినా



ఎవరూ పట్టించుకోవడంలేదు. అందోలులో పెద్ద చెరువు, ఊర చెరువు ప్రాంతాన్ని ఆక్రమించి ఇళ్లు నిర్మించారు. సదాశివపేట పట్టణంలో ఊబ చెరువు శిఖంలో వాణిజ్య, వ్యాపార దుకాణాలు వెలిశాయి.

**సమన్వయం లేక**

నీటిపారుదల, రెవెన్యూ, పురపాలక, పంచాయతీల శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో నీటివనరులు కబ్జాల పర్వం కొనసాగుతోంది. ఇప్పటికే పల్లెలు, పట్టణాల్లో చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్ హద్దులపై సర్వే చేసి, హద్దులు గుర్తించారు. అయితే ఆక్రమణ దారులపై చర్యలు చేపట్టలేదు. హైదరాబాద్ తరహాలో ఇక్కడ కూడా హైడ్రా వ్యవస్థను ఏర్పాట్లు చేసి, ఈ ఘటనలను అడ్డుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.**పరిశీలించి చర్యలు: జైభీం, ఈఈ, సంగారెడ్డి**

నీటి వనరులను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటాం ఆయా ప్రాంతాలను పరిశీలిస్తాం. హైడ్రా అమలుల్లోకి వచ్చినప్పటి నుంచి ఇక్కడ కూడా చెరువుల ఆక్రమణ కొంత తగ్గింది.

జిల్లాలో చెరువులు, కుంటలు: 1769

అన్యాక్రాంతమైనవి: 463

చురకలు



# ఇలా వచ్చి.. అలా కీమో

హైదరాబాద్: ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో ఒకప్పుడు ఒక కీమో సిట్టింగ్‌కు మూడు రోజుల వరకు వేచి చూడాల్సి వచ్చేది. ప్రస్తుతం డే కేర్‌లోనే కీమో థెరపీ చేస్తున్నారు. ఇందుకు ఆసుపత్రిలో ప్రత్యేకంగా 60 పడకలు కేటాయించారు. సమయం ఆదాతో పాటు పేద రోగులపై ఆర్థిక భారం తగ్గుతోంది. క్యాన్సర్ చికిత్సల్లో కీమో కీలకం. క్యాన్సర్ నిర్ధారణ అయినప్పటి నుంచి నియంత్రణలోకి వచ్చే వరకు 6 నుంచి 17 సిట్టింగ్‌ల కీమో థెరపీ తీసుకోవాల్సి ఉంటుంది. గతంలో మూడో రోజు కీమో చేసే వారు. కొన్ని నెలలుగా చికిత్సల్లో మార్పులు చేశారు. ఇలా వచ్చి అలా కీమో తీసుకొని వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. ఆసుపత్రికి వచ్చిన రోజే రక్త పరీక్షలు చేసి, ఆరోగ్యశ్రీ నుంచి అప్రూవల్ తీసుకొని.. కీమో చేసి పంపిస్తున్నట్లు ఎంఎన్‌జే డైరెక్టర్



డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

**ఎక్కువ ఆ క్యాన్సర్లకే...:** రొమ్ము, పెద్ద పేగు, రెక్టమ్, అండాశయ క్యాన్సర్‌కు ఎక్కువగా డే కేర్ కీమో థెరపీ సేవలను అందిస్తున్నారు. ఈ బాధితులకు మూడు వారాలకు ఒకసారి కీమో అవసరం. ప్రస్తుతం రోజుకు 200 వరకు కీమో థెరపీ చికిత్సలు అందిస్తుండగా.. ఇందులో 50-60 మందికి డే కేర్ ఇస్తున్నారు. ఉదయం 8 గంటలకు ఆసుపత్రికి రప్పించి.. రక్త పరీక్షలు చేస్తున్నారు. ఉదయం 10 గంటల కల్లా సంబంధిత వైద్యులు ఆ రిపోర్టులు పరిశీలించి, కీమోకు సిఫార్సు చేస్తారు. అక్కడ నుంచి ఫైల్ ఆరోగ్యశ్రీకి వెళ్తుంది. 20-30 నిమిషాల్లో ఆరోగ్యశ్రీలో ఆమోదం పొందేలా చర్యలు తీసుకుంటారు. అనంతరం గరిష్ఠంగా 2- 3 గంటల్లోనే కీమో పూర్తి చేస్తున్నారు. సాయంత్రం 3 లేదా 4 గంటలకల్లా పూర్తి అవుతుండటంతో ఇళ్లకు వెళ్లిపోతున్నారు.

# కిలోమీటర్ దూరం.. 2 గంటల ప్రయాణం

హైదరాబాద్: భారీ వర్షం పడిందంటే చాలు ఆరాంఘర్ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారుతోంది. దుర్గానగర్ నుంచి మెహిదీపట్నం వైపు వాహనదారులు రైల్వే బ్రిడ్జి కింద, మెహిదీపట్నం వైపు నుంచి దుర్గానగర్ వచ్చేవారు ఆరాంఘర్ చౌరస్తాలోని అండర్‌పాస్‌వే కింద చిక్కుకొని నరకం చూస్తున్నారు. సోమవారం భారీ వర్షంతో దుర్గానగర్ నుంచి ఆరాంఘర్‌కు కిలోమీటర్ దూరం ప్రయాణించడానికి సుమారు 2-3 గంటల సమయం పట్టిందని వాహనదారులు వాపోతున్నారు. ఇటీవల ఈ దారిలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. ప్రధానంగా ఉప్పల్, ఎల్బీనగర్ ప్రాంతాల నుంచి గచ్చిబౌలి, ఓఆర్ఆర్ మీదుగా వెళ్లేవారు ఈ దారినే ఎంచుకుంటారు.



ఆరాంఘర్‌లో ట్రాఫిక్‌తో జూపార్కు వైపు నుంచి బెంగళూరు జాతీయ రహదారిపై శంషాబాద్ వైపు వెళ్లేవారు సైతం చౌరస్తాలో చిక్కుకుపోతున్నారు. హైడ్రా అధికారులు మంగళవారం ఆరాంఘర్‌కు వచ్చి వరద నీటిని పరిశీలించారు. రాజేంద్రనగర్ డీసీ రవికుమార్‌తో చర్చించారు. నాటి భారీ వర్షం కారణంగా వరద చేరిందని నిర్ధారణకు వచ్చారు. నీటిని తోడి వేయడానికి పంపు ఏర్పాటు చేయనున్నట్లు డీసీ తెలిపారు. అండర్‌పాస్ వేలో నిర్మించిన నాలా కుంచించుకుపోవడం వల్లే వరద భారీగా నిలిచిందన్నారు.

# సర్కారు బడుల్లో సంగీత పాఠాలు

చొప్పదండి: సర్కారు బడుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు వారి సర్వతోముఖాభివృద్ధికి కేంద్రీయ విద్యాలయాల తరహాలో పథకాల అమలుకు ఈ పాఠశాలల్లో ఇకపై సంగీత పాఠాలు నేర్పించనున్నారు. ఈమేరకు ఆయా పాఠశాలలకు సంగీత పరికరాలు పంపిణీ చేశారు.

**72 పీఎంశ్రీ పాఠశాలలకు సరఫరా**

ఉమ్మడి జిల్లా పరిధిలోని కరీంనగర్ జిల్లాలో 22, జగిత్యాల 20,



పెద్దపల్లి 16, రాజన్నసిరిసిల్ల జిల్లాలో 16 పీఎంశ్రీ పాఠశాలలకు సంగీత పరికరాలు పంపిణీ చేశారు. తబలా, మృదంగం, హార్మోనియం, వయోలిన్, డ్రమ్, బ్యాండ్ సెట్ ఇలా ఏడు రకాల పరికాలను పంపిణీ చేశారు. అలాగే కొన్ని పాఠశాలలకు 30 మంది విద్యార్థులకు బ్యాండ్ డ్రెస్సులను అందజేశారు.

**ఉపాధ్యాయుల నియామకానికి కసరత్తు**

సంగీత వాయిద్య పరికరాలు అందజేసిన ప్రభుత్వం ప్రత్యేక టీచర్‌ను నియమించేలా కసరత్తు చేస్తోంది. రూ.10 వేల చొప్పున వేతనాలు ఇచ్చేలా ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిసింది. అన్ని రకాల సంగీత వాయిద్యాలు తెలిసిన వారు పరిమితంగా ఉండటంతో ఉపాధ్యాయుల ఎంపిక కష్టతరంగా మారింది. పాఠశాల ప్రార్భభం నాటి నుంచే సంగీత పాఠాలు బోధించాలని నిర్ణయించినా సాధ్యపడలేదు. ఈ నెలాఖరులోగా సంగీతం ఉపాధ్యాయులను నియమించి ఆగస్టు మొదటి వారం నుంచి తరగతులు ప్రారంభించేలా చర్యలు చేపట్టింది. సంగీత సాధనతో విద్యార్థులు చరవాణి, టీవీలకు దూరంగా ఉండటంతోపాటు ఏకాగ్రత పెరుగుతుందని చొప్పదండి జడ్పీ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తెలిపారు.

# గోశాల ప్రతిపాదన.. ఆగిన భూ ఆక్రమణ



హైదరాబాద్: 'నగరానికి సమీపంలో పెద్ద గోశాల ఏర్పాటు చేద్దాం. వేములవాడ రాజన్న ఆలయానికి చెందిన కోడెదూడలు మృత్యువాత పడుతున్నాయి. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు గోశాల ఏర్పాటు చేస్తే బాగుంటుంది. దీనికి అనువైన స్థలం రంగారెడ్డి జిల్లాలో పశువైద్య విశ్వవిద్యాలయానికి సమీపంలో ఉంటే బాగుంటుంది...!' అని రెవెన్యూ సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన సూచనతో దాదాపు రూ.800కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జాకు చెక్ పడినట్లయింది. లేనిపక్షంలో దాదాపు 99.14 ఎకరాల ప్రభుత్వ భూమి పరులపాలయ్యేదే..! రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎన్కేపల్లిలో ప్రభుత్వ భూమి ఆక్రమణ ఇటీవల వెలుగు చూసిన విషయం తెలిసిందే. ఆ భూములను విక్రయానికి పెట్టిన డప్పు రమేశ్ అనే వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు. కొంతమంది ఉన్నతాధికారులు సూత్రధారులుగా ఉన్నట్లు తెలిసింది. ఓ ఐఏఎస్ కీలకంగా వ్యవహరించినట్లు తెలిసింది. ప్రస్తుతం దీనిపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

**దస్తావేజులు తయారు చేసి..**

ఎన్కేపల్లిలోని సర్వేనంబరు 180లో 99.14 ఎకరాల ప్రభుత్వ భూమి కొన్ని దశాబ్దాలుగా బంజరుగా పడిఉంది. 1975 తర్వాత దీనిలో కొంతభాగంలో రైతులు అడపాదడపా మెట్ట పంటలు సాగు చేసేవారు. దీనిపై కన్నేసిన అక్రమార్కులు 2019 నుంచి చక్రం తిప్పారు. రైతుల పేరుతో పట్టాలు సంపాదించి విక్రయించాలని పన్నాగం పన్నారు. దీనికి ఓ ఉన్నతాధికారి సహకరించినట్లు తెలిసింది. ఇప్పటికే ఆయనపై పలు వివాదాలు ఉన్నాయి. నాటి నుంచి అడంగల్‌లో సాగుదారుల కాలమ్‌లో రైతుల పేర్లు నమోదు కావడం ప్రారంభమైంది. ఎన్కేపల్లి గ్రామానికి చెందిన డప్పు రమేశ్.. భూములను సాగు చేసుకుంటున్న 46 మంది రైతుల పేర్లతో భూమి విక్రయానికి అంగీకరించినట్లు అఫిడవిట్లు రూపొందించి కొనుగోలు ఒప్పందం చేసుకున్న దస్తావేజులు తయారు చేశారు. ఈ తతంగం జరుగుతుండగా వేములవాడలో కోడెదూడలు మరణించడంతో గోశాల ఏర్పాటు ప్రతిపాదన తెరమీదకు వచ్చింది.

**ఫోరెన్సిక్ పరీక్షలతో..**

ఎన్కేపల్లి భూముల వ్యవహారం నిగ్గుతేల్చేందుకు పలు దస్త్రాలను ఫోరెన్సిక్ పరీక్షలు పంపారు. 2019లోనే విక్రయ ఒప్పందం చేసుకున్నారు. రైతుల నుంచి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ పేరుతో డప్పు రమేశ్.. హైదరాబాద్‌కు చెందిన సుభాష్‌చంద్ అగర్వాల్, గోయల్ నవీన్‌కుమార్‌లతో విక్రయ ఒప్పందం చేసుకొని, దాన్ని వ్యాపారులు లింగారెడ్డి, సయ్యద్ అసద్ అనే వారికి సెకండ్ పార్టీగా నామినేట్ చేశారు. ఆయా ఒప్పందాల్లో సంతకాలన్నీ డప్పు రమేశ్ చేయగా.. సాక్షులుగా మరో ఇద్దరి సంతకాలు ఉన్నాయి. అనంతరం 2020, జూన్ 14, 2021, ఫిబ్రవరి 2న లింగారెడ్డి, సయ్యద్ అసద్‌ల నుంచి డప్పు రమేశ్ రూ.1.20కోట్లను నగదు రూపంలో, మిగతా సొమ్మును బ్యాంకు ద్వారా తీసుకున్నట్లు రసీదులు లభ్యమయ్యాయి. 2019లో 43 మంది రైతులకు సంబంధించి ఈకేవైసీని సైతం పూర్తి చేయడం విశేషం. అధికారుల సహకారం లేనిదే ఈకేవైసీ ఎలా పూర్తవుతుందని పోలీసులు ప్రశ్నిస్తున్నారు. తర్వాత జాప్యం జరగడంతో విషయాన్ని కొంతమంది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. అంతర్గత విచారణకు ఆదేశించిన సీఎం.. ఈ భూములను గోశాల ఏర్పాటుకు ప్రతిపాదించడం, శంకుస్థాపన చేయడంతో కలుగులోని కబ్జాదారులు బయటకు వచ్చారు.

# వాసనొచ్చే నీరు.. వ్యాధులతో బేజారు



హైదరాబాద్: వర్షాకాలంలో తాగునీటి పట్ల అప్రమత్తంగా ఉంటే ఆరోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చు.. తాగేనీటితో పాటు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఆస్పత్రుల బాట పట్టే అవసరం ఉండదని నిపుణులు సూచిస్తున్నారు. కలుషిత జలాలతో పలు నీటి సంబంధిత వ్యాధులకు దారి తీస్తున్నాయి. ఈ-కోలీ బ్యాక్టీరియాతో పాటు హానికారకాలు కలుషిత నీటిలో ఉంటున్నాయి. నీటి ద్వారా సంక్రమించే వ్యాధులు అనారోగ్యాల ప్రమాదాన్ని పెంచుతాయి.

**అవకాశం ఇలా..:** గాలిలో తేమ, జలమయమైన రోడ్లు కారణంగా వర్షాకాలంలో బ్యాక్టీరియా పెరుగుతుంది. తాగునీరు సరఫరా అయ్యే వనరులు వాన నీటితో కలుషితం కావచ్చు. ముఖ్యంగా నీటిని సేకరించే ట్యాంకులు, పైపులైన్ లీకేజీలు, నీళ్లు పట్టుకునే బిందెలు, ఇతర వస్తువుల వల్ల సమస్య ఉత్పన్నం అయ్యే అవకాశం ఉంటుంది. కలుషితం జలాలను సాధారణంగా రంగు, వాసన, రుచితో గుర్తించొచ్చు. బ్యాక్టీరియా వంటి కాలుష్య కారకాలతో నీరు వాసన వస్తుంది. రుచిని కలిగి ఉంటుంది.

**9 లక్షల క్లోరిన్ మాత్రలు..**

నీటిలో తగినంత క్లోరిన్ ఉండేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. వివిధ దశల్లో క్లోరిన్ కలుపుతూ ఎంత మేరకు ఉందని గుర్తించాలి. మురికివాడలు, ఇతర ప్రాంతాల్లో కలుషిత జలాలకు అవకాశం లేకుండా జలమండలి క్లోరిన్ మాత్రలను పంపిణీ చేస్తోంది. ఈ సీజన్లో 9 లక్షల క్లోరిన్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక్కొక్కటి 20 లీటర్ల నీటికి సరిపోతుంది. పొడి చేసి బిందెలో కలపాలి. అరగంట తర్వాత నీటిని తాగితే మంచిదని అధికారులు చెబుతున్నారు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

కాచిన నీటిని చల్లార్చి తాగాలి.
నిల్వ ఉంచే పాత్రలు శుభ్రంగా ఉండాలి.
ప్లాస్టిక్ డ్రమ్ములు అంత మంచిది కాదు.
నాణ్యతా పరీక్షలతో బోరు నీటిని తాగాలి.
తగినంత క్లోరిన్ ఉంటే ఉండాలి.

# బల్దియాకు బకాయిల భారం




జగిత్యాల : జగిత్యాల పురపాలక సంఘానికి ప్రధాన ఆదాయ వనరులైన వ్యాపార సముదాయాల అద్దె బకాయిలు పేరుకుపోయాయి. పట్టణంలోని మూడు చోట్ల పురపాలక స్థలాల్లో నిర్మించిన వ్యాపార సముదాయాల్లో మొత్తం 196 దుకాణాలున్నాయి. వీటికి అప్పటి నిబంధనల మేరకు టెండర్లు నిర్వహించగా ధరావత్తు చెల్లించి దుకాణ యజమానులు సొంతం చేసుకున్నారు. కాగా ప్రతి నెలా చెల్లించాల్సిన అద్దెను చాలా మంది సకాలంలో చెల్లించడం లేదు.

**మారుతున్న యాజమాన్య హక్కులు**

పురపాలక నిబంధనల ప్రకారం టెండరు ద్వారా దుకాణాలు పొందిన వారు ధరావత్తు చెల్లించి సొంతంగా నిర్వహించాలి. అయితే కొందరు వాటిని ఎక్కువ కిరాయికి అద్దెకిచ్చారు. ఇంకొందరు ఇతరులకు విక్రయించి బాండ్‌పేపర్‌పై ఒప్పందం చేసుకున్నారు. పుర రికార్డుల్లో మాత్రం టెండరు పొందిన వ్యక్తే యజమానిగా చెలామణి అవుతున్నా క్షేత్ర స్థాయిలో దుకాణాలు రెండు, మూడు చేతులు మారడం గమనార్హం. దుకాణాల నిర్వహణపై బల్దియా అధికారులు విచారణ చేపట్టకపోవడంతో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. అంగడిబజార్ వ్యాపార సముదాయంలో ఈ తరహా దుకాణాల మార్పిడి అధికంగా ఉంది. పాతబస్టాండు సముదాయంలో కొందరు నెలల తరబడి బకాయిలు చెల్లించకున్నా అధికారులు చర్యలు చేపట్టడం లేదు.

**రావాల్సింది రూ.54 లక్షలు**

మూడు వ్యాపార సముదాయాలు కలిసి 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.1.39 కోట్ల మేర అద్దె బకాయిలున్నాయి. ఇందులో రూ.85 లక్షల మేరకు సిబ్బంది వసూలు చేశారు. ఇంకా రూ.54 లక్షల బకాయిలు నిలిచిపోయాయి. రెవెన్యూ సిబ్బంది సకాలంలో వసూలు చేయకపోవడంతో యజమానులు కూడా నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. కొన్నాళ్లుగా వ్యాపారాలు తగ్గడంతో ఒక్కో దుకాణాదారు 6 నెలలకు పైగా అద్దె చెల్లించాల్సి ఉంది. రూ.లక్షల్లో వసూళ్లు నిలిచిపోవడంతో పురపాలక ఖజానాపై ఆర్థిక భారం పడుతోంది. గృహ నిర్మాణ రుసం తరువాత అత్యంత ప్రాధాన్యత కలిగిన దుకాణాల అద్దెలు నిలిచిపోవడంతో నిధుల సమస్య నెలకొంది.

**నోటీసులు అందజేస్తాం**

నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలను ఇతరులకు అప్పగించిన వారికి నోటీసులు అందజేస్తామని పుర రెవెన్యూ అధికారులు తెలిపారు. మరోవైపు కొన్ని నెలలుగా బకాయిలు చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తున్న వ్యాపారులకు కూడా ఇస్తామని పేర్కొన్నారు.

# తేలనున్న మరమగ్గాల లెక్క

సిరిసిల్ల: వస్త్రోత్పత్తుల రంగంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలను నేతన్నలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో కేంద్ర జౌళిశాఖ దేశవ్యాప్తంగా మరమగ్గాలపై సర్వేకు సిద్ధమవుతోంది. అందులో రాష్ట్రంలో అత్యధికంగా మరమగ్గాలు ఉన్నది ఉమ్మడి జిల్లాలోనే. వస్త్రోత్పత్తుల్లో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో కేంద్రం ఇచ్చే రాయితీలు.. కార్మికులకు ఉపాధి అవకాశాల విస్తరణను దీనిని ప్రామాణికంగా తీసుకుంటారు. వీటితోపాటు సంక్షేమ పథకాలు కూడా దారిమళ్ల కుండా ఉండేందుకు ఈ సర్వే కీలకం కానుంది. దీనిలో మరమగ్గాల పూర్తి వివరాలను జియోట్యాగింగ్ చేస్తారు.

**ప్రతీ అంశం నమోదు**

రాష్ట్ర ప్రభుత్వం 2017-18లో ఒకసారి సర్వే చేసింది. అప్పుడు ఉమ్మడి జిల్లాలో 28,125 మరమగ్గాలకు జియోట్యాగింగ్ చేశారు. ఏడేళ్లలో వస్త్రోత్పత్తుల రంగంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. సిరిసిల్లలో చాలా వరకు పాత మగ్గాల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేసుకోగా.. కొన్ని తూకం కింద విక్రయించారు. ప్రస్తుతం సాధారణ, రాపియర్, ఏయిర్‌జెట్ ఇలా ఎన్ని రకాల మగ్గాలు ఉన్నాయి. వాటిపై ఎలాంటి రకాల వస్త్రోత్పత్తులు జరుగుతున్నాయి.



కార్మికుల వివరాలు.. వారి నైపుణ్యాలు తదితర అంశాలను పక్కగా సేకరిస్తారు. దీనికోసం ప్రత్యేకంగా గూగుల్ ఫాంను రూపొందించారు. అందులో మరమగ్గాల కారా?నా యజమాని పూర్తి కుటుంబ వివరాలు, మరమగ్గాల సంఖ్య, అవి ఎవరిపేరున ఉన్నాయి, ఎంతమంది కార్మికులు పనిచేస్తున్నారు, ఎన్నిగంటలు, వారి సగటు వేతనం ఎంత? ఇలా ప్రతి అంశం ఉంటుంది. ప్రతి మరమగ్గానికి జియోట్యాగ్‌చేసి బార్‌కోడ్ ఇస్తారు. ఇలా నమోదైన వాటికి మాత్రమే ప్రభుత్వ వస్త్రోత్పత్తుల అనుమతులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రాయితీలకు అర్హత ఉంటుంది.

**ఉమ్మడి జిల్లాలో ఇలా..**

మరమగ్గాలు : 36 వేలు
ఉపాధి పొందుతున్న
కార్మికులు : 8 వేలు
వస్త్రోత్పత్తుల రకాలు : కాటన్ కేస్మెట్, పాలిథిన్, పాలిస్టర్‌తో పాటు ప్రభుత్వ ఆర్డర్లు

# ఇక ఇళ్లకు నంబరు ప్లేట్లు

ధర్మపురి: జిల్లాలోని అయిదు మున్సిపాలిటీల్లో ప్రభుత్వం నూతనంగా ఇంటి నంబర్ ప్లేట్లను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. దీని కోసం ఆయా పురపాలక సంఘాల్లో కమిషనర్లు చర్యలకు శ్రీకారం చుట్టారు. దశాబ్ద కాలంగా ఎలాంటి నంబరు ప్లేట్లను పురపాలికల్లో ఏర్పాటు చేయలేదు. కొత్తగా ఏర్పాటయిన ధర్మపురి, రాయికల్ పురపాలికల్లో అయితే ఇంకా మేజర్ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నెంబర్ ప్లేట్లే దర్శనమిస్తున్నాయి.




**పాలనాపరంగా సమస్యలు**

ఇంటి నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేయకపోవడంతో పరిపాలనాపరంగా సమస్యలు ఏర్పడుతున్నాయి. క్షేత్ర స్థాయిలో సమగ్ర సర్వే చేసే సమయంలో సర్వే సిబ్బంది అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. రానున్న ఏడాది జనాభా లెక్కలు జరగనున్నాయి. ఈ క్రమంలో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పురపాలక సంఘాల కమిషనర్లను ఆదేశిస్తూ, త్వరితగతిన అన్ని పట్టణాల్లో ఇంటి నంబర్ పేట్లను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. దీంతో అధికారులు చర్యలకు ఉపక్రమించారు.

# కనుమరుగై పోతున్నావా.. వల్లభ..!

నల్గొండ : రెవెన్యూ, మున్సిపల్, నీటి పారుదలశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నీటి వనరులు కబ్జా కోరల్లో చిక్కుకుంటున్నాయి. జిల్లా కేంద్రమైన నల్గొండలో మినీ ట్యాంకుబండ్ (వల్లభరావు చెరువు) విస్తీర్ణం ఏటా తగ్గిపోతోంది. 86 ఎకరాలు ఉన్న చెరువు స్థలంపై కొంతమంది కన్నేశారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే అక్రమ పునాదులకు తెరలేపారు. మరికొందరు ఎఫ్‌టీఎల్ పరిధిలో రూ.లక్షల విలువైన స్థలాలను ప్లాట్లుగా చేసి విక్రయాలకు సాగిస్తున్నారు. చెరువు అంతర్భాగంలో మొరం పోసి భూమిని చదును చేస్తూ ప్రహరీ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

**ఆహ్లాదం ఆవిరి**

ప్రజలకు ఆహ్లాదం అందించేందుకు ప్రభుత్వం.. పట్టణ సమీపంలోని వల్లభరావు చెరువును మినీ ట్యాంకుబండ్‌గా మార్చాలని రూ.5 కోట్లను మంజూరు చేసింది. ఇప్పటి వరకు 80 శాతం పనులు పూర్తయ్యాయి. నిధుల లేమితో మిగతా పనులు నిలిపివేశారు. బండ్‌పై సీసీ రోడ్డు నిర్మాణం చేసి అంతర్భాగం వైపు ఎవరూ వెళ్లకుండా రక్షణ చర్యలు కింద స్టీల్ కంచె ఏర్పాటు చేశారు. కొంతమంది వీటిని పట్టించుకోకుండా అక్రమంగా, అనుమతి లేకుండా చెరువులో ఎఫ్‌టీఎల్ హద్దులు దాటి లోపలి భాగంలో ప్లాట్లుగా చేపట్టారు. ముందుగా కర్ర మేకులతో హద్దులు ఏర్పాటు చేసి ఆ తర్వాత ప్రహరీ నిర్మాణాలు చేపడుతున్నారు.

**నిండుకున్న నిర్లక్ష్యం**

అధికారుల సమన్వయలోపం కారణంగా మినీ ట్యాంక్‌బండ్ కుచించుకుపోతోంది. ఇక్కడ అక్రమ పునాదులకు తెరలేపడంతో 2022లో అప్పటి నీటిపారుదలశాఖ డీఈ శ్రీనివాస్‌రావు అడ్డుకున్నారు. తర్వాత ఆ దిక్కుగా అధికారులు దృష్టి సారించకపోవడంతో అక్రమ పునాదులకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. కబ్జాల పర్వంపై కొందరు పోలీసులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోయింది.

చురకలు




# పల్లె పోరుకు సిద్ధం..!

నల్గొండ : పల్లెపోరుకు అధికారులు సిద్ధమయ్యారు. హైకోర్టు తాజా తీర్పుతో ఆశావహుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఎన్నికలను ఈ ఏడాది సెప్టెంబరులోగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అటు అధికారులు మిగతా ఏర్పాట్లకు సన్నద్ధం కానున్నారు. గ్రామ పంచాయతీల్లో పాలక వర్గాల గడువు గతేడాది ఫిబ్రవరి ఒకటితో ముగిసింది. ఆ తర్వాత నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. ఎన్నికల నిర్వహణలో జాప్యంతో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించనుందని భావించిన అధికారులు ఏర్పాట్లు చకచకా చేపట్టారు. నామినేషన్ల సామగ్రితో పాటు ఇతర వాటిని జిల్లా కేంద్రంలోని స్ట్రాంగ్ రూంలో ఉంచారు. బ్యాలెట్ పేపర్ గుర్తులను ఎన్నికల సంఘం నిర్ణయించింది. బ్యాలెట్ పత్రాల ముద్రణకు ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకుల నుంచి టెండర్లు స్వీకరించారు. రిటర్నింగ్ అధికారులను నియమించి శిక్షణ సైతం పూర్తి చేశారు. పీవోలు, ఏపీవోలను ఎంపిక చేయగా శిక్షణ మిగిలి ఉంది. చివరి దశలో ప్రభుత్వం ఎన్నికలపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ప్రక్రియ నిలిచిపోయింది. తాజాగా హైకోర్టు తీర్పుతో మళ్లీ ఎన్నికల నిర్వహణలో కదలిక వచ్చినట్లయింది.

**రిజర్వేషన్లపై ఉత్కంఠ..**

రిజర్వేషన్ల అంశంపై చర్చ జరుగుతోంది. ఇప్పుడు అమలులో ఉన్న




రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్తారా? కొత్తగా ప్రకటిస్తారా? అని అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులు చర్చించుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్న డిమాండ్ ఉంది. ఈ విషయంలోనూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కలిపి 50 శాతం వరకు ఉండేవి. ఇప్పుడు కొత్త ప్రతిపాదనలతో రిజర్వేషన్ల ప్రక్రియలో మార్పులు జరగనున్నాయి. దీంతోపాటు గత ప్రభుత్వం చేసిన చట్టప్రకారం 2019లో కేటాయించిన రిజర్వేషన్లు పదేళ్ల వరకు కొనసాగాలి. దీనిపైనా ప్రస్తుతం ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకుంటుందా అన్న ఉత్కంఠ ఆశావహుల్లో నెలకొంది. గత రిజర్వేషన్ల ప్రకారం అధికారులు ఇప్పటికే నివేదిక సిద్ధం చేసి పంపారు. మరోవైపు గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించే విషయంలో సంబంధిత యంత్రాంగం సిద్ధంగా ఉంది. **ఇదీ.. సంగతి**

జిల్లాలో పంచాయతీలు 856

వార్డులు 7392

పోలింగ్ కేంద్రాలు 7392

# యాప్‌లో.. ఆమె ఆరోగ్యం

నల్గొండ : ప్రభుత్వం రెండేళ్ల క్రితం ప్రారంభించిన ఆరోగ్య మహిళా పథకం జిల్లాలో మహిళలకు ఉపయోగకరంగా ఉంది. ప్రతి మంగళవారం ప్రత్యేకంగా ఎంపిక చేసిన ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ వైద్యులతో పాటు ఇతర సిబ్బంది కూడా మహిళలే పనిచేస్తుండడంతో వారి ఆరోగ్య సమస్యలు పూర్తి స్థాయిలో చెప్పుకోవడానికి అనుకూలంగా ఉంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేంద్రాలు అందుబాటులో ఉంటున్నాయి. ఇక్కడ పీసీవోడీ, థైరాయిడ్, బీపీ, చక్కెరవ్యాధి పరీక్షలతో పాటు, గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ సమస్యలు, హార్మోన్ సమస్యలు, మూత్రనాళ సమస్యలు, మామోగ్రామ్, అల్ట్రాసౌండ్ స్కానింగ్, టుడీ ఈకో వంటి అత్యాధునిక పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. చికిత్స వివరాలు ఆరోగ్య మహిళా యాప్‌లో నిక్షిప్తపరుస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం చింతపల్లి, దామరచర్ల, డిండి, నిడమనూరు, వేములపల్లి, చండూరు, కట్టంగూరు, తిప్పర్తి, మాన్యంచెల్క, శాలిగౌరారం, మర్రిగూడ



ప్రాంతాల్లో ఆరోగ్యమహిళ పథకం కింద ప్రత్యేక వైద్యం అందిస్తున్నారు.

**ఎక్కువగా ఇన్‌ఫెక్షన్లే..** జిల్లాలో మహిళా ఆసుపత్రులకు వచ్చే బాధితులు ఎక్కువగా మూత్రాశయ ఇన్‌ఫెక్షన్‌లతో బాధపడుతున్న వారే ఉంటున్నారు. ఆ తర్వాత మామోగ్రామ్, రక్తహీనత, థైరాయిడ్, వీఐఏ, ఇన్‌ఫెక్షన్ సమస్యలతో బాధపడేవారు ఉంటున్నారు. థైరాయిడ్ సమస్యలు ఉన్నవారిని గుర్తించడంతో పాటు శస్త్రచికిత్సలు కూడా జనరల్ ఆసుపత్రిలో జరిగేలా చూస్తున్నారు. వీరి కోసం రేడియాలజీ విభాగంలో ప్రత్యేక పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటివరకు అమల్లో ఉన్న 37 పరీక్షలతో పాటు ప్రత్యేకంగా విటమిన్ డీ-3, బీ-12 టెస్టులు చేస్తున్నారు.

**మెరుగు పరుస్తున్నాం.** జిల్లాలో ఉన్న ఆరోగ్య మహిళా ఆసుపత్రుల్లో ఓపీ క్రమేణా పెరుగుతుంది. ప్రతి మంగళవారం ఇక్కడ మహిళా వైద్యులతో పాటు సిబ్బంది అందుబాటులో ఉండేలా చూస్తున్నాం. బాధితులకు కావాల్సిన మౌలిక వసతులు కల్పిస్తున్నాం. పరీక్షల కోసం వచ్చేవారి నుంచి రక్తపూతలు సేకరించి టీడీ హబ్ ద్వారా అన్నిరకాల పరీక్షలు చేయించి అదే రోజు వారి చరవాణికి సమాచారం అందేలా చూస్తున్నాం. వ్యాధి తీవ్రతను బట్టి మెరుగైన వైద్యం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులతో పాటు జిల్లా జనరల్ ఆసుపత్రులకు రోగులను పంపిస్తున్నాం.

డా.పుట్ల శ్రీనివాస్ డీఎంహెచ్‌వో, నల్గొండ

2023 మార్చి నుంచి ఆరోగ్య మహిళా ఆసుపత్రుల్లో చికిత్స పొందిన మహిళలు ఇలా.. జిల్లా : నల్గొండ

ఆరోగ్య మహిళ ఆసుపత్రులు : 11

ఓపీ : 1,15,419

పరీక్షలు చేయించుకున్న బాధితులు : 1,01,160

ఇన్‌ఫెక్షన్లు : 3,356

రొమ్ము క్యాన్సర్ : 876

ఇతర పరీక్షలు : 22,367

# బొంరాస్‌పేట.. పర్యాటక కోట!



బొంరాస్‌పేట : సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ రానున్న రోజుల్లో పర్యాటక శోభను సంతరించుకోనుంది. ఇప్పటికే విద్య, వైద్యం, సాగునీరు, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. పర్యాటకంగానూ ముందడుగు పడనుంది. సీఎం చొరవతో బొంరాస్‌పేటలోని రిజర్వు ఫారెస్టులో ఎకో పార్కు ఏర్పాటు చేస్తున్నారు. అధికారులు ప్రాజెక్టుకు రూపకల్పన చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

**అటవీ ప్రాంతం చుట్టూ కంచె..**

చెరువులో బోటింగ్, కాయకింగ్.. రిజర్వు ఫారెస్టులో పర్యావరణ పార్కులు ఏర్పాటు చేస్తారు. అటవీ ప్రాంతం చుట్టూ చైన్‌లింక్ ఫెన్సింగ్ ఉంటుంది. ముఖద్వారాలు, వాహనాలు నిలపడానికి పార్కింగ్ సౌకర్యం కల్పిస్తారు. పార్కులో సందర్శకులు నడవడానికి వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌లు నిర్మిస్తారు. కూర్చోవడానికి బెంచీలు ఏర్పాటు చేస్తారు. తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలు కల్పిస్తారు. అటవీ ప్రాంతాన్ని చూడటానికి 40 అడుగుల ఎత్తయిన వాచ్ టవర్ నిర్మిస్తారు. క్యానోపివాక్, జిప్‌లైన్, రాక్ క్లైంబింగ్ సదుపాయం కల్పిస్తారు. రెండు చిన్న గజెబోలు(గుడిసెల మాదిరిగా ఉండేవి) ఏర్పాటు చేస్తారు. సందర్శకులకు పర్యావరణంపై అవగాహన కల్పించడానికి జిల్లా పర్యావరణ విద్యా కేంద్రం (డీఈఈసి)లు ఏర్పాటు చేస్తారు. రిజర్వు ఫారెస్టు మొత్తం ఆహ్లాదంగా కనిపించడానికి పచ్చదనం పెంచనున్నారు. ఇప్పటికే మూడు అటవీ ప్రాంతాల్లో రావి, మర్రి, వేప వంటి అటవీ జాతులకు చెందిన 85 వేల మొక్కలు నాటారు.

**సుమారు 40 ఎకరాల్లో..**

హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారికి పక్కనే అడవి, చెరువు ఉండడంతో బొంరాస్‌పేటను అనుకూల ప్రాంతంగా అధికారులు ఎంపిక చేశారు. ఇక్కడ 40 ఎకరాల్లో పర్యావరణ పర్యాటకాన్ని అభివృద్ధి చేయనున్నారు. ఇందుకోసం రూ. 8 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. నిధులు రాగానే పనులు చేయనున్నారు.

**బోటింగ్‌కు అవకాశాల పరిశీలన..**

ప్రభుత్వం నిధులు మంజూరు చేయనుండడంతో ముందుగా చెరువులో నీటి లభ్యత, బోటింగ్ అవకాశాలపై గురువారం కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్, నీటి పారుదల శాఖ డీఈ కిరణ్‌కుమార్ పరిశీలించారు. సందర్శకులను ఆకట్టుకునేలా వినూత్నంగా అడవిని అభివృద్ధి చేసే అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. జాతీయ రహదారికి పక్కనే చెరువు ఉండడంతో బోటింగ్‌కు మంచి ఆదరణ వస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. అందరూ సహకరించి ప్రాజెక్టును విజయవంతం చేయాలని, మూణ్నెల్లలో చెరువులో బోటింగ్ ప్రారంభం కావాలని కడా ప్రత్యేకాధికారి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాజేశ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నర్సిములుగౌడ్, రాంచంద్రారెడ్డి, జయకృష్ణ పాల్గొన్నారు.

# చరవాణి.. చేస్తోంది హాని



జగిత్యాల: చిన్ననాటి ఊసులతో.. బాల్యం మిగిల్చిన జ్ఞాపకాలతో జీవితాంతం మధురానుభూతులు పంచుకోవాల్సిన బాలబాలికలు కొందరు నేరాల మరక అంటించుకుంటున్నారు. తెలిసీతెలియని వయసులో, చరవాణులే తమ ఆస్తిగా... టీవీలే నేస్తాలుగా మంచిని నేర్చుకోవాల్సింది పోయి చెడును ఆస్వాదిస్తున్నారు. అమ్మ చేసిన తీపి వంటకాలు రుచిగా ఉంటున్నాయో తెలియదు కానీ హితం కోరని స్నేహితుడు గంజాయికి అలవాటు చేస్తే ఆనందంగా ఉంటున్నారు. పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిన వయసులోనే కొందరు కత్తులు దూస్తున్నారు. నాన్న నడుం చుట్టూ చేతులేసి వాహనంపై వెళ్లాల్సిన వారే వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. నేరాల మరక అంటించుకొని తల్లిదండ్రులకు తీరని వేదన మిగులుస్తున్నారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనూ ఇటీవల బాలబాలికలు పలు నేరాల్లో చిక్కారు. కరోనా సమయంలో ఆన్‌లైన్ తరగతుల పేరిట చరవాణులకు దగ్గరవ్వడం.. ఆ తర్వాత కూడా రోజంతా వాటితోనే కాలక్షేపం చేయడంతో విపరీత ధోరణికి అలవాటు పడుతున్నారు. చాలా మంది చరవాణుల్లో మంచిని స్వీకరిస్తుండగా కొందరు మాత్రం బాల్యంలోనే నేరప్రవృత్తికి సంబంధించిన అంశాలను చూస్తూ ప్రభావితమవుతున్నారు. పలువురు బాలలు తల్లిదండ్రులపై దాడులు చేసిన ఘటనలు వీటి ప్రభావంతోనే అని స్పష్టమైంది. గంజాయి, సిగరెట్, మద్యం తదితరాలకు కూడా బానిసవ్వడం.. నేరాల్లో పాలుపంచుకోవడంతో ఇబ్బందుల పాలవుతున్నారు.

**ఇలా ప్రభావితం**

సామాజిక మాధ్యమాలు

చెడు సావాసాలు

గంజాయి, గుట్కా, మద్యం, సిగరెట్

**ఉమ్మడి జిల్లాలో ఇలా..**

జగిత్యాల పట్టణంలో ముగ్గురు మైనర్లు ఒకే వాహనంపై వెళ్తూ పంచాయతీ కార్యదర్శిని ఢీకొట్టడంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పంచాయతీ కార్యదర్శి కుటుంబంతో పాటు బాల్యంలోనే కేసులతో తల్లిదండ్రులు మనోవేదనకు గురయ్యారు.

బీమారం మండల కేంద్రంలో ఓ బాలుడు ద్విచక్ర వాహనం నడుపుతూ వృద్ధుడిని ఢీకొనడంతో మృతిచెందగా కేసు నమోదైంది.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 2025లో మైనర్లు వాహనం నడిపినందుకు 4,000కు పైగా కేసులు నమోదయ్యాయి.

ఆయా కేసుల్లో తల్లిదండ్రులకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించడం తల్లిదండ్రులకు ఇబ్బందిగా మారింది.

మహారాష్ట్ర నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్నారంటూ పోలీసులు నిఘా పెట్టగా మెట్‌పల్లి పట్టణంలో పలువురు మైనర్లు గంజాయి విక్రేతలుగా ఉన్నట్లు తెలిసి విస్తుపోయారు.

రామగుండం కమిషనరేట్ పరిధిలోనూ పలువురు మైనర్లపై గంజాయి రవాణా, దాడుల కేసులు నమోదయ్యాయి. జీడిమెట్లలో రెండు రోజుల కిందట వెలుగుచూసిన ఘటన బాలబాలికల్లో నేర ప్రవృత్తి ఎంతలా పెరిగిందో స్పష్టం చేస్తోంది. సామాజిక మాధ్యమంలో పరిచయమైన ప్రేమ పదో తరగతిలోనే ఓ బాలిక చేత తల్లిని హత్య చేయించింది. ప్రేమ మోజులో ప్రియుడు, అతని తమ్ముడితో కలిసి బాలిక ఈ దారుణానికి ఒడిగట్టింది.

**ప్రవర్తన గమనించాలి..**

డాక్టర్ వీరేందర్, సైకాలజిస్ట్

కుటుంబ పరిస్థితులు, చుట్టూ ఉన్న వాతావరణం బాలబాలికల ప్రవర్తనలో మార్పు తెచ్చే అవకాశముంది. పాఠశాలల్లోనూ ఎలా ఉంటున్నారన్న విషయాలను గ్రహించి ఉపాధ్యాయులకు తెలిపితే ప్రయోజనముంటుంది. ఇటీవల నేరప్రవృత్తి కూడా పెరిగింది. సామాజిక మాధ్యమాల్లో చెడు ఎక్కువగా ఆకర్షించే అవకాశముంటుంది కాబట్టి ఆ వైపుగా పిల్లలు ఆకర్షితులు కాకుండా చూడాలి. తల్లిదండ్రులు వారి పిల్లలను తరచూ మాట్లాడిస్తూ వారి ప్రవర్తనలో మార్పు ఏమైనా ఉందా గమనించాలి. ఏ మాత్రం మార్పు ఉన్నా కౌన్సెలింగ్ ఉపయుక్తంగా ఉంటుంది. తల్లిదండ్రులు, బంధువులు, మానసిక నిపుణులు చిన్నారుల మానసిక స్థితిలో మార్పు తెచ్చే అవకాశముంటుంది.

**చట్టపరమైన చర్యలు**

రఘుచందర్, డీఎస్పీ, జగిత్యాల

మైనర్ల కదలికలను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి. ఎక్కువగా చరవాణి వినియోగిస్తుండటం, మానసిక ప్రవర్తనలో మార్పులు కనిపిస్తే బంధువులు, ఇతరుల సహకారంతో మార్పునకు ప్రయత్నించాలి. గంజాయి, మద్యం మత్తు బారిన పడకుండా మైనర్లను కాపాడటం కొందరు తల్లిదండ్రులకు సవాలుగా మారింది. దాడులు, ఇతర కేసుల్లో నిందితులుగా ఉన్న బాలబాలికలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం.

# విభిన్న సేద్యానికి ఊతం లభించేనా?

సిరిసిల్ల: గంభీరావుపేట మండలం నర్మాలలో మల్బరీ సాగు, పట్టు పురుగుల పెంపకం కేంద్రం, పక్కనే చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ రెండు కేంద్రాలు నిరాదరణకు గురయ్యాయి. వీటికి సంబంధించిన సుమారు 100 ఎకరాలకుపైగా భూములు ఉన్నాయి. ఈ భూమిని సద్వినియోగం చేసుకుంటే పరిశోధనలకు మరింత మేలు జరగనుంది.

జొన్న, సజ్జ, నువ్వు, అలసంద, చెరకు, పసుపు, మిరప, మినుము, పల్లీ ఇలా.. చెప్పుకుంటూ పోతే లెక్కకు మిక్కిలి పంటలు. కానీ జిల్లాలో వరి, పత్తి మొక్కజొన్న పంటలు మాత్రమే సాగు చేస్తున్నారు. వీటిల్లో ఏటికేడు వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. అయితే సేద్యంలో వినూత్న ఆలోచనలతో విభిన్న పంటలు పండించేందుకు కృషి విజ్ఞాన కేంద్రాలు (కేవీకే)లు ఉండాలి. కేంద్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్రానికి 16 కేవీకేలను మంజూరు చేసింది. కాగా జిల్లాలో నెలకొల్పాలనే దానిపై ప్రాధాన్యత కనిపిస్తోంది.

దేశవ్యాప్తంగా జిల్లాకో కృషి విజ్ఞాన కేంద్రాన్ని(కేవీకే) నెలకొల్పాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర వ్యవసాయ వర్సిటీ చర్యలు చేపట్టాయి. కొత్తగా మంజూరయ్యే దానితో వ్యవసాయ, ఉద్యాన, పశుపోషణ సమాచారం ఒకే చోట లభించి రైతులకు సాగు సంబంధిత సేవలు మరింతగా దరిచేరుతాయి.

**కలిగే ప్రయోజనాలు ఇలా..**

జిల్లాలోని వ్యవసాయ డిగ్రీ కళాశాలను పీజీ స్థాయికి పెంచేందుకు పలు కోర్సుల ప్రారంభానికి గతేడాది యూనివర్సిటీ అనుమతికి పంపారు. అలాగే పాలిటెక్నిక్ డిప్లొమాలోనూ మరిన్ని కోర్సులు పెంచేలా ప్రయత్నాలు సాగుతున్నాయి. వీటికి తోడు కేవీకే ఏర్పాటుతో జిల్లాలో వ్యవసాయంపై మరో ముందడుగు పడుతుంది.




కొత్తగా ఏర్పాటు చేయనున్న కేవీకేల్లో ఒక సీనియర్ సైంటిస్ట్, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక శాస్త్రవేత్తలు కార్యాలయ సిబ్బంది, సాంకేతిక ఉద్యోగులు ఉంటారు. వీరితో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా జిల్లా స్థాయి సమగ్ర వ్యవసాయ కేంద్రంగా తీర్చిదిద్దుతారు. పరిశోధన స్థానాల్లో అభివృద్ధి చేసిన నూతన వంగడాలను తొలుత కేవీకేల్లోని క్షేత్రాల్లో సాగు చేసి ఫలితాలను సమీక్షిస్తారు.

శాస్త్రవేత్తలు నూతన వంగడాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన ఫలితాలపై ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. నూతన సాగు విధానాలపై వీటిల్లో పరిశోధనలు చేపడతారు. భూసార పరీక్ష కిట్లు, వ్యవసాయ యంత్రాలు, పరికరాలను రైతులకు అందిస్తారు.

వాతావరణ సమాచారం, చీడపీడల నివారణపై రైతులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేస్తారు. జిల్లెలలో వ్యవసాయ డిగ్రీ, సర్దాపూర్‌లోని పాలిటెక్నిక్ కళాశాల ఉంది. కేవీకే అందుబాటులోకి వస్తే క్షేత్ర పరిశీలనలో శాస్త్రవేత్తలతో కలిసి పని చేసే అనుభవం వస్తుంది.

# ఆగుతూ.. సాగుతూ..!

నల్గొండ: ప్రపంచ బౌద్ధక్షేత్రాల్లో ఒకటిగా పేరొందిన నాగార్జునసాగర్ బుద్ధవన ప్రాజెక్టు అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. గతేడాది పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు బుద్ధవనాన్ని సందర్శించి ఇక్కడి అద్భుత బౌద్ధశిల్ప సంపద, కళాకృతులు, బుద్ధ చరిత్ర ప్రాంతాలను చూసి అబ్బురపడ్డారు. ఈక్షేత్ర అభివృద్ధికి నిధులు త్వరితగతిన మంజూరు చేస్తామని ప్రకటించారు. మంత్రి పర్యటన తర్వాత రూ. 15.39 కోట్లు యువజన సాంస్కృతిక శాఖ నిధుల నుంచి కేటాయించారు. వాణిజ్య దుకాణాల నిర్మాణం, లైటింగ్, పెయింటింగ్, కాటేజ్‌ల పునఃనిర్మాణ పనులు ఆగుతూ సాగుతూ నడుస్తున్నాయి. బుద్ధవనంలోనూ చేయాల్సిన పెండింగ్ ఫ్లోరింగ్ పనులు పూర్తి చేయాల్సి ఉంది.

**నిధులు కేటాయించేనా..**

బుద్ధ చరితకు సంబంధించిన సమస్త సమాచారాన్ని డిజిటలైజ్ చేసి ఔత్సాహిక పర్యాటకుల కోసం 'డిజిటల్ ఎక్స్‌పీరియన్స్ మ్యూజిక్ సెంటర్' పనులు చేపట్టాల్సి ఉంది. ఇందుకు సంబంధించి బుద్ధచరితవనానికి కుడివైపు ప్రతిపాదిత స్థలం అందుబాటులో ఉన్నా.. ఇంకా పనులు సాగడం లేదు. నాగార్జునకొండపై 'టూరిస్ట్ డెస్టినేషన్' చేస్తామని మంత్రి ప్రకటించినా నిధులు రాలేదు.

మూడేళ్లుగా జీవో నెంబర్ 280 ప్రకారం రూ. 5.39 కోట్లు బుద్ధవనానికి



కేటాయించగా ఇందులో 17 రకాలైన పనులు చేపట్టనున్నారు. ఉపరితల నీటి ట్యాంకులు, పైప్‌లైన్ పనులు పూర్తవుతుండగా ఇంకా క్లాక్‌రూమ్, సైన్ బోర్డ్స్ టెండర్లు పూర్తికావాల్సి ఉంది. జీవో నెంబర్ 1 ప్రకారం రూ. 10 కోట్లు లైటింగ్, పెయింటింగ్, పెండింగ్ పనులు పూర్తి చేయాల్సి ఉంది. బుద్ధవనంలో విభిన్న రూపాల్లో ఉండే బౌద్ధ స్తూపాలకు, ధ్యానమందిరానికి ఏసీలు, కార్యాలయాలకు విద్యుత్తు సౌకర్యాలతో నిరంతరం వెలిగేలా ఏర్పాటు చేశారు. ప్రతి నెల దాదాపు రూ. 2లక్షల విద్యుత్తు బిల్లులు వచ్చేవి. విద్యుత్తు అవసరాలకు రెడ్‌కో ఆధ్వర్యంలో సౌరశక్తిని ఉపయోగించేందుకు శ్రీకారం చుట్టారు. ఇటీవల రూ. 93లక్షలతో 150 కిలోవాట్ల సామర్థ్యంతో భారీ సౌరశక్తి ఫలకాలను ఏర్పాటు చేశారు. యూనిట్ ఏర్పాటు చేసిన తర్వాత నెలకు వినియోగాన్ని బట్టి నెలకు రూ. 50వేల నుంచి రూ. 70వేల వరకు ఖర్చవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. నెలకు గరిష్ఠంగా రూ. లక్షన్నర వరకు ఆదా అవుతున్నట్లు చెబుతున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించనప్పుడు బుద్ధవనంలో జరిగే కార్యక్రమాలకు విద్యుత్తు అవసరాలు ఉపయోగించుకుంటున్నారు.

# ఎప్పటికప్పుడు.. యంత్రంలో నమోదు

గరిడేపల్లి: రైతులకు అవసరమైన ఎరువులు ఎప్పటికప్పుడు వ్యవసాయశాఖకు తెలియడానికి ఈ-పాస్ యంత్రాలతోనే అమ్మకాలు చేయాలని ఆ శాఖ ఆదేశించింది. గతంలో వీటి వినియోగం ఉన్నా.. కొన్నిసార్లు ఈ-పాస్‌లో నమోదు చేయకుండానే అమ్మకాలు చేస్తున్నారు. దాంతో కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీ సక్రమంగా పంపిణీ కావడం లేదు. అందుకే ఈసారి కొత్త యంత్రాలను సరఫరా చేసింది.

**పాత సాంకేతికత అప్‌డేట్‌తో..**

పాత సాంకేతికతకు అప్‌డేట్ చేసి అందులో కొన్ని ఆప్షన్స్ ఇచ్చింది. రైతు చెల్లింపులను ఫోన్‌పే, గూగుల్‌పే, నగదు ద్వారా చేస్తున్నారా అనేది అడుగుతుంది. దాంతో పాటు భూసార పరీక్ష ఫలితాల పత్రం ఉందా లేదా అని తెలుసుకుంటున్నారు. భవిష్యత్తులో ఈ-పాస్ యంత్రాల సాయంతో పాటు రైతు విశిష్ట సంఖ్యకు అనుసంధానం చేసి రైతులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని కేంద్రం సేకరించే అవకాశం ఉందని తెలిసింది. రైతుకు ఎంత పొలం ఉందో ఈ-పాస్ యంత్రంలో ఇట్టే తెలుస్తుంది. తద్వారా ఎంత ఎరువు అవసరం, ఎంత కొనుగోలు చేస్తున్నారో తెలుసుకోవచ్చు. ఇప్పటికే కేంద్రం ఎరువులపై రాయితీని లక్షల కోట్లు చెల్లిస్తోంది. రాయితీ సొమ్ము పారదర్శక చెల్లింపుతో పాటు ఎరువుల వినియోగం, సరఫరాలో కచ్చితత్వం ఉంటుంది. అందుకే దీన్ని సక్రమంగా అమలు చేసేందుకు కొత్త పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకు వస్తోంది.

**సమస్యలు రాకుండా..**

ఏ ఎరువు ఎంత అమ్ముడు పోయిందనేది తెలిస్తే.. తదనుగుణంగా కంపెనీలకు ఎప్పటికప్పుడు రాయితీ సొమ్ము కేంద్రం చెల్లిస్తుంది. ఈ-పాస్‌లో నమోదు చేయకపోతే సదరు కంపెనీలకు రాయితీ సొమ్ము



నిలిచిపోతుంది. దాంతో పాటు ఎరువులు నిల్వ ఉన్నట్లుగానే నమోదవుతుంది. అప్పుడు సరఫరాలో ఇబ్బందులు ఏర్పడతాయి. గతేడాది సహకార సంఘాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఈ-పాస్‌లలో నమోదు చేయలేదు. యూరియా కొరతతో లారీ లోడు రాగానే ఎగబడి లారీ మీది నుంచి నేరుగా ట్రాక్టర్లు, ఆటోలలో వేసుకుని వెళ్లారు. అప్పుడు సిబ్బంది ఈ-పాస్ చేయించలేకపోయారు. దాంతో మార్క్‌ఫెడ్‌లో సహకార సంఘాలకు సరఫరా చేసిన యూరియా స్టాక్ ఉన్నట్లుగానే నివేదించారు. దాంతో సదరు సంఘానికి యూరియా సరఫరా చేయలేకపోయారు. సమస్యను గుర్తించి వ్యవసాయ శాఖ మండల అధికారులకు కచ్చితమైన ఆదేశాలిచ్చి ఈ-పాస్ పూర్తి చేయాలని సూచించారు. దీంతో ఆగమేఘాల మీద నమోదు చేశారు. ఇలా జాప్యం జరగకుండా ఈసారి పకడ్బందీగా ఈ-పాస్‌తోనే అమ్మకాలు చేయాలని ఆదేశించారు. మరో పదిహేను రోజుల్లో ఎరువుల అమ్మకాలు ప్రారంభం కానున్నాయి.

## కష్టాలే వసతి.. కన్నీళ్లే గతి

నంద్యాల : పెచ్చులూడుతున్న భవనాలు.. ఒక్కో గదిలో లెక్కకు మించి 'వసతి'.. కటిక నేలపై నిద్ర.. కాలకృత్యాలకు అవస్థలు.. ఆరుబయట స్నానాలు.. గత ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా ప్రభుత్వం ఒక్క పైసా ఇవ్వకపోవడంతో విద్యార్థుల వసతికి గ్రహణం పట్టింది.. దీన్ని గమనించిన 'కూటమి' ప్రభుత్వం మార్చిలో నిధులిచ్చింది. సంక్షేమ వసతి గృహాలు (గిరిజన, ఎస్సీ, బీసీ) కలిపి 31 వరకు ఉన్నాయి. వీటి ఆధునికీకరణకు ప్రభుత్వం రూ.8.21 కోట్లు విడుదల చేసింది. వీటితో మరుగుదొడ్లకు మరమ్మతులు, నీటి సౌకర్యం, గదుల్లో దీపాలు, పంకాలు బిగించడం, దోమలు రాకుండా కిటికీలకు జాలీలు, తలుపులకు మరమ్మతులు, పైకప్పు, ఫ్లోరింగ్‌ను బాగు చేయాల్సి ఉంది. బాలికల వసతి గృహాలకు ప్రహరీలు కచ్చితంగా నిర్మించారు. నిధులున్నా అధికారులు పర్యవేక్షణ కొరవడింది.. గుత్తేదారులు పనులు వేగవంతం చేయడం లేదు. ఇప్పటి వరకు 60 శాతమే పూర్తి చేశారు.. దీంతో సౌకర్యాల లేమితో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

చిన్న గది.. 12 మంది జిల్లా కేంద్రంలో బీసీ కళాశాల బాలుర వసతి గృహంలో 110 మంది విద్యార్థులు ఉంటున్నారు. రేకుల షెడ్డుతో కూడిన ఈ గదిలో 12 మందికి వసతి కల్పించారు. చోటు చాలక ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ మూడే మరుగుదొడ్లు ఉన్నాయి. ఆరుబయటే స్నానం చేస్తున్నారు. గదుల్లో పైకప్పు పెచ్చులూడి కింద పడుతోంది.

**మంచాలు మడతపెట్టేశారు**



మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతిగృహంలో 60 మంది విద్యార్థులున్నారు. ఇక్కడ నాలుగు గదులే ఉన్నాయి. చోటు చాలక 70 మంచాలు పక్కన పడేశారు. అవన్నీ తుప్పుపట్టి పోతున్నాయి.

**విభజించి.. అప్పగించి**

2025-26 విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోగా వసతి గృహాల్లో పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మండలాల వారీగా విభజించి వివిధ శాఖలకు పనులు అప్పగించారు. జిల్లాలోని 20 మండలాల్లోని 31 వసతి గృహాలను ఏపీఈడబ్ల్యూఐడీసీ, సమగ్రశిక్షా అభియాన్, ట్రైబల్ వెల్ఫేర్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ఆధ్వర్యంలో పనుల పర్యవేక్షణ కట్టబెట్టింది.

మార్చిలో పనుల ప్రారంభించి జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. గడువు దాటి నెల గడిచినా పనులు పూర్తి కాలేదు. నిధులు గత ఆర్థిక సంవత్సరం పద్దుల్లో చేర్చకపోవడంతో ఇబ్బంది తలెత్తింది.ప్రస్తుతం 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ నుంచి కేటాయింపులు చేసే విధంగా ఉన్నతస్థాయిలో నిర్ణయం తీసుకోవడంతో ఇటీవల పనులు తిరిగి ప్రారంభమయ్యాయి.

పనుల్లో నాణ్యత కరవైంది. ప్రత్యేకించి మరుగుదొడ్లలో వేసిన కుళాయిలు నాసిరకంగా ఉన్నాయి.

## కూలిన ధ్వజస్తంభం.. ఆగిన స్వామి కల్యాణం

నంద్యాల : నల్లమలలో కొలువుదీరిన స్వయంభూ శ్రీచెంచు లక్ష్మీమహాలక్ష్మీ సమేత సర్వనరసింహస్వామి దేవస్థానం అభివృద్ధి పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ప్రతి నెలా పౌర్ణమి రోజున, స్వామి జన్మనక్షత్రమైన స్వాతి.. నాడు ఉత్సవాలు జరిపించడం ఆనవాయితీ. నంద్యాల-ఒంగోలు ప్రధాన రహదారిలో వెలసిన ఈ ఆలయానికి నంద్యాల, కర్నూలు, వైఎస్సార్, ప్రకాశం జిల్లాల నుంచి ఎక్కువ సంఖ్యలో భక్తులు వస్తుంటారు. 2018లో ఆలయ ప్రాంగణంలో ఉన్న ధ్వజస్తంభం భారీ వర్షాలతో కూలిపోయింది. పునర్నిర్మించకపోవడంతో ప్రతి జరిగే స్వామి వారి కల్యాణం ఏడేళ్లుగా ఆగిపోయింది.

**మూలుగుతున్న రూ.1.80 కోట్లు**

మౌలిక వసతుల కల్పనకు దేవాదాయశాఖ రూ.20 లక్షలు విడుదల చేసింది. ఆలయం ముందుభాగంలో కూలిపోయిన రాతికట్టడం, ఇతర మౌలిక సదుపాయాల పునరుద్ధరణకు తిరుమల తిరుపతి దేవాస్థానం రూ.1.6 కోట్లు మంజూరు చేసింది. ప్రహరీ, ఇతర నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించకపోవడంతో కొంతమేర రక్షణగోడ కూలింది. మూడేళ్లవుతున్నా పనులు అరకొరగానే చేపట్టారు. ప్రస్తుతం దేవస్థాన ప్రాంగణంలో కనీస మౌలిక వసతులు కానరావడం లేదు.



**రూ.23 లక్షల ఆదాయం**

శ్రీసర్వలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం కేటగిరి6(బి)లో ఉంది. ఇక్కడ ఇద్దరు అర్చకులు, ఒక కాపలాదారు, పారిశుద్ధ్య కార్మికురాలు, ఇద్దరు ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు. ఆలయ భూమి 19.41 సెంట్ల విస్తీర్ణంలో ఉంది. దేవస్థానం మొత్తం ఆదాయం రూ.23.11 లక్షలు కాగా.. ఇందులో భూముల ద్వారా రూ.2.34 లక్షలు, హుండీల ద్వారా రూ.12.8లక్షలు, సేవా టికెట్స్ ద్వారా రూ.1.5 లక్షలు వస్తున్నాయి. ఇందులో దేవస్థాన సిబ్బంది జీతాలకు రూ.5.28లక్షలు చెల్లిస్తున్నారు. ఫిక్స్ డిపాజిట్లు 10 ఉండగా, వాటి విలువ రూ.35.95 లక్షలు , 113 గ్రాములకు పైగా బంగారు, 10 కిలోలకు పైగా వెండి ఉంది.

**అటవీ శాఖ అనుమతులిస్తే**

– నరసయ్య, ఆలయ కార్యనిర్వహణాధికారి

గతంలో దేవస్థానానికి సంబంధించిన డిజైన్ మార్చడంతో పనులు నెమ్మదించాయి. తర్వాత వేగవంతంగా జరుగుతున్న సందర్భంలో అటవీశాఖ ఆదేశాల మేరకు ఆలయ అభివృద్ధి పనులను ఆపాల్సి వచ్చింది. ప్రస్తుతం అటవీశాఖ ఉన్నతాధికారులకు విన్నవించాం. వారి నుంచి అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించి త్వరగా పూర్తి చేస్తాం.

# వెనుకబడిన పర్యవేక్షణ



రోలుగుంట : జిల్లాలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ పరిధిలోని వసతిగృహాల్లో వార్డెన్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఆ ప్రభావం హాస్టళ్లలోని విద్యార్థులపై పడుతోంది. గత్యంతరం లేక రెండు, మూడు వసతిగృహాల పర్యవేక్షణు ఒకరే చూస్తున్నారు. ఈ కారణంగా వసతిగృహాలపై సమీక్షల మొదలుకుని పిల్లలపై విద్యాపరమైన పర్యవేక్షణ లోపిస్తోంది. రోజూ రాత్రి చదువులను కొనసాగించడం, పరీక్షల నిర్వహణ వంటి కార్యక్రమాలకు ఇబ్బంది తలెత్తుతోంది.

జిల్లాలో 39 ప్రీమెట్రిక్, 12 పోస్టుమెట్రిక్ వసతిగృహాలున్నాయి. నర్సీపట్నం, చోడవరం, ఎలమంచిలి, అనకాపల్లి, పాయకరావుపేట ప్రాంతాల్లో సహాయ బీసీ సంక్షేమాధికారులు వీటి బాధ్యతను చూస్తున్నారు. ఎక్కడా సరిపడా స్థాయిలో వార్డెన్లు లేరు. మాడుగుల, అప్పలరాజుపురం హాస్టళ్ల బాధ్యతలు ఒక్కరే చూస్తున్నారు. కె.కోటపాడు మండలం మల్లునాయుడుపాలెం, రాములమ్మపాలెంతోపాటు దేవరాపల్లి, కె.కోటపాడులోనూ ఇదే పరిస్థితి. కింతలి, కొరువాడ హాస్టళ్లకు రాజునాయుడు వార్డెన్‌గా వ్యవహరిస్తున్నారు.

పూడిమడక, అనకాపల్లిలోని ప్రీ మెట్రిక్, పోస్టుమెట్రిక్ వసతిగృహాలకు ఎస్.సత్యనారాయణ... చోడవరంలోని బాలికల పోస్టుమెట్రిక్, మాడుగుల వసతిగృహాలకు దేవి మేట్రిన్‌గా కొనసాగుతున్నారు. రావికమతం ప్రీ మెట్రిక్, చీడికాడ ఎస్సీ హాస్టల్ బాధ్యతలు ఒకరే చూస్తున్నారు.

గోవాడ, వడ్డాది, బుచ్చెయ్యపేట మూడింటికి వెంకటరమణ వార్డెన్‌గా... ఎస్.రాయవరం, ఎలమంచిలిలోని హాస్టళ్లకు అప్పలనాయుడు వార్డెన్‌గా కొనసాగుతున్నారు. నాతవరం, రోలుగుంట హాస్టళ్లను ఒక్కరే పర్యవేక్షిస్తున్నారు. ఇవి కాకుండా నర్సీపట్నం మండలం వేములపూడి, కోటవురట్ల, భీమిలి ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లు ఉన్నాయి. నర్సీపట్నం, పాయకరావుపేట (బాలికల పోస్టు మెట్రిక్), పెద్దూరు రత్నంపేటలోని ప్రీమెట్రిక్ వసతిగృహాలను భవాని పర్యవేక్షిస్తున్నారు. ఇలా ఒక్కో వార్డెన్, మేట్రిన్ రెండు, మూడు పర్యవేక్షించాల్సి వస్తోందని.. దీనివల్ల ఏ హాస్టల్‌కూ పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోతున్నారనే ఆరోపణులు వినిపిస్తున్నాయి. వార్డెన్ల పోస్టుల భర్తీలో కొనసాగుతున్న జాప్యం విద్యార్థుల పట్ల శాపంగా **మారుతోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**

ఈవిషయమై అనకాపల్లి బీసీ సంక్షేమాధికారి శ్రీదేవితో మాట్లాడుతూ వార్డెన్ల కొరత సమస్య రాష్ట్రవ్యాప్తంగా ఉందన్నారు. ఇటీవలే జిల్లాలో పర్యటించిన ప్రధాన కార్యదర్శికి ఈ సమస్య వివరించామని.. త్వరలోనే ఖాళీల భర్తీకి సన్నాహాలు జరుగుతున్నాయని చెప్పారు.

# ఇక్కడ బోధన.. అక్కడ భోజనం



పి.గన్నవరం: గత వైకాపా ప్రభుత్వం 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసింది. కొన్నిచోట్ల ఖాళీ అయిన భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మోడల్ ప్రైమరీ, ఫౌండేషన్ తదితర విభాగాలు ఏర్పాటుచేయడంతో 3, 4, 5 తరగతులు ఉన్నత పాఠశాలల నుంచి తిరిగి యథాస్థానానికి వచ్చాయి. పి.గన్నవరం పరిధిలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసింది. పలువురు చిన్నారుల వెతలు కనిపించాయి.

పి.గన్నవరం బాలయోగికాలనీ సమీపంలో ఉన్న ఎంపీ ప్రాథమిక పాఠశాలకు సంబంధించి 3, 4, 5 తరగతులను స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో విలీనం చేశారు. ఇక్కడ 1, 2 తరగతులకు 24 మంది విద్యార్థులు మిగిలారు. తరగతి గదులు ఖాళీగా ఉండటంతో రెండు అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటుచేశారు. ప్రస్తుతం మోడల్ ప్రాథమిక పాఠశాలగా ఏర్పాటు కావడంతో 1 నుంచి 5 తరగతుల విద్యార్థులు 68 మంది చదువుతున్నారు. అయిదుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. గదుల కొరత కారణంగా రెండు అంగన్‌వాడీ కేంద్రాలను వరండాలో నిర్వహిస్తున్నారు. ఈ సమస్యలను ఎంఈవో కోన హెలీనా వద్ద ప్రస్తావించగా, విద్యార్థులకు ఇబ్బంది లేకుండా తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ముంగండలోని ఎంపీ ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతులు జడ్పీ ఉన్నత పాఠశాలలో విలీనం కావడంతో ఒకటి, రెండు తరగతుల్లో 22 మంది విద్యార్థులు మిగిలారు. కూటమి ప్రభుత్వం మోడల్ ప్రాథమిక పాఠశాలగా గుర్తించి 1 నుంచి 5 తరగతులకు అయిదుగురు ఉపాధ్యాయులను నియమించింది. ప్రస్తుతం 70 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడున్న భవనంలోని ఒక గదిలో, వరండాలోనే వీరికి తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం ప్రార్థన అనంతరం 3, 4, 5 తరగతుల విద్యార్థులను 200 మీటర్ల దూరంలోని ఉన్నత పాఠశాలకు తీసుకువెళ్లి బోధిస్తున్నారు. మళ్లీ మధ్యాహ్న భోజనం కోసం ప్రధానరహదారి మీదుగా ప్రాథమిక పాఠశాలకు తీసుకొస్తున్నారు. భోజనం అనంతరం మళ్లీ ఉన్నత పాఠశాలకు తీసుకెళ్లడం నిత్యకృత్యమైంది. రాష్ట్ర రహదారి కావడం, ట్రాఫిక్ ఎక్కువగా ఉండటంతో విద్యార్థులను అటు, ఇటు తిప్పడానికి ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

# ఆ తరుగు ఎవరి ఖాతాల్లోకి!



అమలాపురం: చౌకధరల దుకాణాలకు పౌరసరఫరాల సంస్థ గోదాముల నుంచి సరఫరా అవుతున్న బియ్యం బస్తాల్లో తరుగు వస్తోందని రేషన్ డీలర్లు వాపోతున్నారు. దీంతో ప్రతినెలా నష్టపోతున్నామని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టనట్లు వ్యవహరిస్తున్నారని గగ్గోలు పెడుతున్నారు.

**వాస్తవానికి తేడా..**వాస్తవానికి 50 కిలోల బస్తా సంచితో కలుపుకొని 50.560 కిలోల బరువు ఉండాలి. కానీ 46.250, 47.600 కిలోలు ఉంటున్నాయి. గతంలో 50 కేజీల చొప్పున తూచి ఇచ్చేవారు. ప్రస్తుతం ట్రాక్టరుపై 50 బస్తాలు అంటే 2.5 మెట్రిక్ టన్నుల వరకు ఉంచి తూకం వేస్తున్నారు. మొత్తం మీద 30 నుంచి 40 కేజీల వరకు తరుగు సాధారణం అవుతోంది. దీనికి మించి ఒక్కోసారి 60 నుంచి 75 కేజీల వరకు తగ్గుతోంది. ఉండాల్సిన నిల్వల కన్నా తక్కువ ఉండటంతో వాటిని పక్కదారి పట్టించినట్లు అభియోగాలు ఎదుర్కోవాల్సి వస్తుందని డీలర్లు వాపోతున్నారు.

**పలు ఆరోపణలు**

ప్రభుత్వ గోదాముల్లో పనిచేస్తున్న కొందరు కుమ్మక్కై మోసాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడి నుంచి ఎంఎల్ఎస్(మండల లెవల్ స్టాక్ పాయింట్)లకు, అక్కడి నుంచి డీలర్లకు బియ్యం సరఫరా చేస్తున్నారు. కార్డుదారుడికి విడిగా తూకం వేసి ఇచ్చే సమయంలో ప్రతి బస్తాకు కిలో కచ్చితంగా తరుగు వస్తుంది. దీనిపై అధికారులు ఫిర్యాదు చేసినా తరువాత నెల సరఫరా చేస్తామని చెబుతున్నారే తప్ప ఇవ్వడం లేదని వాపోతున్నారు.

కోనసీమ జిల్లాలో ఇదీ లెక్క

రేషన్ దుకాణాలు : 926

కార్డుదారులు : 5,37,902

ప్రతినెలా పంపిణీ చేస్తున్న బియ్యం : 7 వేల మెట్రిక్ టన్నులు

ఎంఎల్ఎస్‌పీలు : 6

గోదాముల సంఖ్య : 9

తూకం వేసే ఇస్తున్నాం..: శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ ప్రతినెలా మండల స్థాయి స్టాక్ పాయింట్ల వద్ద పూర్తిస్థాయిలో తూకం వేసిన తరువాతే బియ్యం సరఫరా చేస్తున్నాం. కొత్తగా 3.5 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న కంప్యూటర్ ఆధారిత బరువు యంత్రాన్ని ఏర్పాటు చేశాం. డీలర్‌కు అవసరమైన మొత్తం స్టాకు ఒకేసారి తూకం వేస్తున్నాం. దీంతో తరుగుకు అవకాశం ఉండదు.

## నాడు నిర్లక్ష్యపు నీడ.. నేడు ప్రగతి జాడ

విజయనగరం: పగిలిన గోడలు.. పెచ్చులూడుతున్న పైకప్పులు.. వర్షాకాలంలో లీకేజీలు.. నిర్వహణ లేని మరుగుదొడ్లు.. ఇదీ గత అయిదేళ్లుగా సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాల దుస్థితి. వీటి నిర్వహణకు గత ప్రభుత్వం నిధులివ్వలేదు. శిథిల భవనాల్లో చదివేందు కు విద్యార్థులు నిత్యం భయపడేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలోని 30 సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో 23 భవనాల మరమ్మతులకు రూ.4.67 కోట్లు మంజూరు కావడంతో మరమ్మతులు చేపడుతున్నారు.

**పురోగతిలో పనులు**

విజయనగరంలోని బాలుర కళాశాల వసతి గృహ ప్రధాన భవనం శిథిలావస్థకు చేరింది. పాత స్లాబు తొలగించి, కొత్త కిటికీలు, బోరు, తలుపులు, కిటికీల మరమ్మతులు, సెప్టిక్ ట్యాంకు, విద్యుత్తు తీగల మరమ్మతులకు రూ.27.30 లక్షలు విడుదల చేశారు. కలెక్టర్ రూ.75 వేలు అదనంగా మంజూరు చేశారు. 90 శాతం పని పూర్తయింది. విజయనగరంలోని కళాశాల బాలికల వసతి గృహం-3 మరమ్మతులకు రూ.23.10 లక్షలు, బాలిక వసతి గృహం-2కు రూ.22.30 లక్షలు మంజూరు చేశారు.



రామతీర్థం(బాలుర) హాస్టల్‌కు రూ.16.85 లక్షలు, గంట్యాడ(బాలుర)కు రూ.26.40 లక్షలు ఇచ్చారు.

గర్భాం బాలుర వసతి గృహం పనులు రూ.16.15 లక్షలతో పూర్తి చేశారు. గజపతినగరం బాలికల హాస్టల్ రూ.21.20 లక్షలతో, బొండపల్లిలో (బాలికలు)రూ.15.75 లక్షలతో, చీపురుపల్లి(బాలుర)లో రూ.18.25 లక్షలతో 80 శాతం పూర్తయ్యాయి. లోగిస ఐడబ్ల్యూహెచ్‌సీ వసతి గృహం పనులు రూ.20.35 లక్షలతో చేస్తున్నారు.

కొత్తవలసలో(బాలికలు) రూ.20.20 లక్షలు, (బాలుర) రూ.22.50 లక్షలు మంజూరు చేశారు. ఎల్.కోట (బాలుర)లో రూ.18.50 లక్షలతో, వియ్యంపేట(బాలుర)లో రూ.18.10 లక్షలతో పూర్తి చేశారు. సంతకవిటి మండలం గుళ్ల సీతారామపురం (బాలుర)లో రూ.12.45 లక్షలతో, బొబ్బిలి (బాలుర)లో రూ.18.65 లక్షలు, (బాలికల)రూ. 14.65 లక్షలు, రామభద్రపురం ( బాలుర) రూ.18.15 లక్షలు, పెరుమాళి(బాలుర)కి రూ.22.65 లక్షలు మంజూరయ్యాయి.

నెలాఖరులోగా పూర్తి చేయిస్తాం..: అన్నపూర్ణ, డీడీ, సాంఘిక సంక్షేమ శాఖ తెర్లాం బాలుర వసతి గృహం మరమ్మతులకు రూ.24.15 లక్షలు మంజూరయ్యాయి. శిథిలావస్థలో ఉండటంతో పనులు చేసినా లాభం లేదని నిలిపివేశాం. రాజాం (బాలుర)కు రూ.38.80 లక్షలు, (బాలికల) రూ.17.35 లక్షలు, బాడంగి(బాలుర)కు రూ.22.15 లక్షలు మంజూరైనా పనులు ప్రారంభించలేదు. ఈ నెలాఖరులోగా పూర్తి చేయిస్తాం.

## అద్దె కొంపే దిక్కు!

విజయనగరం: విజయనగరం జిల్లా కేంద్రంలో పలు విభాగాలకు చెందిన కార్యాలయాలు అద్దె గదుల్లో కొనసాగుతున్నాయి. ప్రధాన శాఖల్లో సైతం ఇదే పరిస్థితి. క్షేత్రస్థాయిలో ప్రభుత్వానికి చెందిన పక్కా భవనాలున్నా.. నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. చిన్నపాటి మరమ్మతులు చేసి వాటిని ఉపయోగించేందుకు వీలున్నా ఆ దిశగా చర్యల్లేవు. మరోవైపు చెల్లింపుల్లో వ్యత్యాసాలున్నాయనే ఆరోపణలున్నాయి.

**కేటాయించినా..**

నిరుద్యోగులకు అండగా ఉండే ఉపాధి కార్యాలయం తోటపాలెంలో ఉంది. 15 ఏళ్లుగా అద్దె చెల్లిస్తున్నారు. ఏటా రూ.1.90 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో దీనిని మోడల్ కెరీర్ కేంద్రంగా మార్చారు. ఈమేరకు కొత్త భవనం సమకూర్చుకునేందుకు అప్పట్లో రూ.28 లక్షల వరకు కేటాయించింది. తొలుత కలెక్టరేట్‌లో ఇవ్వాలని భావించారు. అనంతరం పట్టించుకోకపోవడంతో పాత ప్రదేశంలోనే కొనసాగుతోంది.

ప్రధాన కార్యాలయమైనా.. రెండు జిల్లాల్లో 13 సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలున్నాయి. వీటిని పర్యవేక్షించే సమన్వయాధికారిణి కార్యాలయం కొన్నేళ్లుగా ఆర్అండ్‌బీ సమీపంలోని భవనంలో అద్దెకు నడుస్తోంది. ఈమేరకు నెలకు రూ.13 వేల వరకు చెల్లిస్తున్నారు. ఇతర ఖర్చులు అదనం. కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ విభాగ కేంద్రాలదీ ఇదే పరిస్థితి.

**ఏళ్ల తరబడి అక్కడే..**

కార్మికశాఖ కార్యాలయం విజయనగరం కొత్తపేట రోడ్డులో కొన్నేళ్లుగా కొనసాగుతోంది. నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు అద్దె చెల్లిస్తున్నారు. ఏడాదికి రూ.2 లక్షలకు పైగానే వెచ్చిస్తున్నారు. ఇక్కడ డిప్యూటీ కమిషనర్, సహాయ డిప్యూటీ కమిషనర్, మరో అయిదుగురు సిబ్బంది ఉంటారు. మండల కేంద్రాల్లోని కొన్ని శాఖలు సైతం అద్దె కొంపల్లోనే మూలుగుతున్నాయి. ఉన్నతాధికారులకు లేఖలు రాసినా స్పందన లేదని జిల్లా అధికారులు చెబుతున్నారు.

**మరమ్మతుల్లేక..**

నగరంలోని మర్రిచెన్నారెడ్డి భవనంలో పలు గదులు నిరుపయోగంగా ఉన్నాయి. ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలోని అంబేద్కర్ సామాజిక భవనం, రెడ్‌క్రాస్, సైనిక సంక్షేమ, కలెక్టరేట్ ఆవరణలో మరికొన్ని ఖాళీగా ఉన్నాయి. వీటిని కేటాయిస్తే పెద్దఎత్తున నిధులు మిగులుతాయి.

## మార్కెట్లో జాడలేని అభివృద్ధి

పార్వతీపురం : పార్వతీపురం శివారు రాయగడ రోడ్డులోని మార్కెట్ కమిటీ కార్యాలయం శిథిలస్థితికి చేరింది. ఏళ్ల నాటి భవనం కావడంతో పెచ్చులూడుతోంది. గోడలు బీటలు వారాయి. వర్షాలు పడితే లోపలి గదుల్లో నీరు చేరుతోంది. కొత్త భవనం నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో రూ.50 లక్షలు మంజూరయ్యాయి. 2022 జూన్‌లో శంకుస్థాపన చేశారు. అక్కడున్న పాత షెడ్లను తొలగించారు. యంత్రాలతో చదును చేసి, శిలాఫలకం వేశారు. అక్కడితో వదిలేశారు.

**రెండు సార్లు పిలిచినా..**మార్కెట్ కమిటీ ఆర్థికంగా ముందడుగు వేసేలా షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణానికి పాలక వర్గం గతంలో తీర్మానం చేసింది. అందుకు సంబంధించిన నిర్మాణాల కోసం రూ.90 లక్షలు మంజూరు చేశారు. వైకాపా హయాంలో రెండు సార్లు టెండర్లు పిలిచినా గుత్తేదారులు ముందుకు రాలేదు. దీంతో కమిటీ ఆదాయం తగ్గిపోతోంది. ఆవరణలోని వేబ్రిడ్జి పాడై ఏళ్లు గడుస్తున్నా కనీసం మరమ్మతులకు నోచుకోవడం లేదు. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో పెట్రోలు బంకు ఏర్పాటు కోసం చేసిన తీర్మానం కాగితాలకే పరిమితమైంది.

**ప్రతిపాదనలతో సరి..**

పార్వతీపురం, కురుపాం, పాలకొండ, సాలూరు ప్రాంతాల్లోని కమిటీలకు మార్కెట్ ఫీజు రూపంలో రూ.కోట్లలో ఆదాయం సమకూరుతోంది. ప్రతిగా రైతులకు మెరుగైన సేవలు అందించాలి. సంతల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించాలి. రైతుల పొలాల నుంచి కల్లాలు, ఇతర ప్రాంతాలకు పంట ఉత్పత్తులను తరలించేందుకు రోడ్లు నిర్మించాలి. గత ప్రభుత్వ హయాంలో ఇవన్నీ మాటలకే పరిమితమయ్యాయి. ఆర్థికంగా ఆదుకోవడం సైతం గగనంగా మారింది.

గుత్తేదారులను పిలుస్తాం....గతంలో టెండరు పాడిన గుత్తేదారు పనులు చేసేందుకు ముందుకు రాలేదు. అంచనా విలువలు మారే అవకాశం ఉంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే ఏఏ నిర్మాణాలు చేపట్టాలో అంచనాలు పంపిస్తాం.

# తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు బ్రేకులు



తిరుపతి : ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవానంతరం తల్లీబిడ్డను సురక్షితంగా ఇంటికి తీసుకెళ్లాల్సిన తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఆదరణ కోల్పోయింది. గుత్తేదారులు పట్టించుకోకపోవడం.. వాహనాలు మరమ్మతుకు గురికావడం.. తక్కువ జీతాలకు చోదకులు ముందుకు రాకపోవడంతో ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి వెళ్లే తల్లీబిడ్డలు సొంత వాహనాలపై ఆధారపడాల్సి వస్తోంది. కొన్నేళ్లుగా అరవిందో సంస్థ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ను నిర్వహిస్తోంది. ఆస్పత్రి నుంచి తల్లీబిడ్డను ఇంటి వద్ద వదిలిపెడితే రూ.859 చొప్పున గుత్తేదారు సంస్థకు ప్రభుత్వం అందిస్తోంది. గత ప్రభుత్వం ఐదేళ్లలో కొన్ని కొత్త వాహనాలను ప్రవేశపెట్టినా సరైన నిర్వహణ లేక మరమ్మతుకు గురయ్యాయి. కొన్నింటికి రోజువారీ మరమ్మతులు చేస్తేగాని కదలని దుస్థితి.

**నాలుగు నెలలుగా జీతాలందక**

తల్లీబిడ్డ వాహనాలను నడిపేందుకు చోదకులు ఎవరూ ముందుకు రావడం లేదు. నిర్వహణ సంస్థ నెలకు రూ.7,870 వేతనం చెల్లిస్తోంది. వాటికి సక్రమంగా జమచేయకపోవడంతో ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం నాలుగు నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉండటం తోడు ఉన్నవారిపై పనిభారం పెరిగింది.

**ఒకే వాహనంలో ఇద్దరేసి రోగుల తరలింపు**

తల్లీబిడ్డతోపాటు ఒక సహాయకురాలిని వాహనంలో తీసుకెళ్లాలి. కానీ ఒకే మార్గంలో ఇద్దరు రోగులు ఉంటే వారితోపాటు బిడ్డలు, సహాయకులను తరలిస్తున్నారు. చిన్నపాటి వ్యానులో ఆరేడుగురిని తరలించడం సురక్షితం కాదు. అయినా ఒకేసారి ఇద్దరిని తరలించి రెండు బిల్లులు ప్రభుత్వం నుంచి కాజేస్తున్నారు. రోగుల నుంచి చోదకులు అనధికార వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

**మధ్యాహ్నంపైనే ఇంటికి**రోజువారీ 50–70 డిశ్చార్జులు జరుగుతుంటే.. అందరినీ మధ్యాహ్నం ఒంటి గంటపైనే బయటకు పంపుతున్నారు. ఆ సమయంలో అందరూ ఇళ్లకు పోయేందుకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు లేక అవస్థలు పడుతూ.. ప్రైవేటు వాహనాలపై దృష్టి సారిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు.**రెండు జిల్లాల్లో సేవలు ఇలా..**

మొత్తం వాహనాలు : 45 మూలనపడినవి : 13

–చోదకులు తిరుపతి 31 మందికిగాను 16 మంది

–చిత్తూరు జిల్లాలో 19 మందికి 14 మందే ఉన్నారు.

# అంతస్తులు తగ్గించి.. ఆదాయానికి గండి!

అనంతపురం : వైకాపా హయాంలో పుర అధికారులు ఆ పార్టీ నాయకుల కనుసన్నల్లో పనిచేశారు. నేతలు, వారి బంధువులకు చెందిన భవనాలకు ఆస్తి పన్ను నుంచి మినహాయింపు కల్పించారు. భవన నిర్మాణాలు పూర్తయినా అసెస్‌మెంట్ నంబర్లు కేటాయించకుండా వదిలేశారు. మరికొందరి భవనాలకు సంబంధించి విస్తీర్ణం, అంతస్తులు తగ్గించి ఖజానాకు నష్టం చేకూర్చారు. ఉమ్మడి అనంత జిల్లాలోని 12 పురపాలికల పరిధిలో 1,736 నిర్మాణాలకు పన్ను నుంచి మినహా



యింపు ఇచ్చారు. ఇటీవల నిర్వహించిన సర్వేలో నిర్మాణాలు పూర్తయి ఆస్తి పన్ను కిందకు రాని భవనాలను అధికారులు గుర్తించారు. ఇందులో సగానికి పైగా భవనాలకు వైకాపా ప్రజాప్రతినిధుల ఒత్తిడి మేరకే ఆస్తి పన్ను విధించకుండా వదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**రూ.2.23 కోట్ల నష్టం**

భవన విస్తీర్ణం, అంతస్తులను తక్కువ చేసి చూపించి పన్ను విధించారు. దీంతోపాటు వందలాది వాణిజ్య భవనాలను నివాసాలుగా చూపి ఖజానాకు గండి కొట్టారు. ఉమ్మడి జిల్లాలో అన్ని మున్సిపాలిటీల పరిధిలో 4,656 నిర్మాణాలకు విధించాల్సిన మొత్తం కంటే తక్కువ పన్ను వసూలు చేశారు. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు రూ.2.23 కోట్లు నష్టం వాటిల్లినట్లు సర్వేలో తేల్చారు.

**పన్నే లేకుండా..**

అనంతపురం కార్పొరేషన్ పరిధిలో 221 భవనాలకు ఆస్తి పన్ను విధించకుండా వదిలేశారు. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా ధర్మవరం మున్సిపాలిటీలో 293 నిర్మాణాలకు పన్ను వేయలేదు. తాజాగా ఆయా భవనాలన్నింటికీ అసెస్‌మెంట్ నంబర్లు కేటాయించి వసూలు చేస్తున్నారు. 1,736 భవనాలకు కొత్తగా పన్ను విధించడం ద్వారా రూ.71.47 లక్షలు అదనపు ఆదాయం వస్తుందని అంచనా వేశారు.

# కాళంగి ఉద్ధృతికి.. కట్టడేదీ?


సూళ్లూరుపేట: జిల్లాలో కీలకమైన నదుల్లో ఒకటైన కాళంగి తరచూ ఉగ్రరూపం దాల్చుతోంది. నదికి పలుచోట్ల గండ్లు పడగా శాశ్వత పనులు కరవయ్యాయి. తాత్కాలికంగా వేసిన ఇసుక బస్తాలు కోతకు గురవడంతో ప్రజల నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది.కాళంగి పొర్లుకట్టలకు శాశ్వత మరమ్మతులు చేయాలని ప్రభుత్వం 2008లో రూ.58.47 కోట్లు మంజూరు చేయగా భూసేకరణ సమస్యలతో పనుల్లో జాప్యం జరిగింది. గుత్తేదారులు కొంతమేర పనులు చేసి వదిలేశారు. ఇప్పటికీ పూర్తికాక వర్షాకాలంలో వరద ప్రవాహం సూళ్లూరుపేట పట్టణంతోపాటు పరిసర గ్రామాలను ముంచెత్తుతోంది. సూళ్లూరుపేట ఎగువన నదిలో కలిసే నెర్రికాలువకు సైతం తరచూ గండ్లు పడుతున్నాయి. దీనికి కాంక్రీట్ లైనింగ్ కోసం గత వైకాపా ప్రభుత్వంలో నిధులు మంజూరు చేసినా సకాలంలో చెల్లింపులు లేక గుత్తేదారులు చేతులెత్తేశారు. 2024 నవంబరు, డిసెంబరులో కురిసిన వర్షాలకు సూళ్లూరుపేటలోని లూథరన్ చర్చి వెనుక కాళంగి పొర్లుకట్టకు సుమారు 30 మీటర్ల మేర భారీ గండి పడింది. అప్పట్లో ఇసుక బస్తాలు వేసి తాత్కాలిక మరమ్మతులు చేసినా మళ్లీ కోతకు గురైంది. ప్రస్తుతం భారీ గండిపడి సూళ్లూరుపేటలోని మురుగునీరంతా నదిలో చేరుతోంది.

**నిధులకు ప్రతిపాదనలు**

సూళ్లూరుపేటలో చర్చి వెనుక పడిన గండిని పూడ్చి రివెట్‌మెంటుతోపాటు నెర్రికాలువకు తూర్పు వైపున 30 మీటర్ల మేర కాంక్రీటు గోడ నిర్మించేందుకు జలవనరుల శాఖ ఇంజినీర్లు రూ.39 లక్షలతో ప్రతిపాదనలు పంపారు. నేటికీ ఆ నిధులు మంజూరు కాలేదు. ఈశాన్య వర్షాలు ప్రారంభంకాక మునుపే నిధులు మంజూరు చేసి పనులు చేయాల్సిన అవసరముంది. గండ్లకు సంబంధించిన డీపీఆర్‌లు ప్రభుత్వానికి పంపామని, నిధులు వచ్చిన వెంటనే పనులు చేస్తామని డీఈఈ కస్తూరయ్య తెలిపారు.

# డిజిటల్ చెల్లింపులు.. సేవల్లో వేగం

చిత్తూరు : మారుతున్న పరిస్థితులకు తగ్గట్లుగా వినియోగదారుల అవసరాలు తీర్చేలా తపాలా శాఖ నూతన హంగులు అద్దుకుంటోంది. అధునాతన సాంకేతికత 2.0 సేవల్ని అమలు చేసింది. ఇందులో భాగంగా ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు చిత్తూరు డివిజన్ పరిధిలోని 427 తపాలా కార్యాలయాల్లో నవీకరణ పూర్తిచేశారు.



పొదుపు, బీమా సేవలు వేగవంతం, నూతన సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చారు. గ్రామాల్లోని తపాలా కార్యాలయాల నుంచి సులభంగా డిజిటల్ చెల్లింపులు జరిపేలా సంస్కరణలు తీసుకొచ్చారు. దీని కోసం 'డాక్ పే' యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. క్యూఆర్ కోడ్‌తోపాటు యూపీఐ ఆధారిత చెల్లింపులకు దీనిని వినియోగించవచ్చు. ఇంటి నుంచే రిజిస్టర్, స్పీడ్ పోస్టు, వివిధ రకాల పార్సిళ్లు బుక్ చేసుకోవచ్చు. పోస్ట్‌మెన్ ద్వారా పంపే వెసులుబాటు ఉంటుంది. దీనికి సేవా రుసుం ఉండదు. రూ.500కు పైగా విలువ ఉన్నవాటికి నిర్దేశిత రుసుములు చెల్లించాల్సి ఉంటుంది. ఇంటిగ్రేటెడ్ మొబైల్ సేవలు యాప్ ద్వారా నామమాత్రపు చెల్లింపులతో పొందవచ్చు. ఓటీపీ ద్వారా బట్వాడా, సాధారణ ఉత్తరాలకు ట్రాకింగ్ సదుపాయం కల్పిస్తున్నారు. లోపాలపై డాక్ సేవ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఎలక్ట్రానిక్ మనీ ఆర్డర్ సేవలు పొందవచ్చు.

# అధికారం అండగా.. తవ్వకాలు దండిగా



అనకాపల్లి : ఎక్కడైనా అన్నిపార్టీల నేతలు ఒక్క తాటిపైకి రావడమంటే కాస్తంత అరుదే. అది ప్రజా సమస్యల పరిష్కారం కోసమైతే బాగుండేది. కానీ అందరూ ఒక్కటైంది.. ప్రభుత్వ భూములు, చెరువులు, కొండవాలు ప్రాంతాల్లో అక్రమంగా తవ్వకాలు చేసి సొమ్ము చేసుకునేందుకు. 'మీరు తవ్వుకోండి. ఏం జరిగినా మేముంటాం.. మాకు వాటాలివ్వండి' అంటూ అక్రమాలకు పాల్పడుతున్న వైకాపా నేతలకు అధికార పార్టీ నేతలే అండదండలందిస్తున్నారు.

సబ్బవరం పరిసర ప్రాంతాల్లో స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతోంది. విశాఖ నగరానికి చేరువలో ఉండటంతో లేఅవుట్లు అధికంగా వెలుస్తున్నాయి. ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో ఈ పనులకు మట్టి, గ్రావెల్ అవసరం తీవ్రంగా ఉంది. దీన్ని అవకాశంగా చేసుకుని.. వైకాపా నేతలు గత ప్రభుత్వంలోనే ఓ ముఠాగా ఏర్పడి అక్రమాలు మొదలెట్టారు. ఇంటి పునాదుల పేరు చెప్పి చెరువులు, కొండవాలు ప్రాంతాలు.. ఇలా ఎక్కడపడితే అక్కడ తవ్వేయడం మొదలుపెట్టారు. ప్రభుత్వం మారింది కానీ వీరు తీరు మారలేదు. అధికార పార్టీకి చెందిన కొంతమంది నేతలు వీరికి తెరవెనుక నుంచి మద్దతు ఇస్తున్నారు. రెవెన్యూ అధికారుల చేతులు తడుపుతుండటంతో వీరి ఆగడాలను ప్రశ్నించేవారే లేకుండాపోయారు. కొన్ని రోజుల క్రితం మండల ప్రజలు పెందుర్తి ఎమ్మెల్యే రమేష్‌బాబు దగ్గరకు వెళ్లి ప్రకృతి వనరులను మూకుమ్మడిగా ధ్వంసం చేస్తున్నారంటూ మొరపెట్టుకున్నారు. అయినా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఏమీ మారలేదు.

**సహజ వనరులు ధ్వంసం**

సబ్బవరంలోని బాటజంగాలపాలెంలో చిక్కాలవానిచెరువు 60 ఎకరాల్లో విస్తరించి ఉంది. కొన్ని రోజులుగా 50కి పైగా టిప్పర్లు చెరువు మట్టిని స్థానికంగా వెలిసిన లేఅవుట్లకు తరలించేస్తున్నారు. ఒక్కో టిప్పర్‌కు రూ. 8 వేల నుంచి రూ. 10 వేల వరకు వసూలు చేస్తున్నారు. దీంతోపాటు.. అసకపల్లి, గంగవరం, బాటజంగాలపాలెం, ఒమ్మివానిపాలెం, గాలిభీమవరం, అంతకాపల్లి, రాయపుర అగ్రహారం, గొల్లలపాలెం తదితర గ్రామాల్లో మట్టి, గ్రావెల్ తవ్వకాల రవాణా పెద్ద వ్యాపారంగా మారింది. ఆయా ప్రాంతాలకు సమీపంలోని ప్రభుత్వ భూములు, కొండవాలు ప్రాంతాలు, పేదల ఇళ్ల కాలనీలకు సమీపంలో రాత్రి వేళల్లో భారీ యంత్రాలతో తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గంగవరం కొండవాలు ప్రదేశంలోని పేదల ఇళ్లకు ఆనుకుని ఉన్న కొండవాలు ప్రాంతంలో భారీగా తవ్వకాలు చేస్తున్నారు. ఒమ్మివానిపాలెం సమీపంలోని నల్లకొండ వద్ద కొద్ది రోజులుగా తవ్వకాలు జరుపుతున్నారు. అక్కడ నుంచి గ్రావెల్‌ను సమీపంలోని ప్రైవేటు వెంచర్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

**ప్రభుత్వ స్థలంలో తవ్వితే కఠిన చర్యలు**

– శ్రీనివాస్, ఏడీ, మైనింగ్, అనకాపల్లి ప్రభుత్వ స్థలాలు, కొండవాలుల్లో మట్టి తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదు. కొన్ని ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలను గుర్తించాం. రెవెన్యూ సిబ్బందిని పంపించి తరచూ తనిఖీలు చేయిస్తున్నాం. రాత్రివేళల్లో నిఘా పెడుతున్నాం. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ స్థలాల్లో తవ్వకాలు చేపడితే వాహనాలను సీజ్ చేయడంతోపాటు అపరాధ రుసుం విధిస్తాం.

# భూసేకరణ పేరుతో దోచిపెట్టారు



విశాఖపట్నం: 'అన్ని వ్యవస్థల్లాగే గృహ నిర్మాణం (పేదల ఇళ్లు)ను ఆదాయ వ్యవస్థలా గత వైకాపా ప్రభుత్వం చూసింది. లబ్ధిదారుల గురించి ఏమాత్రం ఆలోచించలేదు. భూసేకరణ పేరుతో వైకాపా నేతలకు దోచిపెట్టారు' అని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. భీమిలి నియోజకవర్గంలోని తంగుడుబిల్లిలో 690 ఎకరాల్లో చేపట్టిన 'మెగా హౌసింగ్ ప్రాజెక్టు'లో ఇళ్లను ఆయన పరిశీలించారు. అక్కడ మీడియాతో మాట్లాడుతూ 'ఒక మంచి ప్రదేశం, వాతావరణంలో మున్సిపాల్టీకి సరిపడా ప్రజలు నివాసం ఉండాల్సిన తంగుడుబిల్లి టౌన్‌షిప్‌లో కనీస మౌలిక సౌకర్యాలు కల్పించకుండా వైకాపా పాలకులు పూర్తిగా గాలికొదిలేశారు. భీమిలి పరిధిలో అర్హులున్నప్పటికీ, ఎక్కడో 30 కి.మీ. దూరంలో ఉన్న గాజువాక, నగర పరిధిలో ఉంటున్నవారికి ఇక్కడ ఇళ్లు కేటాయించడం విచిత్రంగా ఉంది. నాలుగేళ్ల క్రితం ప్రాజెక్టు ప్రారంభమైతే 16,996 ఇళ్లకు ఇప్పటికి కేవలం 2,036 పూర్తయ్యాయి'అని పేర్కొన్నారు.**గుత్తేదారు గైర్హాజరుపై ఆగ్రహం:** 'పేదలందరికీ ఇళ్లు' అనేది తెదేపా సంకల్పమని, కూటమి ప్రభుత్వం గృహ నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని గంటా అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు చొప్పున పేదలకు స్థలాలు ఇవ్వనున్నామని తెలిపారు. తంగుడుబిల్లి పర్యటనలో గుత్తేదారు గైర్హాజరుపై గంటా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్లు పూర్తయిన జాబితా తీసుకుని ముగ్గురు లబ్ధిదారులతో ఎమ్మెల్యే ఫోన్‌లో స్వయంగా మట్లాడారు. 'మౌలిక సదుపాయాలు కల్పిస్తే వచ్చి ఇక్కడ ఉంటారా? నిర్మాణ పనులు నాణ్యతగా జరుగుతున్నాయా.. లేదా అని చూసుకున్నారా?' అని అడిగి తెలుసుకున్నారు. అక్కడ నుంచే జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌తో మాట్లాడారు. వీఎంఆర్డీఏ, జీవీఎంసీ, ఈపీడీసీఎల్, హౌసింగ్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి యుద్ధప్రాతిపదికన మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు, ప్రణాళికలపై చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ సత్తిబాబు, ఏఈ శ్యామ్, ఎమ్మార్వో శ్రీనుబాబు తెదేపా నాయకులు ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, అప్పారావు, బీఆర్‌బీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ సందిగ్ధంలో పీజీ హోమియో విద్య

రాజమహేంద్రవరం : కేంద్ర ప్రభుత్వం ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలోని హోమియో వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తుంటే క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉంటున్నాయి. రాష్ట్రంలో హోమియో ప్రభుత్వ వైద్య కళాశాలలు మూడే ఉంటే.. అందులో రాజమహేంద్రవరంలోని డాక్టర్ అల్లు రామలింగయ్య ప్రభుత్వ హోమియోపతి కళాశాల ప్రధానమైంది. ఇక్కడ 60కి పైగా యూజీ, 23 పీజీ చదువుతున్న వైద్య విద్యార్థులు ఉన్నారు. ఆచార్యుల కొరతతో 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి పీజీ సీట్లను మంజూరు చేయడానికి జాతీయ హోమియోపతి మండలి(నేషనల్ కౌన్సిల్ ఆఫ్ హోమియోపతి) అనుమతులు నిరాకరించింది. ఎన్‌సీహెచ్ నిబంధనల ప్రకారం ప్రతి ప్రొఫెసర్ ముగ్గురు పీజీ విద్యార్థులకు మాత్రమే మార్గదర్శకం(గైడ్) చేయాల్సి ఉంది. ఇక్కడ సరిపడా ప్రొఫెసర్లు లేకపోవడంతో పీజీ విద్యకు తాత్కాలికంగా అనుమతులు నిలిపివేసింది. 2016లో అప్పటి తెదేపా ప్రభుత్వ కృషితో పీజీ వైద్య విద్యలో మూడు విభాగాలకు అనుమతులొచ్చాయి. గతేడాది ప్రొఫెసర్ల కొరత కారణంగా పీజీ సీట్లు నిలిపివేస్తామని ఎన్‌సీహెచ్ హెచ్చరించింది. ఎంపీ, ఎమ్మెల్యే స్పందించి దిల్లీ వెళ్లి ఉన్నతాధికారులతో చర్చించారు. అనంతరం



సీట్లు యథావిధిగా మంజూరయ్యాయి.

కళాశాలలో మొత్తం 12 విభాగాలున్నాయి. ఒక్కోదానికీ ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉండాల్సి ఉంది. ప్రస్తుతం ప్రొఫెసర్ల విభాగంలో మొత్తం అయిదుగురే సేవలందిస్తున్నారు.

**త్వరలోనే కౌన్సెలింగ్**

కొన్నేళ్లుగా ఇదే ప్రొఫెసర్ల సంఖ్యతో కళాశాలలో బోధన సాగినా జాతీయ హోమియోపతి మండలి పరిశీలనకు వచ్చినప్పుడు అతిథి ఆచార్యులను నియమించి, అనుమతులు కాపాడుకునేవారు. మళ్లీ ఆ దిశగా ప్రయత్నాలు చేయాల్సి ఉంది. త్వరలోనే హోమియో పీజీకి కౌన్సెలింగ్ నిర్వహించనున్న నేపథ్యంలో కళాశాలలో పీజీ విద్యకు అనుమతులొచ్చేలా ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలి.

# రేషన్ దందా.. కళ్లెం ఉందా?

కాకినాడ : ప్రభుత్వం మారినా.. సరకుల పంపిణీలో పద్ధతి మార్చినా రేషన్ మాఫియాకు కళ్లెం పడడం లేదు..వైకాపా సర్కారులో చక్రం తిప్పినవారు ఇప్పుడూ హవా కొనసాగిస్తున్నారు. నియోజకవర్గాల వారీ ముఠాలు ఏర్పాటుచేసుకుని దందాలు నడుపుతున్నారు. గతేడాది డిసెంబర్ నుంచి ఇప్పటివరకు కాకినాడ జిల్లాలో 6ఏ కేసులు 83 నమోదయ్యాయంటే వీరు ఏ స్థాయిలో అక్రమాలకు పాల్పడుతున్నారో అర్థమవుతోంది.

**ఎనిమిది నెలల్లో ఇదీ పరిస్థితి**

2024 డిసెంబరు నుంచి ఈ ఏడాది జులై 19 వరకు పట్టుబడిన బియ్యం నిల్వలు 47,148 టన్నులు. వాటి విలువ రూ.220 కోట్లు. ఈ ఏడాది జనవరి నుంచి పట్టుబడినవారిలో డీలర్లు 20 మంది ఉంటే, అక్రమంగా నిల్వ చేసినవారు 20, అక్రమ రవాణా చేస్తున్నవారు 12 మంది ఉన్నారు.

**ఇక్కడే ఎక్కువ..**కాకినాడ నగరం, గ్రామీణం, పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో పెద్దఎత్తున రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. కార్డుదారుల నుంచి కేజీ రూ.15 చొప్పున కొందరు డీలర్లు, హాకర్లు కొంటున్నారు. వీటిని మాఫియా కిలో రూ.18కు కొనుగోలు చేస్తోంది.



ఈ ముఠా కొందరు మిల్లర్లు, ఎగుమతిదారులు, ఇతర వ్యక్తులకు రూ.26 చొప్పున విక్రయిస్తోంది. ప్రస్తుతం కాకినాడ పోర్టులో పచ్చిబియ్యం ఎగుమతులు మందగించడంతో ఇతర ప్రాంతాల పోర్టులకు తరలిస్తున్నారు.

**ఈ నెలలో చిక్కారిలా..**

ఈనెల 3న కాకినాడ గ్రామీణ మండలంలో 1,100 కేజీల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. కొర్లపాటి సూర్యభరత్, పాకలపాటి వెంకటేశ్వరరావుపై 6ఏ, క్రిమినల్ కేసులు నమోదుచేశారు.

8న తూరంగిలోని ఓ గోదాములో రూ.5.27 లక్షల విలువైన 11 టన్నుల పేదల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. తలారి వీరబాబు అనే వ్యక్తిపై 6ఏతో పాటు క్రిమినల్ కేసు కట్టారు.

ఈనెల 13న పెద్దాపురం మండలం గోరింటలో రాచంశెట్టి స్వామి ఇంటి వద్ద నిల్వ చేసిన 4.76 టన్నుల సరకు లభ్యమైంది.

అరకొర సిబ్బందితో పర్యవేక్షణ ఎలా..

జిల్లాలో 21 మండలాలకు గాను 11 సీఎస్‌డీటీ పోస్టులున్నాయి. వీరిలో 9 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. వీరే ప్రతీనెలా రేషన్ పంపిణీ సక్రమంగా జరిగేలా..పక్కదారి పట్టకుండా పర్యవేక్షించాలి. ఇంత తక్కువ మందితో సాధ్యమా అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. జగ్గంపేట, గండేపల్లి మండలాల సీఎస్‌డీటీ విధుల్లో చేరలేదు. పిఠాపురం, గొల్లప్రోలు అధికారి పాడా కార్యాలయానికి డిప్యుటేషన్‌పై వెళ్లిపోయారు.

**పట్టుబడితే క్రిమినల్ కేసులు**

రేషన్ బియ్యం కొన్నా, విక్రయించినా, అక్రమంగా తరలించినా క్రిమినల్ కేసులు నమోదుచేస్తున్నాం. పలుమార్లు అక్రమ నిల్వాలు, తరలింపులో పట్టుబడినవారిపై మరిన్ని చర్యలకు సిద్ధమవుతున్నాం. ఎక్కడైనా ఇటువంటి నిల్వాలు ఉంటే సమాచారం అందించాలి.
ఆర్.సత్యనారాయణరాజు, జిల్లా పౌరసరఫరాల అధికారి, కాకినాడ

# అలా వదిలేశారు!

కోటవురట్ల : మహిళలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన ఫ్యాషన్ టెక్నాలజీ కేంద్రాలకు బూజుపడుతోంది. రూ. లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన కుట్టుమిషన్లు తుప్పుపట్టి పాడైపోతున్నాయి. జిల్లాలోని కోటవురట్ల, సబ్బవరం, చోడవరంలో ఒక్కోచోట రూ. కోటికిపైగా వెచ్చించి ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. రూ. 80 వేల నుంచి రూ. లక్ష పైగా ఖరీదుగల కుట్టుమిషన్‌ను సుమారు 100 వరకు ప్రతి కేంద్రంలో పెట్టారు. దీనిలో పని చేయడానికి ముందుగా చదువుకున్న యువతులతోపాటు ఆసక్తి కలిగిన మహిళలను గుర్తించి నెల రోజులపాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చేవారు. ఆ తరువాత వారి నైపుణ్యానికి తగ్గట్టుగా, ఫ్యాషన్ టెక్నాలజీ కేంద్రంలో ఉపాధి కల్పించేవారు. కోటవురట్ల మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలోని ఫ్యాషన్ టెక్నాలజీ కేంద్రంలో కోటవురట్ల, నర్సీపట్నం, ఎస్.రాయవరం, ఎలమంచిలి, నక్కపల్లి, పాయకరావుపేట, మాకవరపాలెం, నాతవరం మండలాల్లోని పలు గ్రామాలకు



చెందిన మహిళలు ఉపాధి పొందేవారు.

**అనుభవజ్ఞులకు లీజుకిచ్చినా..:** ప్రభుత్వం ఫ్యాషన్ టెక్నాలజీ కేంద్రాలను కొద్ది నెలలు నడిపి తరవాత టెక్స్‌టైల్ రంగంలో అనుభవం కలిగిన బెంగుళూరు, దిల్లీకు చెందిన వ్యక్తులకు ఈ కేంద్రాన్ని లీజుకు అప్పగించింది. వాళ్లు ఏడాది కాలం నడిపి, ఆశించిన రీతిలో లాభాలు రాకపోవడంతో అద్దె, విద్యుత్తు బిల్లు తగ్గిస్తే ఈ కేంద్రాన్ని నడుపుతామని.. లేకపోతే వదిలేస్తామని షరతులు పెట్టారు. అధికారులు అందుకు అంగీకరించలేదు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఫ్యాషన్ టెక్నాలజీ కేంద్రం నిరుపయోగంగానే ఉండిపోయింది. గోదాములో ఉన్న విలువైన కుట్టుమిషన్లు నిరుపయోగంగా మారి పాడయిపోతున్నాయి. కేంద్రం నడపకపోవడంతో ఈ మండలానికి చెందిన మహిళలు అచ్యుతాపురంలో ఉన్న దుస్తుల కంపెనీలకు వెళ్లిపోతున్నారు.

**ఉన్నతాధికారులకు చెబుతున్నాం:** కోటవురట్లతోపాటు చోడవరం, సబ్బవరంలో ఫ్యాషన్ టెక్నాలజీ కేంద్రాలూ మూసే ఉన్నాయి. టెక్స్‌టైల్ రంగంలో అనుభవం ఉన్న వ్యక్తులు ఎవరైనా ముందుకొస్తే వారికి లీజుకు అప్పగిస్తాం. ఎలమంచిలిలో కేంద్రం తెరిపించి, మహిళలకు ఉపాధి కల్పిస్తున్నాం. శచీదేవి, పీడీ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ

# ఐటీ రంగంలో మరో ముందడుగు

విశాఖపట్నం: గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఐటీ కంపెనీలు విశాఖను వదిలి వెళ్లిపోగా... కూటమి అధికారంలోకి వచ్చాక దిగ్గజ కంపెనీలు ఒక్కొక్కటిగా వెనక్కి వస్తున్నాయి.వైకాపా హయాంలో ఉత్తరాంధ్ర యువత ఉపాధి కోల్పోయి కొందరు చిన్నచిన్న పనులు చేసుకుంటుండగా.. ఇంకొందరు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధి అవకాశాలపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. దీనికి కారణం ఇప్పటికే టీసీఎస్ రూ.1370కోట్ల పెట్టుబడితో 12వేల మందికి ఉపాధి కల్పించేలా విశాఖలో కార్యాలయం స్థాపనకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ కంపెనీకి ఐటీ హిల్స్-3లో 22 ఎకరాలు కేటాయింపు సైతం చేశారు.

'మా ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచించేలా విశాఖలో క్యాంపస్ ప్రారంభిస్తున్నాం. మద్దతిచ్చిన ఏపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు. సాంకేతికంగా అత్యున్నత ప్రతిభావంతులతోపాటు, విస్తృతస్థాయి మౌలిక సదుపాయాలతో రేపటి డిజిటల్ వర్క్ ఫోర్స్‌ను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో టైర్-2 నగరాల్లో బలమైన విశాఖను ఎంచుకున్నాం. ఈ పెట్టుబడి ద్వారా ప్రభావవంతమైన కెరీర్ అవకాశాలు సృష్టించాలని, ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడాలని ఎదురుచూస్తున్నాం' అంటూ కాగ్నిజెంట్ సంస్థ సీఈవో రవి కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు.

**8 వేల మందికి ఉపాధి:** కాగ్నిజెంట్ సంస్థకు కాపులుప్పాడలో 22 ఎకరాలు వీఎంఆర్డీఏ స్థలం కేటాయించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు



నాయుడు ఆధ్వర్యంలో మంత్రి వర్గ ఆమోదం తెలిపింది. రూ.1583 కోట్ల పెట్టుబడులతో 8 వేల మందికి ఉపాధి కల్పించనుంది. మూడు దశల్లో క్యాంపస్ విస్తరించేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. తొలుత వచ్చే ఏడాది 800 మంది అసోసియేట్ సీటింగ్ సామర్థ్యంతో తాత్కాలిక కార్యాలయం ప్రారంభించనున్నారు. 2029లో మొదటి దశ క్యాంపస్ పూర్తయ్యే వరకు ఈ తరహాలోనే ఇక్కడ కార్యకలాపాలు సాగనున్నాయి.

**ఎవరేమన్నారంటే:** 'ఏపీని ప్రపంచ అగ్రగామి సంస్థలకు గమ్యస్థానంగా తీర్చిదిద్దాలన్న మా లక్ష్యానికి అనుగుణంగా కాగ్నిజెంట్ విశాఖకు రావడం స్వాగతిస్తున్నాం. కాగ్నిజెంట్ ఇక్కడ క్యాంపస్ ఏర్పాటు చేయడం ద్వారా డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగవంత కావడంతోపాటు, భవిష్యత్ శ్రామికశక్తికి అవసరమైన నైపుణ్యాలను మెరుగు పరుస్తుంది' అని ఐటీ మంత్రి నారా లోకేశ్ ఇప్పటికే ఎక్స్‌లో పోస్టు చేశారు.

గూగుల్ విశాఖలోని మధురవాడ వద్ద 80 ఎకరాల్లో డేటా సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. తాజాగా ఐటీ దిగ్గజ సంస్థ కాగ్నిజెంట్ కూడా విశాఖలో మూడు దశల్లో క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు సంసిద్ధత తెలిపింది. 2024 నుంచి భువనేశ్వర్, ఇందౌర్‌లలో కొత్త డెలివరీ కేంద్రాలతో పాటు, గుజరాత్‌లోని గిఫ్ట్ నగరంలో ఒక టెక్‌ఫిన్ కేంద్రాన్ని కాగ్నిజెంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భారతదేశంలో 13 చోట్ల 3.36 లక్షల మంది ఉద్యోగులతో కాగ్నిజెంట్ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు గుర్తు చేశారు.

# కప్పిందెంత. కొట్టేసిందెంత?



అనకాపల్లి : వైకాపా ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల్లో మెరక పేరుతో ఆ పార్టీ నేతలు కొందరు మేసేశారు. కొండ దిగువన, లోతట్టు ప్రాంతాలు, ఊరికి దూరంగా స్థలాలు ఇవ్వడంతో వాటిని చదును చేసేపేరు చెప్పి రూ. కోట్లను వెనకేసుకున్నారు. కొన్నిచోట్ల అరకొర పనులు చేసి... మొత్తం చేసినట్లు రాసి బిల్లులు చేసుకున్నారు. వీటిపై ఇప్పటికే విజిలెన్స్ విచారణ సైతం చేపట్టింది. తాజాగా అనకాపల్లి జిల్లాలో 280కి పైగా లేఅవుట్లలో గ్రావెల్‌తో చేసిన పనుల్లో నాణ్యతను పరిశీలించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

**పది బృందాలతో విచారణ**

అనకాపల్లి జిల్లాలో మొత్తం 56 వేల మందికి 704 లేఅవుట్లలో పట్టాలు పంపిణీ చేశారు. ఇందులో 280కిపైగా లేఅవుట్లలో గ్రావెల్‌తో చదును పనులు చేశారు. ఇందుకు సుమారు రూ. 180 కోట్లకు పైగా ఖర్చు చేశారు. వాటిలో చాలావరకు గత ప్రభుత్వంలోనే బిల్లులు చేసుకున్నారు. ఇంకా కొంతమంది నేతలు తమకు బిల్లులు చేయాల్సి ఉందని అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికే చెల్లించిన సొమ్ము ఎక్కువగా ఉందని, అసలు క్షేత్రస్థాయిలో చేసిన పని, నాణ్యత చూసి నివేదిక ఇవ్వాలని గ్రామీణ నీటిసరఫరా, గృహనిర్మాణ సంస్థ, ఉపాధి హామీ విభాగాలకు ఆదేశాలందాయి. జిల్లాలో 10 బృందాలతో విచారణకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఆయా లేఅవుట్లకు వెళ్లి నిజంగా గ్రావెల్‌తో చదును చేశారా? ఎం-బుక్ రికార్డు మేరకు జరిగిందా? ఈ గ్రావెల్ ఎక్కడ నుంచి తెచ్చారు అనేది నిగ్గుతేల్చనున్నారు. నిబంధనల మేరకు బిల్లులు చెల్లించాల్సి ఉన్నా.. అవకతవకలు జరిగినట్లు గుర్తించినా తుది నివేదికను ప్రభుత్వానికి అందజేయాలి.

**అనుచరుల పేరుతో చదును:** అనకాపల్లి, మునగపాక, పాయకరావుపేట, ఎలమంచిలి, నర్సీపట్నం తదితర మండలాల్లో భారీగా లేఅవుట్లు వేశారు. భూముల కొనుగోలులో భారీగా అక్రమాలు జరిగాయి. అప్పటి ప్రజా ప్రతినిధులే తమ అనుచరుల పేరుతో చదును పనులు చేయించారు. గతంలో ఓసారి విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేయగా.. భారీగా అక్రమాలు చేసినట్లు తెలుస్తోంది. అయినా.. అధికారం అడ్డుపెట్టుకుని అప్పటి నేతలు బిల్లులు చేసుకున్నట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విజిలెన్స్‌తో తనిఖీలు చేపట్టినా.. వాటి నివేదిక ఇంకా బయటపెట్టలేదు. ఇప్పుడు మళ్లీ ప్రత్యేక బృందాలతో మళ్లీ తనిఖీలు చేపడుతున్నారు.

దీనిపై జిల్లా జల యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్ట్ డైరెక్టర్ పూర్ణిమాదేవి వద్ద ప్రస్తావించగా.. కొంత మంది బకాయిలు కోసం న్యాయస్థానానికి వెళ్లడంతో వాటిని చెల్లించడానికి ఓసారి తనిఖీలు చేయాలని ప్రభుత్వం సూచించింది. జిల్లా ఉన్నతాధికారుల సూచనలతో తనిఖీలు చేపడుతున్నామని చెప్పారు.

# సంద్రం లోతున.. వలకు చిక్కే 'ట్యూనా'...!



విశాఖ : విదేశీ మార్కెట్‌లో డిమాండ్... అధిక రాబడి... పోషక విలువలు మెండు... తదితర కారణాలతో 'ట్యూనా చేపల' వేటపై బోటు ఆపరేటర్లు దృష్టి సారిస్తున్నారు. విశాఖ చేపలరేవులో గతేడాదితో పోల్చితే ఈసారి 50 బోట్లు అదనంగా ట్యూనా చేపలవేటకు బయలుదేరి వెళ్లాయి. ట్యూనాల్లో కొమ్ముకోనాం, నెమలి కోనాం, అభిలాష, తదితర రకాలు లభ్యమవుతున్నాయి.

**విదేశాలకు ఎగుమతి..!**

శుద్ధి చేసిన ట్యూనాలు అమెరికా, థాయ్‌లాండ్, వియత్నాం, ఇతర యూరోపియన్ దేశాలకు అధిక సంఖ్యలో ఎగుమతి అవుతున్నాయి. దేశంలో అయితే కేరళ రాష్ట్రానికి ఎగుమతి అవుతుంటాయి. ఈ చేపల్లో ముళ్లు తక్కువగా ఉంటాయని, అధికశాతం ప్రొటీన్లు, ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు, విటమిన్స్ ఎక్కువగా ఉండటంతో డిమాండ్ పెరుగుతుందని జేడీ వివరించారు.

**ప్రత్యేక 'వలలు..బోట్లు'**

ఇక్కడి రేవులో 680 వరకు బోట్లు ఉంటే, దాదాపు 200పైగా బోట్లు 'ట్యూనాల' వేట సాగిస్తున్నాయి. ఆ చేపలు బరువుగా ఉండటంతో పాటు, డీప్ సీ(సముద్రంలో లోతైన ప్రదేశాలు)లో మాత్రమే దొరుకుతుంటాయి. దీంతో ఒక్కసారి వేటకు వెళ్లే బోట్లు కనీసం 20 నుంచి 25 రోజుల పాటు సముద్ర జలాల్లోనే ఉంటాయి. విశాఖ తీరం నుంచి బయలుదేరే మత్స్యకారులు.. ట్యూనాల కోసం పశ్చిమ బెంగాల్ సరిహద్దు వరకు వెళ్లి వేట సాగిస్తుంటారు.

**బోట్ల నిర్మాణ ఖర్చులో రాయితీ..!**

ఒక బోటు 20 రోజుల పాటు వేట సాగిస్తే 6 నుంచి 7 టన్నుల వరకు దిగుబడులు వస్తుంటాయని, కిలో ధర రూ.160 వరకు ఉంటుందని, వాటిని శాస్త్రీయ పద్ధతిలో నిల్వ చేస్తే ధర పెరిగే అవకాశాలు ఉన్నాయని మత్స్యశాఖ విశాఖ జిల్లా జేడీ పి.లక్ష్మణరావు తెలిపారు. ట్యూనాల వేటకు లాంగ్ లైన్ (హుక్ అండ్ లైన్) వలల్ని వినియోగిస్తారు. తీరం నుంచి 60 కిలోమీటర్ల లోపలకు వెళ్లి వేట సాగించాలి. 800 నుంచి వెయ్యి గాలాలు అవసరమవుతాయి. ప్రస్తుతం ఉన్న బోట్లను డీప్ సీ ఫిషింగ్‌కు అనుకూలంగా మార్చుకునేందుకు అయ్యే ఖర్చులో 40 శాతం వరకు రాయితీ లభిస్తుంది.

**ఇలా భద్రపరుస్తారు..!**

ట్యూనాలు పట్టుబడిన వెంటనే మెదడు, పేగులు, రెక్కలు, మొప్పులు, కళ్లు ఇతర భాగాలు తొలగించి, శుభ్రం చేస్తారు. ఆ తర్వాత బోట్లలో ఐస్‌తో నిండిన ప్రత్యేక గదుల్లో సున్నా డిగ్రీ ఉష్ణోగ్రత వద్ద నిల్వ చేస్తారు. అలా చేప నాణ్యతను పరిరక్షిస్తే అధిక ధర దక్కుతుంది. సాధారణ బోట్లు, వలలతో 'ట్యూనాల' వేట సాధ్యం కాదు. వాటి కోసం పెద్ద సైజు వలలు, గాలం తాళ్లను సిద్ధం చేసుకోవాలి. వలలకు చిక్కిన వాటిని భద్రపరుచుకునేందుకు వీలుగా బోట్లను సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. ఈ తరహా వేట సాగించే మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీలు ఇస్తుండడంతో చాలా మంది అటువైపు దృష్టి సారిస్తున్నారు.

# పనుల వెనుక మతలబు ఏమిటో?



అగనంపూడి: అగనంపూడి టోల్‌గేట్ వద్ద కొనసాగుతున్న నిర్మాణ పనుల వెనుక పలు అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. మూసేసిన గేట్‌లో పక్కా నిర్మాణాలు ఎందుకు చేపట్టారన్న విషయం అంతుచిక్కడం లేదు. దీని నిర్వహణపై కోర్టులో కేసు నడుస్తుండగా నిర్మాణ పనులు చేపట్టడం ఊహాగానాలకు తావిస్తోంది. రెండు దశాబ్దాల క్రితం అనకాపల్లి- గాజువాక మధ్య జాతీయ రహదారిపై శివాజీనగర్ వద్ద టోల్‌గేట్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఇది నగర పరిధిలో ఉండకూడదన్న నిబంధన ఉన్నా పట్టించుకోకుండా ప్రజలపై భారం మోపుతూ వచ్చారు. దీనిపై స్థానిక ప్రజలు వివిధ స్థాయిల్లో ఆందోళనలు సాగిస్తూ వచ్చారు. 2018లో అప్పటి ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హయాంలో కోర్టును ఆశ్రయించి టోల్‌గేట్‌ను మూయించేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో మళ్లీ తెరిచారు. 2024లో ప్రభుత్వం మారడంతో టోల్ వసూళ్లకు తెరపడింది.

**వసూళ్లకు ఒప్పుకోం...**

అగనంపూడి టోల్‌గేట్ సమస్య కోర్టు పరిధిలో ఉంది. కోర్టు నుంచి ఒకవేళ అనుకూలంగా తీర్పు వస్తే వెనువెంటనే వసూళ్లు ప్రారంభించేందుకే హైవే అధికారులు ఈ పునరుద్ధరణ పనులు చేపడుతున్నారా? అని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ టోల్ నిర్వహణను ఒప్పుకోబోమని, మళ్లీ తెరిస్తే ఆందోళన చేపట్టి అడ్డుకుంటామని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.

కూటమి హయాంలో స్థానికులు టోల్ నిర్వహణను అడ్డుకున్నారు. ఈ క్రమంలో తీవ్ర ఆందోళన కూడా సాగింది. తరువాత కౌంటర్లు తొలగించగా షెడ్డు అలాగే ఉండిపోయింది. పది నెలలుగా కార్యకలాపాలు నిలిచిపోగా ఇటీవల ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు టోల్‌బూత్ వద్ద రహదారి పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఇరుపక్కలా స్లాబులు వేసి రహదారులను నిర్మిస్తున్నారు. దీంతో మళ్లీ టోల్‌గేట్ తెరిచేందుకే ఈ పనులు కొనసాగిస్తున్నా రని స్థానిక ప్రజలు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారులకు

**మరమ్మతులు చేస్తున్నాం:**

అగనంపూడి టోల్‌గేట్ వద్ద చేపట్టిన అభివృద్ధి పనులపై ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభాత్‌రంజన్‌ను 'వివరణ కోరగా.. ఆయన ముక్తసరిగా సమాధానమిచ్చారు. ప్రస్తుతానికి ఇరుపక్కలా రహదా రులకు మరమ్మతు పనులు చేపట్టామన్నారు. టోల్‌గేట్‌ను మళ్లీ తెరిచేందుకే ఈ పనులు చేపట్టారా? అన్న ప్రశ్నకు సమాధానాన్ని దాట వేశారు.

# పాలకా.. సీటడుగుతోంది బాలిక

నంద్యాల : కోసిగి కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశాలకు ఈ ఏడాది 160 దరఖాస్తులొచ్చాయి. 40 సీట్లు ఉండగా నాలుగు రెట్ల అధికంగా విద్యార్థినులు దరఖాస్తు చేసుకున్నారు. ఇక్కడ మొత్తం 280 మంది విద్యార్థినులు చదువుతున్నారు. ప్రతి తరగతిలో నూతన ప్రవేశాల కోసం తల్లిదండ్రులు సంప్రదిస్తూనే ఉన్నారు.“ ఏటా మేము పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలస పోతున్నాం. ఆడ పిల్లలను వెంట బెట్టుకుని వెళ్లలేం. అలాగని ఇంటి దగ్గర విడిచిపోలేం. కస్తూర్బా పాఠశాలల్లో చదువు, వసతి బాగుంటాయని చెబుతున్నారు. నా కూతురును చేర్పిద్దామని కోసిగి, పెద్దకడబూరు, గోనెగండ్ల పాఠశాలల్లో అడిగి చూస్తే సీట్లు లేవని చెబుతున్నారు. వలసపోయేటోళ్లను చూసి సీట్లను పెంచాలి.రామకృష్ణ, కోసిగి

కర్నూలు జిల్లాలో 26, నంద్యాలలో 27 కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు(కేజీబీవీ) ఉన్నాయి. వీటిలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు బోధిస్తున్నారు. ప్రతి తరగతికి 40 సీట్ల చొప్పున ఉన్నాయి. ఇలా ప్రతి విద్యాలయంలో 10వ తరగతి వరకు 200 సీట్లు, ఇంటర్మీడియట్‌కు 80 సీట్లు ఉన్నాయి. రక్షణ ఎక్కువగా ఉండటం.. బోధన బాగుండటంతో అమ్మాయిలను చేర్పించడానికి తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. సరిపడా సీట్లు లేకపోవడంతో వారికి నిరాశే ఎదురవుతోంది. చాలాచోట్ల నాలుగు రెట్ల దరఖాస్తులొస్తున్నాయి. 6 నుంచి 9వ తరగతి వరకు సీట్లు పెంచాలన్న డిమాండ్లు ఎక్కువయ్యాయి. కొందరు తల్లిదండ్రులు ప్రజాప్రతినిధులతో సిఫార్సు చేయిస్తున్నారు.

**పశ్చిమాన డిమాండ్ ఎక్కువ**

పశ్చిమ ప్రాంతంలో కేజీబీవీల్లో చేరడానికి ఎక్కువమంది విద్యార్థినులు ఆసక్తి చూపుతున్నారు. ప్రత్యేకించి పెద్దకడబూరు, కౌతాళం, గోనెగండ్ల, తుగ్గలి, ఎమ్మిగనూరు, కోసిగి, నందవరం, మంత్రాలయం, హొళగుంద, హాలహర్వి, దేవనకొండ, కృష్ణగిరి మండలాల్లోని కేజీబీవీల్లో ప్రవేశాలకు ఎక్కువ డిమాండ్ ఉంది. పట్టణ ప్రాంతమైన ఎమ్మిగనూరులో ఈ ఏడాది 6వ తరగతిలో ప్రవేశాల కోసం 60 మంది దరఖాస్తు చేసుకున్నారు.నందికొట్కూరు, కోవెలకుంట్లలో కేజీబీవీలు లేవు. నందికొట్కూరు పట్టణంలో విద్యాలయం లేకపోవడంతో సమీప ప్రాంతాలైన జూపాడుబంగ్లా, మిడుతూరులో చేరేందుకు విద్యార్థినులు ప్రయత్నిస్తున్నారు.జిల్లా కేంద్రం నంద్యాలలో రెండు కేజీబీవీలు ఉండగా.. ఇక్కడ సీట్ల కోసం ఏటా ప్రజాప్రతినిధులు సిఫార్సు చేస్తున్నారు. గత ఐదేళ్లుగా నంద్యాలలో మరో కేజీబీవీ ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. లేదా రెండు కేజీబీవీల్లో సీట్లు రెట్టింపు చేయాలని విన్నవిస్తున్నారు.

**వలస జీవుల వెతలు**

ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, మంత్రాలయం, ఆలూరు నియోజకవర్గాల్లో ఏటా పెద్ద సంఖ్యలో ప్రజలు పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. కుటుంబాలతో కలిసి వెళ్తుండటంతో బాలికల చదువు మధ్యలోనే ఆగిపోతోంది. దీంతో తల్లిదండ్రులు తమ కుమార్తెలను కేజీబీవీల్లో చేర్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రాంతాల్లోని విద్యాలయాల్లో ప్రవేశాలు లేకపోవడంతో ప్రిన్సిపాళ్లు తల్లిదండ్రులను ఇతర పాఠశాలలకు వెళ్లేలా కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఇప్పటికే పశ్చిమ ప్రాంతంలో అన్ని కేజీబీవీల్లో సామర్థ్యానికి మించి విద్యార్థినులు ఉన్నారు. ప్రస్తుతం కర్నూలు జిల్లాలో 17, నంద్యాల జిల్లాలోని 22 కేజీబీవీల్లో అదనపు గదులను నిర్మిస్తున్నారు. ఇవి పూర్తయితే కొన్ని సీట్లు పెరిగే అవకాశం ఉంది.

**గత నెలలోనే ప్రవేశాలు పూర్తి**

ఉమ్మడి జిల్లాలోని 53 కేజీబీవీల్లో 10,600 మంది విద్యార్థినులు చదువుకునే అవకాశం ఉంది. ప్రతిచోటా మరికొందరికి ప్రవేశాలు కల్పించాలనే అభ్యర్థనలు వస్తున్నాయి. తల్లి, తండ్రి లేని విద్యార్థినులు, లేదా తల్లిదండ్రులిద్దరూ లేని బాలికలకు ప్రాధాన్యం ఇస్తారు. తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల వారు, నిరుపేద బాలికలకు అవకాశం కల్పిస్తారు.విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో సీఆర్పీలు ఆయా కేజీబీవీల పరిధిలో ఇంటింటి సర్వే నిర్వహించి అర్హుల జాబితాలను అందిస్తారు. వీరికి ప్రవేశాల్లో ప్రాధాన్యం ఇస్తారు. ఆ తర్వాత ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకున్న వారిని పరిగణనలోనికి తీసుకుని అర్హులను ఎంపిక చేస్తారు.

# స్మార్ట్‌గా వ్యవహరించాల్సిందే

కర్నూలు : ఇప్పుడంతా 'స్మార్ట్'కాలం. విద్యుత్తు వినియోగం లెక్కింపు కోసం స్మార్ట్ మీటర్లు వచ్చేశాయి.. సంబంధిత శాఖ ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సముదాయాలు, బహుళ అంతస్తు భవనాల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో 67,000, నంద్యాల జిల్లాలో 66,800 మీటర్లను ఇప్పటికే అమర్చినట్లు విద్యుత్తు శాఖ అధికారులు చెబుతున్నారు. వీటిపై వినియోగదారులకు పూర్తిస్థాయిలో అవగాహన కరవైంది. ఫలితంగా ఒక్కసారిగా బిల్లు పెరగడంతో ఆందోళనకు గురవుతున్నారు.. లోడుకు తగ్గ కెపాసిటర్లు బిగించుకుంటే 'లెక్క' సరిగా ఉంటుందని విద్యుత్తు శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

**బంద్ చేయకుంటే భారీగా బిల్లు**

ఏపీఈఆర్సీ రెగ్యులేషన్స్ ఆధారంగా ఐఆర్డీఏ మీటర్లలో కెపాసిటర్ బ్లాకింగ్ అనే ఆప్షన్ తీసేశారు. దీంతో అధిక లోడు కెపాసిటర్లు బిగిస్తే లీడింగ్ పవర్ ఫ్యాక్టర్ అనేది కేవీఏహెచ్‌లో కలుస్తుంది. వినియోగదారులు మోటారు లోడులో 1/3వ వంతు ఉండే కెపాసిటర్లను బిగించుకోవాలి. మోటారు లోడు లేక మిషన్ లోడ్ ఆఫ్‌లో ఉన్నప్పుడు తప్పనిసరిగా కెపాసిటర్లు ఆఫ్ చేసుకోవాలి. లేకుంటే అధికంగా ఉన్న కెపాసిటర్ల లోడు కేవీఏహెచ్‌లో కలుస్తుంది. బిల్లు భారీగా వస్తుంది.

**కెపాసిటర్ల అవసరం గుర్తించాలి**

స్మార్ట్ మీటర్లు ఉన్న దుకాణాలు, దుకాణ సముదాయాల్లో లోడుకు తగ్గట్టు కెపాసిటర్లు అమర్చుకోవాలి. ఉదాహరణకు 5 హెచ్‌పీ మోటారు ఉన్న వినియోగదారుడు 2 కేవీఏఆర్ కెపాసిటర్‌ను మాత్రమే ఏర్పాటు చేసుకోవాలి. అలాకాక 4 కేవీఏఆర్ కెపాసిటర్ ఏర్పాటు చేసుకుంటే లీడింగ్ కేవీఏహెచ్‌లో కలవడంతో విద్యుత్తు బిల్లు పెరిగే అవకాశముందని అధికారులు పేర్కొంటున్నారు.

పరిశ్రమలు, ఇతర కమర్షియల్ దుకాణాల్లో అధిక లోడు వాడు వాడుతుంటే లోడులో 25 శాతం కలిగిన కెపాసిటర్ ఏర్పాటు చేసుకోవాలి. పని అయిపోగానే మోటారును, కెపాసిటర్‌ను తప్పనిసరిగా స్విచ్ఛాఫ్ చేసుకుంటే బిల్లు తగ్గుతుంది.

“ లోడుకు తగ్గ కెపాసిటర్లను ఏర్పాటు చేసుకోవాలి. పరిశ్రమలో యంత్రాలను ఆపేసిన వెంటనే వాటికి సంబంధించిన కెపాసిటర్‌నూ ఆఫ్ చేసుకోవాలి. దీనిపై అవగాహన కల్పిస్తున్నామని” ఎస్ఈ ఎం.ఉమాపతి పేర్కొన్నారు.

**ఉదాహరణకు ఇలా..**

“వాణిజ్య విద్యుత్తు కనెక్షన్ (ఎల్‌టీ2)కు సంబంధించి నెల రోజులపాటు వాడే విద్యుత్తు వాడకానికి రూ.800 వచ్చేది. కానీ స్మార్ట్ మీటర్ ఏర్పాటు చేసుకున్నాక లోడులో 1/3వ వంతు కెపాసిటర్ కంటే ఎక్కువ కెపాసిటర్‌ను ఏర్పాటు చేసుకోవడం.. లీడింగ్ కేవీఏహెచ్‌లో కలవడంతో ఒకేసారి రూ.18 వేల మేర బిల్లు వచ్చింది. దీంతో విద్యుత్తు వినియోగదారుడు అవాక్కయ్యారు.”

# ప్రతిష్ఠాత్మక కోర్సు.. ఏయూలో ప్రత్యేకం!

విశాఖపట్నం: అమెరికాలోని సిలికాన్ వ్యాలీని తలపించేలా అమరావతిలో రూ.4,000 కోట్లతో క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. రాష్ట్రాన్ని క్వాంటం కంప్యూటింగ్ కేంద్రంగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ ఇండస్ట్రీకి నైపుణ్యమున్న మానవ వనరులను అందించేందుకు ఉన్నత విద్యా సంస్థలు కృషి చేస్తున్నాయి. 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఆంధ్ర విశ్వవిద్యాలయం.. ఇంజినీరింగ్‌లో ఈసీఈ, సీఎస్ఈ మాదిరిగా క్వాంటం కంప్యూటింగ్‌లో మేజర్, మైనర్ డిగ్రీ ప్రోగ్రాంలు అందించనుంది.

**మైనరీ డిగ్రీకి అవకాశం:** మేజర్ డిగ్రీగా క్వాంటం కంప్యూటింగ్ చదువుతున్న విద్యార్థులకు మైనర్ డిగ్రీగా కంప్యూటర్ సైన్స్, ఈసీఈ అందజేయాలని భావిస్తున్నారు. ఇంజినీరింగ్‌లో ఇతర విభాగాల్లో నాలుగో ఏడాది చదువుతున్న విద్యార్థులకు (2022-23 బ్యాచ్) క్వాంటం కంప్యూటింగ్‌లో మైనర్ డిగ్రీ ఇచ్చే అవకాశాన్ని పరిశీలిస్తున్నారు. తొలిసారిగా కోర్సు ప్రారంభించనున్న నేపథ్యంలో బోధన అవసరాలకు ప్రొఫెసర్లను తీర్చిదిద్దాల్సి ఉంది. నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీ ఎన్‌హాన్స్డ్ లెర్నింగ్ (ఎన్‌పీటీఈఎల్), స్వయం పోర్టల్స్‌లో ఆన్‌లైన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సులోని సబ్జెక్టులకు సంబంధించి ఐఐటీ ఆచార్యులు బోధించిన వీడియోలు వెబ్‌సైట్లలో పొందుపరిచారు.

**ఏయూలో తొలిసారిగా:** దేశవ్యాప్తంగా అతితక్కువ విద్యా సంస్థల్లో



మాత్రమే ఈ కోర్సును బోధిస్తున్నారు. ఐఐటీ మద్రాస్‌లో అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు, దిల్లీ, ముంబయి ఐఐటీల్లో, బెంగళూరులోని ఐఐఎస్సీ తదితర విద్యా సంస్థల్లో పోస్టు గ్రాడ్యుయేట్/పీహెచ్‌డీ స్థాయిలో అమలు చేస్తున్నారు. వివిధ సంస్థలు ఆన్‌లైన్ కోర్సులు అందిస్తున్నాయి. వివిధ విశ్వవిద్యాలయాల్లో సీఎస్ఈలో ఒక సబ్జెక్టుగా దీన్ని బోధిస్తున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రత్యేకంగా బీటెక్‌లో క్వాంటం కంప్యూటింగ్ కోర్సు లేదని, ఏయూలో తొలిసారిగా ప్రారంభించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

తొలి ఏడాది 30 సీట్లు: ఏయూలో కోర్సు ప్రారంభించడానికి ఈ ఏడాది జనవరిలో అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ)కి ప్రతిపాదనలు పంపారు. బీటెక్‌లో 60 సీట్లకు ఆమోదం లభించగా.. తొలి ఏడాది 30 సీట్లు అందుబాటులోకి తేనున్నారు. దీనికి సంబంధించిన పాఠ్య ప్రణాళికను ఇప్పటికే సిద్ధం చేశారు. ఈఏపీసెట్ ద్వారా ప్రవేశాలు చేపట్టనున్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ కింద చేపట్టనున్న ఈ కోర్సుకు ఏడాదికి రూ.79 వేలు ఫీజు చెల్లించాలి. జులై నెలాఖరు లేదా ఆగస్టులో తరగతులు ప్రారంభమవుతాయి.

మెరుగైన అవకాశాలు: ప్రస్తుతం టెక్నాలజీలో ఉన్నత స్థాయిలో ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను మించిన అవకాశాలు ఇందులో ఉన్నాయి. పోటీ ప్రపంచంలో ఈ సాంకేతికతను అభివృద్ధి చేయడానికి దిగ్గజ టెక్ సంస్థలు ప్రధానంగా కృషి చేస్తున్నాయి. మెడికల్, సైన్స్ అండ్ టెక్నాలజీ, రక్షణ రంగాల్లో ఈ టెక్నాలజీ ఎక్కువగా ఉపయోగపడుతుంది. భవిష్యత్తులో ఈ రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. దీనిపై పరిశోధనలకు గాను కేంద్ర ప్రభుత్వానికి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్టీ) నుంచి నిధులు పొందొచ్చు.
ఆచార్య జి.శశిభూషణరావు, ప్రిన్సిపాల్, ఏయూ ఇంజినీరింగ్ కళాశాల

# నాలుగేళ్లుగా నాన్చుతూ..!

చిత్తూరు: నగర, పురపాలికల్లోని ప్రజలకు సమీపంలోనే వైద్యసేవ లు అందించాలనే ఉద్దేశంతో మంజూరైన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (యూపీహెచ్‌సీ)కు గ్రహణం పట్టుకుంది. వైకాపా హయాంలో పనులు ప్రారంభించగా బిల్లులు మంజూరు చేయలేదు. దీంతో అవి దిష్టిబొమ్మలను తలపిస్తున్నాయి. కూటమి హయాంలోనైనా నిధులు విడుదల చేస్తే పట్టణవాసులకు అవస్థలు తప్పుతాయి. పట్టణాల్లో నివసిస్తోన్న ప్రతి 25 వేల మంది జనాభాకు ఒక యూపీహెచ్‌సీ నిర్మించాలనే ఉద్దేశంతో జిల్లాలో 12, తిరుపతి జిల్లాలో 15 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మంజూరయ్యాయి. ఒక్కో



కేంద్రం నిర్మాణానికి రూ.80 లక్షల వ్యయమవుతుందని అంచనా వేశారు.

**త్వరగా బిల్లులు చెల్లిస్తేనే..**

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పూర్తి కాకపోవడానికి ప్రధాన కారణం బిల్లులు చెల్లించకపోవడమే. పుంగనూరు, నగరిలో రెండు చొప్పున, పలమనేరులో ఒకటి నిర్మించినా కొన్ని చోట్ల పరికరాలు పూర్తి స్థాయిలో అందుబాటులో లేవు. చిత్తూరులో రెండు, పలమనేరులో ఒకటి అసంపూర్తిగా ఉన్నాయి. కుప్పానికి రెండు మంజూరు కాగా.. కమతమూరు భవనం పనులు మొదలే కాలేదు. చిత్తూరునగరానికి 4 కేటాయించగా.. రెండు భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. మంజూరు: 12 నిర్మాణం పూర్తి: 8 అసంపూర్తిగా: 4

# ముఖ హాజరులో మతలబు




అనంతపురం : స్త్రీ,శిశు సంక్షేమ శాఖ(ఐసీడీఎస్)లో లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించాలన్న సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుకు శ్రీకారం చుట్టిన ముఖ ఆధారిత హాజరు(ఎఫ్ఆర్ఎస్) నమోదు వ్యవహారానికి సిబ్బందే తూట్లు పొడుస్తున్నారు. ఎఫ్ఆర్ఎస్ ఆధారంగా కోడిగుడ్లు, పాలు, కిట్లు, బాలామృతం.. వంటి పౌష్టికాహారాన్ని పంపిణీ చేయాలని భావించారు. దీనివల్ల పక్కా సమాచారం, పంపిణీ పనితీరు ఎప్పటికపుడు తెలుస్తుందన్న ఉద్దేశంతోనే అమల్లోకి తెచ్చారు. ఏడాది క్రితమే కార్యరూపం దాల్చింది. ఈక్రమంలో కొత్త విధానంలో నమోదు చేయడానికి కొందరు సిబ్బంది కుంటిసాకులతో ముందుకు కదలకుండా చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. సెల్‌ఫోన్ల పనితీరు, ఇంటర్నెట్ సిగ్నల్, సర్వర్ మొరాయించడం.. వంటి సమస్యలు ఉన్నాయి. వాటిని అధిగమిస్తూ వంద శాతానికి చేరువలో ఉన్న ప్రాజెక్టులు, జిల్లాలు చాలా ఉన్నాయి. అనంత జిల్లాలోనే సమస్య ఎందుకు తలెత్తుతుందో అర్థం కావడం లేదని అధికారులే అంటున్నారు.

**నిధులపై ప్రభావం**

జిల్లాలోని 11 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2302 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ఎఫ్ఆర్ఎస్-ఈకేవైసీ, ఆధార్ అనుబంధనం చేసిన లబ్ధిదారుల ప్రకారమే నిర్దేశిత బడ్జెట్ను విడుదల చేస్తుంది. కేంద్రాల్లో నమోదైన సంఖ్య, ఎఫ్ఆర్ఎస్‌లో నమోదైన సంఖ్యకు భారీ వ్యత్యాసం ఉంది. దీన్ని తేల్చడానికి ఎఫ్ఆర్ఎస్‌ను వంద శాతం నమోదు చేయాల్సిందేనని కేంద్రం ఇప్పటికే తేల్చిచెప్పింది. జులై నుంచి 3-6ఏళ్లలోపు వారికి ఎఫ్ఆర్ఎస్ అమలు చేస్తామంటూ ప్రకటించింది.

**గుత్తిలో అధ్వానం**

జిల్లా వ్యాప్తంగా సగటున 64.7 శాతమే నమోదు చేశారు. తాడిపత్రి ప్రాజెక్టు ప్రథమ స్థానంలో నిలవగా.. గుత్తి చివరన ఉంది. రాయదుర్గం, కళ్యాణదుర్గం, నార్పల కొంతమేర పర్వాలేదు. కంబదూరు, అనంత గ్రామీణం, అనంత అర్బన్, ఉరవకొండ... ప్రాజెక్టుల పనితీరు ఆశించిన మేర లేదు. ఈ ప్రాజెక్టుల్లో 45 నుంచి 60 శాతం మధ్యలోనే ఎఫ్ఆర్ఎస్ నమోదు చేయడం విశేషం. మొత్తం లబ్ధిదారుల్లో 60,361 మంది ఎఫ్ఆర్ఎస్ నమోదు చేసినా.. ఆధార్‌లో వెనుకపడ్డారు. ఈ-కేవైసీలోనూ అదే పరిస్థితి నెలకొంది. అనంత అర్బన్ ప్రాజెక్టు పరిధిలో విలీనమైన రెండు కేంద్రాల పరిధిలో 92 మంది లబ్ధిదారులు ఉంటే.. ఇప్పటి దాకా 40 మందికి మించి ముఖ ఆధారిత హాజరు(ఎఫ్ఆర్ఎస్) నమోదు పూర్తి చేశారు. మిగతా లబ్ధిదారులు ఉన్నారా.. లేదా, బోగస్సా అన్నది తేలాలి. అధికారులు ఒత్తిడి పెంచినా అక్కడి సిబ్బందిలో ఉలుకూపలుకూ లేదు. బీకే సముద్రం మండలంలోని ఓ కేంద్రంలో 60 మందికిపైగా లబ్ధిదారులు ఉన్నట్లు హాజరువేస్తూ వచ్చారు. మొబైల్ పని చేయకపోవడంతోనే ఎఫ్ఆర్ఎస్ చేయలేదన్న సాకుతో కాలం గడిపేస్తున్నారు. ఏడాదిగా ఇదే వ్యూహాన్ని అనుసరిస్తూ తప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది.

# లుక్‌తో ఘరానా మోసం!




అనంతపురం: సైబర్ నేరాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంత అప్రమత్తం చేస్తున్నా.. సామాన్యుల అత్యాశ ఆసరాగా చేసుకుని కొత్త మార్గాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. తాజాగా 'లుక్' యాప్ పేరుతో వేలాది మందిని మోసం చేసిన ఘటన అనంతపురం జిల్లాలో వెలుగుచూసింది. మా యాప్‌లో రూ.2,250 డిపాజిట్ చేస్తే తిరిగి రోజుకు రూ.150 చెల్లిస్తాం. వారానికి ఒకసారి విత్‌డ్రా చేసుకోవచ్చు. మీ పేరుతో వేరే వాళ్లను చేర్పిస్తే అదనంగా బోనస్ ఇస్తామంటూ నమ్మించడంతో వేలాది మంది సదరు యాప్‌లో పెద్దమొత్తంలో డబ్బులు పెట్టారు. ఒకటి, రెండు వారాలు బాగానే చెల్లింపులు చేయడంతో చాలామంది రూ.లక్షల్లో డిపాజిట్ చేశారు. తీరా సాంకేతిక కారణాలు చూపి కొన్ని వారాలుగా చెల్లింపులు నిలిపివేయడంతో మోసపోయామని గ్రహించారు. ఎక్కడ పరువుపోతుందోనని పోలీసులకు ఫిర్యాదు చేయడానికి ముందకు రావడం లేదు. అనంతపురం నగరంలోని పాతూరు, బళ్లారి రోడ్డుకు చెందిన వందలాది మంది గృహిణులు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతోపాటు కలెక్టరేట్‌లో పనిచేసే కొందరు ప్రభుత్వ ఉద్యోగులు సైతం డబ్బులు పెట్టి మోసపోయినట్లు తెలుస్తోంది.

**17 వేల మంది సభ్యులు**

యాప్ నిర్వాహకులు గొలుసుకట్టు విధానంలో మోసానికి పాల్పడుతున్నారు. లుక్ పేరుతో యాప్ రూపొందించి వాట్సాప్ గ్రూపుల ద్వారా ప్రచారం కల్పించారు. డబ్బు డిపాజిట్ చేస్తే ప్రతివారం ఆదాయం పొందవచ్చని కొంతమంది యూట్యూబర్లు, సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల ద్వారా చెప్పించడంతో చాలామంది ఆకర్షితులయ్యారు. యాప్‌లో చేరే వారిని 9 రకాలుగా విభజించారు. కొన్ని రకాల స్కీంలు రూపొందించి కనిష్ఠంగా రూ.2,250 నుంచి మొదలై గరిష్ఠంగా రూ.75.6 లక్షల వరకు డిపాజిట్ చేసేలా ప్రణాళిక రూపొందించారు. డిపాజిట్ మొత్తాన్ని బట్టి రోజుకు కొంత చొప్పున ఖాతాలో జమ చేస్తారు. జమైన సొమ్మును వారానికి ఒకసారి మాత్రమే విత్‌డ్రా చేసుకునేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. యాప్‌లో చేరిన వారందరినీ ఒక వాట్సప్ గ్రూపులో చేర్చి ఎప్పటికప్పుడు స్కీంలకు సంబంధించిన సమాచారాన్ని పోస్ట్ చేస్తూ వచ్చారు. ఇలా తెలుగుకు సంబంధించిన గ్రూపులోనే 17 వేల మంది సభ్యులు ఉన్నారు. యాప్‌లో చేరిన వారికి అనుమానం రాకుండా మొదట్లో పక్కాగా చెల్లింపులు చేయడంతో పాటు బోనస్, బహుమతులు ఎరగా వేశారు. దీంతో నమ్మిన చాలామంది డిపాజిట్ చేశారు. వారి నుంచి పెద్దమొత్తంలో డబ్బులు రాగానే విత్‌డ్రాలు నిలిపివేశారు.

**సేవా కార్యక్రమాలతో ప్రచారం**

యాప్‌కు ప్రచారం కల్పించడం కోసం సరికొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. సభ్యులుగా చేరిన వారి ప్రాంతంలోని పేదల వద్దకు వెళ్లి నిత్యావసర సరకులు అందించేలా ప్రోత్సహించారు. ఇలా చేస్తే గ్రూపులోని సభ్యులందరికీ బోనస్ ఇస్తామని ప్రకటించారు. యాప్ లోగోతో పోస్టర్లు, టీ-షర్టులు కొరియర్ ద్వారా పంపించారు. అనంతపురంతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ సభ్యుల ద్వారా నిత్యావసరాలు పంపిణీ చేపట్టారు. ఇలా చేయడం ద్వారా ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు యాప్‌పై నమ్మకం పెరిగేలా చేశారు. వీరి సేవా కార్యక్రమాలు చేసి వేలాది మంది యాప్‌లో చేరి డబ్బులు డిపాజిట్ చేసి మోసపోయారు. ఈ అంశంపై అనంతపురం సైబర్ విభాగం పోలీసులను వివరణ కోరగా యాప్‌పై ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని.. ఎవరైనా చేస్తే విచారణ చేస్తామన్నారు.

# మెప్మాకు జవసత్వాలు

అనంతపురం : పట్టణ పేదరిక నిర్మూలన (మెప్మా) మిషన్ సరికొత్త జవసత్వాలు తీసుకొస్తున్నారు. నగర, పట్టణాల్లోని పేదలకు పలు రకాల సంక్షేమ పథకాలతోపాటు సరికొత్త విధానాలను తెరపైకి తీసుకొచ్చి మహిళలకు ఆర్థిక దన్నుగా ఉండేందుకు పలు కార్యక్రమాలు అమలు అవుతున్నాయి. వాటిని క్షేత్రస్థాయిలో మహిళల చెంతకు తీసుకెళ్లడానికి సరైన అధికారులు, సిబ్బంది ఉండాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం సచివాలయాల్లో మిగులు సిబ్బంది ఉండి మెప్మాకు వచ్చి విధులు నిర్వహిస్తామని అంగీకారం ఇస్తే వారికి అవకాశం కల్పించారు. పథకాలు, చైతన్యం కల్పించడంలో కమ్యూనిటీ ఆర్గనైజర్లు అత్యంత కీలకం. గత వైకాపా హయాంలో మెప్మాను పూర్తిగా నిర్వీర్యం చేశారు. ఏడేళ్ల నుంచి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయక పోగా పదవీ విరమణ చేసిన స్థానాలు అలాగే ఉండి పోయాయి. దీంతో మహిళా సంఘాలు నామమాత్రం అయ్యాయి. తాజాగా డిజి లక్ష్మి, ర్యాపిడ్ ఆటోలు, ద్విచక్ర వాహనాలు, లైవ్‌లీహుడ్, ఈ-కామర్స్, బ్యాంకు లింకేజీ స్కీంలు, ఓఎన్‌డీసీ, గిగ్ మొత్తం 14 ప్రాజెక్టులు అమలు చేయాలని నిర్ణయించగా అందుకు అనువైన సిబ్బందిని నియమించారు.

**అదనపు సిబ్బంది బదలాయింపు**



సచివాలయాల్లో సంక్షేమ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న వారు మెప్మాలో పని చేయడానికి అంగీకారం తెలిపితే వారు ఇప్పటికే విధులు నిర్వహిస్తున్న నగర, పురపాలికల్లోనే అవకాశం కల్పించారు. అంగీకారం తెలిపిన వారికి మెప్మాలో అవకాశం కల్పించడంతో ఆయా ప్రాంతాల్లో అవసరాలకు అనుగుణంగా వారిని ఉపయోగించుకోనున్నారు. కొన్ని సచివాలయాల్లో ఎక్కువ మంది సంక్షేమ పథకాలు పొందుతున్న ప్రజలు ఉండగా సంక్షేమ కార్యదర్శి మెప్మాకు వెళ్లడంతో ఆ విధులు ఎవరు నిర్వహిస్తున్నారన్నది ప్రస్తుతానికి ప్రశ్నార్థకంగా ఉంది. హేతుబద్ధీకరణ చేపట్టి మిగులు సిబ్బందిని ఉపయోగించుకుంటే ఉపయుక్తంగా ఉంటుందన్న వాదన విన్పిస్తోంది.

# స్కాన్ చెయ్.. సమస్య పంపేయ్

పుంగనూరు : ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులకు అందుతున్న సేవలు బస్టాండ్లలో మౌలిక సదుపాయాలు సమగ్రంగా తెలుసుకునేందుకు క్యూఆర్ కోడ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. సురక్షిత ప్రయాణానికి గుర్తుచ్చేది ఆర్టీసీ బస్సులే. సామాన్య ప్రజల నుంచి వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు నిత్యం ఈ ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణిస్తుంటారు. ఆర్టీసీలో అందుతున్న సేవలపై క్యూఆర్ కోడ్ ద్వారా రివ్యూ ఇవ్వొచ్చు. దూరప్రాంత సర్వీసులైన లగ్జరీ, సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో డ్రైవర్ సీటు వెనుక కోడ్‌లు ఏర్పాటు చేశారు. ఈ విధానం పల్లె వెలుగు బస్సులకు మినహాయించారు. ప్రయాణికులు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఆ బస్సులో అందుతున్న సేవలను చూసుకోవచ్చు. అలాగే ఆయా బస్టాండ్లలో గల సదుపాయాలపై తన అభిప్రాయాన్ని చెప్పవచ్చు.



డ్రైవరు, కండక్టరు ప్రవర్తన, బస్సు వేగం, రాకపోకల వేళలు సక్రమంగా పాటిస్తున్నారా, సురక్షితమైన డ్రైవింగ్ ఉందా, బస్సులో శుభ్రత పాటిస్తున్నారా, ప్రయాణ అనుభూతి ఎలా ఉంది అనే ప్రశ్నలకు జవాబు ఇవ్వాల్సి ఉంటుంది.

జిల్లాలో చిత్తూరు 1, చిత్తూరు 2, పలమనేరు, కుప్పం, పుంగనూరులో గల ఆర్టీసీ డిపోల పరిధిలో గల 171 ఇంద్ర, సూపర్ లగ్జరీ, సప్తగిరి, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఈ క్యూఆర్ కోడ్ విధానం అమలవుతోంది.

**సేవల మెరుగుకే**

ఆర్టీసీ బస్సుల్లో, బస్టాండ్లలో ప్రయాణికులకు కల్పించాల్సిన సేవలను మెరుగు పరచడానికే ఈ క్యూఆర్ కోడ్ విధానం అమలవుతోంది. కండక్టరు, డ్రైవరు విధుల నిర్వహణ, ప్రయాణికులతో వ్యవహరించే తీరు, తదితర అంశాలను నేరుగా రీజియన్ స్థాయి అధికారులకు చేరుతోంది. ప్రయాణికులు వినియోగించుకుంటే ఆర్టీసీ సేవలు మరింత మెరుగుపడతాయి. సుధాకరయ్య, డీఎం, ఆర్టీసీ డిపో, పుంగనూరు

# కొనే ర్యాంపులు తక్కువే!

తిరుపతి: ఈ ఏడాది ఒకవైపు మామిడి గుజ్జు పరిశ్రమలు ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ ధరలు తగ్గిస్తుంటే.. మరోవైపు అంతకన్నా ఎక్కువ దోపిడీ ర్యాంపుల్లో జరుగుతోంది. అన్నదాతలు ఏడాదంతా కష్టపడి పంట తీసుకొస్తే కిలోకు రూ.2-3 మాత్రమే ఇస్తామని నిర్వాహకులు తెగేసి చెబుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో మామిడిని ఇచ్చేసి ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. గతంతో పోలిస్తే తక్కువ ర్యాంపులు తెరుచుకోవడంతోనే యజమానులు ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్టు తయారైంది. మిగిలిన వారితోనూ సంప్రదింపులు జరిపి తెరిపిస్తేనే కొంతవరకైనా సమస్య తగ్గుముఖం పడుతుంది. ధరలు సైతం కాస్త పెరిగే అవకాశముంది.

గతంతో పోలిస్తే ఈ ఏడాది చిత్తూరు, తిరుపతి జిల్లాలతో కలిపి దాదాపు లక్ష టన్నుల మామిడి దిగుబడి అధికంగా వచ్చింది. 43 గుజ్జు పరిశ్రమల్లో రోజూ 10 వేల టన్నుల తోతాపురి ఆడిస్తున్నారు. రెండు జిల్లాల్లో 57 ర్యాంపులున్నాయి. గతంలో రోజూ 3-4 వేల టన్నులు ఇక్కడ కొనుగోలు చేసేవారు. ఇప్పుడు 34 పనిచేస్తున్నాయి. అవి కూడా అరకొరగా కొంటున్నాయి. నిత్యం కార్యకలాపాలు జరుగుతున్న వాటి సంఖ్య 15 మాత్రమే. ఫలితంగానే గుజ్జు పరిశ్రమల వద్ద వందలాది ట్రాక్టర్లు బారులు తీరుతున్నాయి.

**దామలచెరువులో ఒత్తిడి తెస్తున్నా..**

పాకాల మండలం దామలచెరువు, పరిసర ప్రాంతాల్లో 15 ర్యాంపులున్నాయి. ప్రస్తుతం ఒక్కరు మాత్రమే కిలోకు రూ.3 చొప్పున చెల్లిస్తున్నారు. మిగతావారు రూ.2- 2.50 ఇస్తున్నారు. పోలీసులు, వీఆర్వోలను అక్కడే మోహరించి ఒత్తిడి తెచ్చినా ధరలు పెంచేందుకు ససేమిరా అంటున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం భన్సల్ హెచ్చరించినా ఎలాంటి మార్పు లేదు. అందులోనూ ముగ్గురు, నలుగురు నిర్వాహకులే కాయలు కొంటున్నారు. గతంలో అప్పులు తీసుకున్న రైతుల నుంచి కొందరు



కొనుగోలు చేస్తున్నారు. వీరిని ఎలాగోలా ఒప్పించి తోతాపురి కొనేలా చేస్తే అన్నదాతలకు ఉపశమనం లభిస్తుంది. అన్నీ అందుబాటులోకి వస్తే కిలోకు రూ.1 పెరిగే అవకాశం ఉందని రైతులు అంటున్నారు.

**పులిచెర్లలోనూ తక్కువగా**

పులిచెర్ల మండలంలో తొమ్మిది ర్యాంపులున్నాయి. నలుగురు అంతంతమాత్రంగానే కొనుగోలు చేస్తున్నారు. అదీ కిలోకు రూ.2-2.50 చెల్లిస్తున్నారు. వైకాపా నాయకుల ప్రలోభాలకు తలొగ్గి మిగతావారు ర్యాంపులు ప్రారంభించలేదనే ఆరోపణలున్నాయి. ఈ ప్రాంతంలో కొనుగోళ్లు నిలిచిపోవడంతో సోమల, సదుం, రొంపిచెర్ల మండలాల రైతులు దాదాపు 50-60 కిలోమీటర్ల దూరంలోని చిత్తూరు, పూతలపట్టు, గంగాధరనెల్లూరు నియోజకవర్గాలకు కాయలు తెస్తున్నారు. పరిశ్రమల వద్ద రెండు- మూడు రోజులు వేచిచూస్తున్నారు. రవాణా, కోత కూలీలు, పెట్టుబడులతో కలుపుకొంటే అన్నదాతలకు మిగిలేది శూన్యం.

చురకలు



# యాక్టింగ్ మానేద్దామనుకున్నా!

ఫిల్మ్ ఇండస్ట్రీలో హీరోలకు ఉన్నంత కెరీర్ టైమ్ హీరోయిన్లకు ఉండదు. హీరోలకు వయసుతో సంబంధం లేకుండా ఆఫర్లొస్తే హీరోయిన్లకు మాత్రం కేవలం యంగ్ ఏజ్ లో ఉన్నప్పుడే ఆఫర్లు వస్తుంటాయి. అందులోనూ మళ్లీ విపరీతమైన కాంపిటీషన్. ఇంతటి భారీ కాంపిటీషన్ లో కూడా ఇరవై ఏళ్ల మైలు రాయిని అందుకున్నారు నటి రెజీనా కసాండ్రా. మోడల్ గా కెరీర్ ను స్టార్ట్ చేసిన రెజీనా, 2005లో ఓ తమిళ మూవీతో సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత 2010లో సుధీర్ బాబుతో కలిసి ఎస్ఎమ్ఎస్ అనే సినిమాలో నటించి ఆ సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చారు. మొదటి సినిమాతోనే నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న రెజీనా ఆ తర్వాత కెరీర్లో ఎన్నో విభిన్న పాత్రల్లో నటించారు. అ..! ఎవరు లాంటి సినిమాల్లో విభిన్న రోల్స్ చేసి ఆడియన్స్ ను ఆశ్చర్యపరిచిన రెజీనా ఇండస్ట్రీలోకి వచ్చి 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మీడియా ముందుకొచ్చి కొన్ని ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఫిల్మ్ ఇండస్ట్రీలోకి వచ్చి 20 ఏళ్లవుతున్నా తానింకా



కొన్ని విషయాల్లో టాప్ ప్లేస్ లో లేనన్నారు. గత కొన్నేళ్లుగా తాను వరుసపెట్టి సినిమాలు చేయడం లేదని, అయినప్పటికీ 20 ఏళ్లుగా ఇండస్ట్రీలో కొనసాగడమంటే చిన్న విషయం కాదని, 20 ఏళ్ల కెరీర్ ను మైల్ స్టోన్ గా ఎందుకు చూస్తారో తనకు ఇప్పుడే అర్థమైందని చెప్పిన రెజీనా కెరీర్ తొలినాళ్లను గుర్తు చేసుకున్నారు. మధ్యలో వర్క్ చేయాలనిపించక యాక్టింగ్ మానేద్దామని డిసైడ్ అయినట్టు చెప్పిన రెజీనా ఒప్పుకున్న సినిమాలు పూర్తి చేశానని, ఆ తర్వాత 2018 నుంచి మళ్లీ వరుస ఛాన్సులొచ్చాయని చెప్పారు. ఒకేలాంటి పాత్రలు చేయకూడదని అప్పుడే నిర్ణయించుకున్నట్టు రెజీనా తెలిపారు. కెరీర్ స్టార్టింగ్ లో టాలీవుడ్ లో ఉదయం 6 గం.లకే డైలాగ్ పేపర్ తెచ్చి ఇచ్చేవాళ్లని, కానీ ఆ టైమ్ లో తెలుగు రాకపోవడంతో ఎంతో కష్టమైందని రెజీనా చెప్పారు. డైలాగులన్నింటినీ బాగా శ్రమించి కంఠస్థం చేసి, అందులోని ఎమోషన్స్ ను అర్థం చేసుకుని లైన్ టూ లైన్ ప్రాక్టీస్ చేసేదాన్నని, ఇండస్ట్రీకి వచ్చేముందు యాక్టింగ్ అంటే సినిమాలో నటించి, వచ్చేయడమే అనుకున్నానని, అప్పట్లో పీఆర్, సోషల్ మీడియా కు ఉన్న ప్రాధాన్యత తెలియలేదని తర్వాత్తర్వాత అన్నీ అలవాటయ్యాయని, ఇప్పుడు సోషల్ మీడియా వల్లే తన పనిని ఆడియన్స్ లోకి తీసుకెళ్తున్నట్టు రెజీనా తెలిపారు. ప్రస్తుతం సుందర్. సి దర్శకత్వంలో నయనతారతో కలిసి మూకుతి అమ్మన్2 లో నటిస్తున్నారు రెజీనా.

# కేన్స్ గుట్టు మట్లు విప్పిన ఫ్యాషనిస్టా ఉర్ఫీ

బోల్డ్ సెలక్షన్‌తో ఫ్యాషన్ సరిహద్దులు చెరిపేసిన బ్యూటీ ఉర్ఫీ జావేద్. ఈ భామ కేన్స్ 2025 ఫెస్టివల్ లో సందడి చేసేందుకు చాలా ప్లాన్ చేసినా, వీసా తిరస్కరణ కారణంగా హాజరు కాలేకపోయింది. ఈ సందర్భంగా ఉర్ఫీ ఏమాత్రం నిరశ చెందక మరో అవకాశం కోసం ప్రయత్నిస్తానని పాజిటివ్ గా స్పందించింది. అయితే కేన్స్ లో పాల్గొనడం అంటే అదేదో నెత్తిపై కుంపటి పెట్టుకున్నట్టు కాదని, టికెట్లు కొనుక్కొని ఎవరైనా వెళ్లొచ్చని చెప్పింది. ఈ వేదికలకు వెళ్లడానికి అర్హత అవసరం లేదని, స్పానర్ చేసేవాళు ఉంటే చాలని ఉర్ఫీ జావేద్ చెప్పింది. కేన్స్ 2025 ఉత్సవాలకు వెళ్లేందుకు తనకు స్పాన్సర్ చేసేవాళ్లు ఉన్నా కానీ, వీసా రిజెక్షన్ నిరాశపరిచిందని తెలిపింది. కేన్స్ రెడ్ కార్పెట్ పై ప్రభావశీరులు, ఇతర సెలబ్రిటీలు హాజరు కావడానికి స్పాన్సర్ షిప్ ఉంటుందని, విమానం టికెట్లు సహా వసతుల ఏర్పాటు వగైరా అన్నీ వాళ్లే చూసుకుంటారని కూడా ఉర్ఫీ జావేద్ వెల్లడించింది. ఉర్ఫీ ఇన్‌స్టాలో ఇలా సందేశం ఇచ్చింది. "కేన్స్‌కు వెళ్లడం అనేది మీ యోగ్యతపై ఆధారపడి లేని అవకాశం. బ్రాండ్‌లు రెడ్ కార్పెట్‌కు టిక్కెట్లు కొనుగోలు



చేసి, ప్రచారం కల్పించే లేదా ప్రభావితం చేసేవారికి, సెలబ్రిటీలకు ఇస్తారు. సాధారణ వ్యక్తులు కూడా టిక్కెట్లు కొనుగోలు చేయవచ్చు. కేన్స్ రెడ్ కార్పెట్‌పై నడవడం ఒక విజయం కాదు.. నాకు కూడా వర్తించదు. ఇది మిమ్మల్ని మీరు ప్రమోట్ చేసుకునే అవకాశం. అదే నిజం. నేను నిజం చెబుతున్నాను" అని ఉర్ఫీ రాసింది. మీ సినిమా ఫెస్టివల్ లో ప్రీమియర్ అయితే అది ఒక విజయం. డబ్బు ఉంటే, స్పాన్సర్ ఉంటే ఎవరైనా దీనిని సాధ్యం చేయగలరు.. అని చెప్పింది. కేన్స్ కి వెళ్లడానికి ఇండీ వైల్డ్ తనకు స్పాన్సర్ చేసిందని, కానీ నా వీసా తిరస్కరించరించారని ఉర్ఫీ బాధను వ్యక్తం చేసింది. తిరస్కరణలు ముగింపు కాదని, మరింత కష్టపడి పనిచేయడానికి ఒక ప్రోత్సాహకం అని తాను నమ్ముతున్నానని ఉర్ఫీ తెలిపింది. బెపన్నా, మేరీ దుర్గా సహా పలు టెలివిజన్ షోలలో కనిపించిన ఉర్ఫీ, రియాలిటీ షో బిగ్ బాస్ %టు% 1లో పాల్గొన్న తర్వాత బాగా పాపులరైంది. 2024లో లవ్ సెక్స్ ఔర్ ధోఖా 2 చిత్రంలో నటించింది. గత సంవత్సరం అమెజాన్ ప్రైమ్ వీడియోలో ప్రదర్శించిన రియాలిటీ సిరీస్ 'ఫాలో కర్ లో యార్'లో కూడా కనిపించింది.




# టైగర్ డాన్స్ కు హృతిక్ సైతం ఫిదా!



బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్..టాలీవుడ్ స్టార్ ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో ఆయాన్ ముఖర్జీ దర్శకత్వంలో వార్ 2 తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే టాకీ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం తారక్-హృతిక్ మధ్య ఓ పాట చిత్రీకరిస్తున్నారు. ఈ పాట ఎలా ఉంటుందో? అంచనాలు ఇప్పటికే పీక్స్ కు చేరాయి. నాటు నాటు రేంజ్ లో ఇద్దరు పోటీ పడే పాటగా హైలైట్ అవుతుంది.

ఈపాట కోసం ఇద్దరు కలిసి రిహార్సల్స్ చేసారు. తాజాగా ఈ పాటకు సంబంధించిన పీడ్ బ్యాక్ బయటకు వస్తోంది. ఈ పాటలో తారక్ డాన్స్ చూసి హృతిక్ ప్రశంసించకుండా ఉండలేకపోయాడుట. తారక్ డాన్స్ మూవ్ మెంట్స్ చూసి హృతిక్ కూడా ఫిదా అయ్యాడుట. ఆన్ సెట్స్ లో ఈ పాటను లైవ్ లో వీక్షించిన వారు ఓ అగ్ని గా పేర్కొంటున్నారు.

ఇద్దరి మధ్య డాన్స్ పోరు అగ్ని వర్షం కురిసినట్లే ఉందిట. ఇద్దరు ఎంతో పోటా పోటీగా కలిసి పని చేసినట్లు చెబుతున్నారు. ఎన్టీఆర్ ఎనర్జీ , గ్రేస్ ,పవర్-ప్యాక్డ్ డ్యాన్స్ స్టెప్స్ తో వావ్ అనిపించేలా చేసాడంటున్నారు. హృతిక్ లాంటి డాన్సు దిగ్గజంతోనే ప్రశంస అంటే చిన్న విషయమా? సెట్‌లో ఎన్టీఆర్‌ను ప్రశంసిస్తూ, అతని కదలికలు అద్భుతంగా ఉన్నాయని హృతిక్ అన్నాడుట. అభిమానులకు ఈ పాట గొప్ప విజువల్ ట్రీట్ గా నిలుస్తుందంటున్నారు. ఇప్పటికే ఈ పాట చిత్రీకరణ కూడా పూర్తయింది. దాదాపు వారం రోజుల పాటు చిత్రీకరించారు. ఈ పాట కోసం యశ్ రాజ్ స్టూడియోలో ప్రత్యేకంగా కోట్లాది రూపాయలు వెచ్చించి భారీ సెట్ వేసారు. అందులోనే పాట చిత్రీకరించారు. ఇందు లో తారక్ విలన్ పాత్ర పోషిస్తున్నాడు. హీరో పాత్రకు ధీటుగా ఈ రోల్ ఉంటుంది. ఇద్దరి మధ్య దెబ్బలాట హైలైట్ గా ఉంటుందని నిర్మాత నాగవంశీ రివీల్ చేసిన సంగతి తెలిసిందే. ఆ సీన్ చూసే సినిమా రైట్స్ తాను తీసుకున్నట్లు రివీల్ చేసారు. భారీ ఎత్తున సినిమా ఆగస్టులో రిలీజ్ అవుతుంది. ఆగస్టు తొలివారం నుంచే ప్రచారం పనులు మొదలవుతాయి.

# ఆ ముగ్గురు భామలకు డిమాండ్!







హీరోయిన్లు ఎంతో మంది వస్తుంటారు. వెళ్తుంటారు. కానీ కొందరు మాత్రమే ఫేమస్ అవుతుంటారు చేసింది ఒక్క సినిమా అయినా ఓ వైబ్ క్రియేట్ చేస్తుంటారు. ఈ మధ్య కాలంలో అలాంటి వైబ్ తెచ్చింది ఎవరంటే? కయాదు లోహర్, ఇవానా, మమతా బైజ్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. డ్రాగన్ సినిమా తో కయాదు లోహర్ ఏ రేంజ్ లో ఫేమస్ అయిందో తెలిసిందే. అమ్మడు హాట్ అప్పిరియన్స్ తోనే రీచ్ అయిపోయింది. తమిళ అనువాద చిత్రంతోనే తెలుగులో ఫ్యాన్స్ ని సంపాదించుకుంది. అటుపై సోషల్ మీడియా లో మరింత ఫేమస్ అయింది. ప్రస్తుతం ఈ బ్యూటీ తమిళ్ లోనే మూడు సినిమాలు చేస్తోంది. తెలుగులోనూ అవకాశాలు వస్తున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ లో ఓ సినిమాకి అగ్రిమెంట్ చేసుకున్నట్లు సమాచారం. ఇంకా నవతరం దర్శకులు అమ్మడికి కథలు వినిపిస్తున్నారు. అమ్మడికి ఉన్న యువ క్రేజ్ ని దృష్టిలో పెట్టుకుని ఛాన్సలిస్తున్నారు. కేరళ కుట్టి ఇవానా కయాదు కంటే ముందే కోలీవుడ్ లో ఫేమస్ అయింది. లవ్ స్టోరీ సినిమాతో తెలుగు ఆడియన్స్ కు బాగా రీచ్ అయింది. డ్రాగన్ లో క్లైమాక్స్ ఎంట్రీలోనూ అదరగొట్టింది. ఇవానా రాకతో థియేటర్లు దద్దరిల్లాయి. దీంతో అమ్మడు టాలీవుడ్ కి ఏ రేంజ్ లో కనెక్ట్ అయిందో అర్దమైంది. ప్రస్తుతం తెలుగు సినిమాల్లో కూడా అవకాశాలు అందుకుంటుంది. ఇటీవలే రిలీజ్ అయిన సింగిల్ లో లీడ్ రోల్ పోషించి అలరించింది. ఈ సినిమా మంచి విజయం సాధించడంతో మరోసారి అమ్మడి పేరు హైలైట్ అవుతుంది. అమ్మడి ట్యాలెంట్ కి మరిన్ని తెలుగు సినిమా ఛాన్సులు ఖాయం. ప్రేమలు చిత్రంతో ఇలాగే సంచలనం మైంది మమతా బైజు. ప్రస్తుతం కోలీవుడ్ లో బిజీగా ఉంది. తెలుగులోనూ అవకాశాలు వస్తున్నాయి. కానీ సరైన కథలైతే తప్ప కమిట్ అవ్వనంటోంది. వీళ్లంతా ఒకే ఒక్క సినిమాతో ఫేమస్ అయిన బ్యూటీలే.

# కేతిక శర్మ ప్రయాణం కూడా రాశీఖన్నాలా!

ఇండస్ట్రీలో హిట్లతో పనిలేకుండా కొంత మంది భామలకు లక్కీగా అవకాశాలు అందుకుంటుంటారు. టాలీ వుడ్ లో కొన్నాళ్ల పాటు రాశీఖన్నా కెరీర్ అలాగే సాగింది. ఎన్ని పరాజయాలు ఎదురైనా అమ్మడు కొత్త అవ కాశాలు అందుకుంటూ సాగింది. ఇలా ఎంత కాలం అంటే? అవకాశాలు వచ్చినంతకాలం సాగుతుంది. అప్పుడప్పుడు యావరేజ్ గా ఆడిన సినిమాలు కూడా లెక్కలోకి రావడంతో కొన్నాళ్ల పాటు బండి లాంగించింది. కానీ ఒక్కసారిగా టాలీవుడ్ లో ఛాన్స్ లు నిల్ అవ్వడంతో తమిళ్, హిందీ అంటూ పర భాషలవైపు కాన్సంట్రేట్ చేసి అటెళ్లింది. తాజాగా మురో ముంబై బ్యూటీ కేతిక శర్మ కెరీర్ కూడా టాలీవుడ్ లో అలాగే సాగుతున్నట్లు కనిపిస్తుంది. రొమాంటిక్ చిత్రంతో తెలుగులో ఎంట్రీ ఇచ్చిన అమ్మడు అటుపై చెప్పుకోదగ్గ సినిమాలే చేసింది. లక్ష్య, రంగ రంగ వైభవంగా, బ్రో, రాబిన్ హుడ్ లాంటి పెద్ద చిత్రాలే చేసింది. కానీ ఇవేవి కూడా హిట్ అవ్వలేదు. అయినా సరే అమ్మడు కొత్త అవకాశాలు



అందుకుంటూనే ఉంది. ఇటీవలే రిలీజ్ అయిన సింగిల్ తో మాత్రం డీసెంట్ హిట్ అందుకుంది. ఈసినిమా అమ్మడికి బూస్టింగ్ లా నిలిచింది. ఇప్పటి వరకూ కెరీర్ కి హిట్టే లేని భామకు తొలి హిట్ నమోదైంది. ఈ నేపథ్యంలో కేతిక కు కొత్త అవకాశాలు క్యూ కడుతున్నాయనే విషయం లీకైంది. చిన్న నిర్మాతలంతా కేతిక వైపే చూస్తున్నారు. పారితోషికం పరంగానూ ఎలాంటి డిమాండ్ కూడా లేని నేపథ్యంలో నిర్మాతలు సౌకర్యంగా ఫీలవుతున్నారు. యంగ్ హీరోలకు పర్ఫెక్ట్ ఛాయిస్ గా నిలుస్తుంది. ఇప్పటికే ఓ ఇద్దరు నిర్మాతలు అడ్వాన్స్ లు చెల్లించి లాక్ చేసినట్లు సమాచారం. దీంతో కేతిక కూడా ఫుల్ ఖుషీగా ఉన్నట్లు కనిపిస్తుంది. వరుస పరాజయాల నేపథ్యంలో కేతిక శర్మ కెరీర్ ముగిసినట్లేనని అంతా భావించారు. ఇతర భాషల్లో కూడా అవకాశాలు రాకపోవడంతో తిరిగి ముంబై వెళ్లడమే ఆలస్యమన్నట్లు ప్రచారం మొదలైంది. సరిగ్గా అలాంటి సమయంలోనే సింగిల్ విజయం కొండంత భరోసా కల్పించింది. త్వరలోనే అమ్మడు కొత్త ప్రాజెక్ట్ ల వివరాలు వెల్లడించనుందని సమాచారం.

# బుట్టబొమ్మ క్యాలరీలు కరిగించే కళ

ప్రతి సినిమాకి మార్పు అవసరం. ఆర్టిస్ట్ లుక్ మారాలి. పాత్రకు తగ్గట్టు శరీరాకృతిని మలుచుకోవాలి. దాని కోసం తిండి కట్టేయాలి. తినే పదార్థాలు మారాలి. ఇలాంటి ప్రయోగాలు కథానాయికలకు కొత్తేమీ కాదు. ముఖ్యంగా వరుస సినిమాలతో క్షణం తీరిక లేనంత బిజీగా ఉన్న పూజా హెగ్డే నిరంతరం తన డైట్ చార్ట్ మార్చేస్తుంది. తన పాత్రకు తగ్గట్టు శరీరాకృతిని తీర్చిదిద్దుకుంటుంది. రెట్రో కోసం కొంత బొద్దెక్కిన ఈ బ్యూటీ ఇప్పుడు అనూహ్యంగా డైట్ మార్చేసింది. తాజాగా తన రోజువారీ తిండి వ్యాయామ షెడ్యూల్ ని రివీల్ చేసింది. నేలపై పడుకుని కేలరీలు బర్న్ చేస్తూ.. బ్రెడ్ - నూడుల్స్ తినడం వగైరా వగైరా విషయాలను షేర్ చేసింది. ఫిట్ నెస్ కోసం తపించడంలో పూజా తగ్గేదేలే! అని నిరూపిస్తోంది. ఇది సినిమా కోసం కాదు.. మంచి




రూపం కోసం ప్రయత్నం. శరీరం నుంచి అవసరం లేని ఫ్యాట్ ని తొలగించి తిరిగి తన పాత రూపానికి మారేందుకు పూజా ఇలా కఠిన వ్యాయామం చేస్తోంది.

పూజా ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీబిజీగా ఉంది. తదుపరి వరుణ్ ధావన్ - మృణాల్ ఠాకూర్‌తో కలిసి ఒక హిందీ సినిమా చేస్తోంది. కాంచన 4, జన నాయగన్, కూలీ చిత్రాలలోను నటిస్తోంది. టాలీవుడ్ లోను కంబ్యాక్ కోసం ప్రయత్నిస్తోంది. ప్రస్తుతానికి తమిళంపై ఆధారపడిన ఈ బ్యూటీ హిందీలోను పెద్ద అవకాశాల కోసం వెయిట్ చేస్తోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536